19 జులై 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లె, 99594 88088

## కథాక్రమం

మీకు నచ్చిన కథ ఉన్న వరుస మీద క్లిక్ చేయండి. నేరుగా ఆ కథ ఉన్న పేజీలోకి వెళ్లండి


| | | | |
|---|---|---|---|
| తెలుగుప్రభ | జీవనోపనిషత్ | బమ్మిడి జగదీశ్వరరావు | 94906 96911 |
| ఆంధ్రజ్యోతి ఆదివారం | అపరిచితుడు | నందకిషోర్ పులిపాక | 87907 87628 (w) |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | వివర్ణం | పొన్నాడ వెంకట అన్నాజీరావు | 94411 21556 |
| సాక్షి ఫన్‌డే | తరువుకి కాయభారమా! | డా.సన్నిహిత్ | 94909 56012 |
| ప్రజాశక్తి స్నేహ | తెలుగుతేజం | రాచపూటి రమేష్ | 98667 27042 |
| నవతెలంగాణ సోపతి | చదువు-చేయూత | శరత్ సుదర్శి | 73860 46936 |
| విశాలాంధ్ర | మలిపొద్దు వెలుగు | డా.బొద్దూరు విజయేశ్వరరావు | 94905 44551 |
| వార్త | పరిణీత | గన్నవరపు నరసింహమూర్తి | 77520 20123 |
| ప్రజాశక్తి స్నేహ | పెనవేసుకున్న బంధాలు | పేలూరి వెంకట మీనాక్షి | 99126 01765 |
| సూర్య | విషెస్ ఆఫ్ పుల్లారావు | డా.డివిజి శంకరరావు | 94408 36931 |
| వార్త | పుసుపుకుంకాలు | తిప్పాన హరిరెడ్డి | |
| సాక్షి ఫన్‌డే | ఆవిరి | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| ఆదర్శిని | పుస్తకాలు చేసే చికిత్స : బిబ్లియోగ్రఫీ | జగన్నాథశర్మ | 99854 67222 |
| 12.7.26 కథానిధి సమీక్ష | సమకాలీన జీవిత వైరుధ్యాలు | భూక్యా గోపి నాయక్ | 99891 59196 |


మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథా ప్రియులకు నమస్తే..

ఈ ఆదివారం (19 జులై 2026) కథల సంకలనం 38 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 12 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

సీనియర్ జర్నలిస్టు, రచయిత, నవ్య వారపత్రిక పూర్వసంపాదకులు జగన్నాధశర్మ.. పుస్తకాలు చదవడంలో ఉండే గొప్పదనం గురించి రాసిన చిన్న కథనం 'పుస్తకాలు చేసే చికిత్స: బిబ్లియోగ్రఫీ'ని కూడా అందిస్తున్నాము కింద లింక్ క్లిక్ చేయడం ద్వారా చదవండి.

**పుస్తకాలు చేసే చికిత్స: బిబ్లియోగ్రఫీ**

**కథానిధి పాఠకులకోసం ఈ వారంనుంచి ఒక కొత్త సదుపాయం అందిస్తున్నాను. మొదటి పేజీలో కథల వరుసక్రమం, రచయిత, ప్రచురణల వివరాలు ఉంటాయి. అందులో మీకు నచ్చిన కథ ఉండే వరుస మీద క్లిక్ చేస్తే.. పీడీఎఫ్ సంకలనంలో నేరుగా ఆ పేజీ కి వెళ్లిపోవచ్చు. ఈ సదుపాయాన్ని కథాప్రియులు వాడుకోగలరు**

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.

'12 జులై 2026 కథానిధి' కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం

ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**యూట్యూబ్ లో వినడం కోసం..**

**12 జులై 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లె

99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలే యకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు ***https://kathavasudha.com*** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి





# జీవనోపనిషత్

• బమ్మిడి జగదీశ్వరరావు

**చేప పిల్ల చిన్నదే, కాని దాని అనుమానం పెద్దది!**
**అనుమానం పెనుభూతం అనలేదు తల్లి చేప. అనుమానం ఆపద నివారణమార్గపు మార్గదర్శకత్వాలలో వొకటి అనుకుంది.**
**అలా తల్లి అనుకోబట్టే 'నీరు పల్లానికే యెందుకెళుతుంది?' తిరిగి అడిగగలిగింది పిల్ల చేప.**
**'నీరు పల్లమెరుగు... నిజం దేవుడెరుగు' పెద్దలమాట తలచుకు చెప్పింది తల్లి చేప.**
**'నీటికి పల్లం తెలుసు. దేవుడికి నిజం తెలుసు. మరి మనకేమిటి తెలుసు?' అడిగింది పిల్ల చేప.**
**తల్లి చేప నీళ్ళు నమిలింది.**

ఎగువ నుండి దిగువకు నీళ్ళు పారుతున్నాయి. ఆ నీటి వెంట కొమ్మా రెమ్మా ఆకూ అలమూ కొట్టుకుపోతున్నాయి. ఎప్పటికప్పుడు నీళ్ళు కడిగినట్టు తేటదేరిపోతున్నాయి. ఆకాశం అద్దంలో ముఖం చూసుకున్నట్టు నీళ్ళల్లో ముఖం చూసుకుంటోంది.

'అమ్మా... యెందుకీ యెదురీత? నీటివాలులో పడి కొట్టుకుపోతే సులువు కదా?' మళ్ళీ అడిగింది పిల్ల చేప.

'అలా కొట్టుకుపోతే మనకి లక్ష్యం వుండదు' తల్లి చేప చెప్పింది. 'జీవమున్నదేదీ వాలువెంట నిర్జీవంగా యెటు పడితే అటు కొట్టుకుపోదు' అని కూడా చెప్పింది. 'ఒకవేళ పోతే?' మళ్ళీ అడిగింది పిల్ల చేప. 'అప్పుడు యెక్కడికి చేరుతామో తెలీదు' అంది తల్లి చేప. 'ఇప్పుడు మాత్రం యెక్కడికి చేరుతామో తెలుసా?' అంది పిల్ల చేప. తల్లి దగ్గర సమాధానం లేదని పిల్ల దగ్గర ప్రశ్నలు లేకుండా లేదు.

చేపలన్నీ వాలు పోటుని తట్టుకొని కిలకిలమంటూ పైకి యెగబాకుతున్నాయి.

'పారే నీరు ఆగిపోతే?' వుండుండి అడిగింది పిల్ల చేప.

పిడుగు పడ్డట్టయింది. తల్లి చేపే కాదు, చుట్టూవున్న జట్టు చేపలన్నీ ఆ పిల్ల చేపవంక చూశాయి. 'నోరా వీపు మీదకి తేకే– అని యీ పిల్లకి యెన్నిసార్లు చెప్పను?' అని గొణుక్కోని వదిలెయ్యలేదు తల్లి చేప.

'నీళ్ళతో పాటు పల్లానికి కొట్టుకుపోతాం, లేదూ నీళ్ళే మనకన్నా ముందు జర్రున జారిపోతే, మనం నీళ్ళు లేక యిక్కడే...' అని వూహిస్తూ చెప్పలేకపోయింది తల్లి చేప. పిల్ల ప్రశ్నతో ప్రమాదం పసిగట్టినట్టు తల్లి చేప తోకాడిస్తూ పైకి వెళ్ళే వేగం పెంచింది. తప్పితే భయపడి వెనక్కి తిరిగి వెళ్ళిపోలేదు.

ఆ తల్లీ పిల్లా యీత కొడుతూ మాట్లాడుకోవడం చూసి– అలా అయితే అలసిపోతాయని తోటి చేపలు కొన్ని అనుకుంటే, అలసట లేకుండా యెంత దూరమైనా యీదొచ్చు అని మరికొన్ని చేపలు అనుకున్నాయి.

'నీళ్ళు పల్లానికి రావడం సరే, యిప్పుడే యెందుకు వస్తున్నాయి?' అడిగింది పిల్ల చేప.

'పైన పెద్ద చెరువు వుండొచ్చు. అది వర్షంపడి నిండిపోయి నీళ్ళు పొర్లిపోతూ వస్తుండొచ్చు...' తల్లి చేప చెప్పడం పూర్తికాలేదు. 'ఒకవేళ గట్టు కొట్టేసి నీళ్ళన్నీ రావచ్చు, మనం వెళ్ళేసరికి ఖాళీ అయిపోవచ్చు కదా?' పిల్ల చేప అనుమానం పిల్ల చేపది. 'అలా అనుకుంటే మనం ప్రయాణమే చెయ్యం. చెయ్యలేం. ఉన్నచోటే వుంటాం. నీళ్ళు వున్నన్నాళ్ళు వుంటాం. ఇవిరిపోయి యింకిపోతే మడుగులోనే వుండిపోయి చచ్చిపోతాం. అప్పుడు యెంత వెళ్ళాలన్నా నీటివాలు లేకుండా పైకి యించీ కూడా యెగబాకలేం...' చెప్పింది తల్లి చేప. పిల్ల చేప వూకొడుతూ వూహిస్తూ 'అప్పుడు మనం యీత కూడా మరిచిపోతాం' అర్థం చేసుకున్నట్టు తనలో తానే అనుకున్నట్టు అంది.

> మనం మనకన్నా చిన్నవైన పురుగుల్ని తింటాం, చేపల్ని తింటాం. ఔనూ... మనం పెద్ద చేపల్ని యెందుకు తినం?' అడిగింది పిల్ల చేప. 'తినం కాదు, తినలేం' దిద్దింది తల్లి చేప. 'అదే యెందుకు?' నిలదీసినట్టు అడిగింది పిల్ల చేప. 'పెద్ద చేపకు పెద్ద నోరు... చిన్న చేపకు చిన్న నోరు' అని చెప్పి, చెప్పింది చాల్లేదనేమో 'చిన్న చేపలకు చిన్న పొట్ట... పెద్ద చేపలకు పెద్ద పొట్ట' అంతకుమించి చెప్పలేకపోయింది తల్లిచేప.

మెచ్చుకోలుగా చూసింది తల్లి చేప.

'నీరు పల్లం యెరిగినప్పుడు... నీరు పల్లానికి ప్రయాణిస్తున్నప్పుడు నీటిలో బతికే మనం యెగువకు ప్రయాణించడంలో అర్థం లేదు' అంది పిల్ల చేప. తల్లి చేప వొక్కక్షణం యీత ఆపేసి నీటివాలుతో పాటు వెనక్కి కొట్టుకు వచ్చింది. 'పైగా నిజం దేవుడెరుగు యేమిటి? మనం యెరగాల్సింది యెరక్కుండా పోతూ...' పిల్ల చేప ముందుకు వెళ్ళకుండా తల్లికోసం వెనక్కి వచ్చింది.

తల్లి చేప ఆలోచనల్లో పడింది. పారిన నీళ్లన్నీ పల్లానికి చేరడం నిజమే కదా అనుకుంది. కాని యెందుకో నిజాన్ని వొప్పుకోబుద్ధి వెయ్యలేదు. 'నదులన్నీ కలిసే సముద్రం కూడా పల్లంలోనే వుంటుంది' తల్లి చెప్పిన మాట తల్లికే గుర్తుచేసింది పిల్ల చేప. అయినా తెలిసీ తల్లి చేప అంగీకరించలేదు. తరాల తరబడి పారంపర్యంగా వస్తున్న ఆచారమది. సంస్కృతి అది. సాంప్రదాయమది. అటువంటి వారసత్వ పద్ధతిని కాదని పైకి యెగబాకి యెదురీదడం మానేసి– కిందికి నీటితో పాటు పోవడం సరికాదని అనుకుంది. అది మత్స్య జాతిలోనే యెన్నడూ లేనే లేదనీ జరగలేదనీ అనుకుంది.

'నీళ్ళు పల్లానికి పోతున్నప్పుడు ఆ నీటివెంట కీటకాలూ నాచూ అన్నీ వస్తాయి, జీవం లేనివి... జీవమున్నా యెదురీదలేనివి... అంటే ఆ వచ్చే ఆహారానికి యెదురువెళ్ళాలన్న మాట' చెప్పింది తల్లి చేప. మనం యెదురు రాలేదని అవి కొట్టుకురాకుండా వుంటాయా? మన కాళ్ళ దగ్గరికి కొట్టుకుంటూ వస్తాయి కదా– అడగాలని పిల్ల చేప అడగలేదు. ఆలోచనల వొరవడిలో పడి ఆతర్వాత వచ్చిన మరో ఆలోచనలోకి యీదింది.

చేపలు యెవరో పోటీ పెట్టినట్టు పైపైకి పరుగులు తీస్తున్నాయి.

'అమ్మా... పెద్ద నీళ్ళలో పెద్ద చేపలు వుంటాయి కదా?' పిల్ల చేప అడిగింది. 'ఎందుకుండవ్?' అంది తల్లి చేప. 'అవి మనల్ని తినేస్తాయేమో?' అనుమానంగా చూసింది పిల్ల చేప, తల్లి తోక చుట్టూ తిరుగుతూ.

'పెద్ద చేపలున్నాయని చిన్న చేపలు నీళ్ళలోంచి వొడ్డెక్కి చెట్టెక్కిపోతాయా?' నవ్వింది తల్లి చేప. 'ఒడ్డెక్కితే చచ్చిపోతాం కదా?' అమాయకంగా అంది పిల్ల చేప. 'తెలిసి చచ్చిపోవడం కంటే, యెప్పుడు చచ్చిపోతామో తెలియకుండా చచ్చిపోవడం మంచిదే కదా?' అంది తల్లి చేప.

పిల్ల చేప మౌనంగా వుండిపోయి, అంతలోనే తేరుకొని తల్లిని అందుకోవడానికి యీత వేగం పెంచింది. తల్లిచుట్టూ తిరుగుతూ యెదురీదుతోంది.


'ఎక్కడున్నా పెద్ద చేపలు చిన్న చేపల్ని తింటాయి, యెందుకూ?' పిల్ల చేప అనుమానాలకు అంతులేదు. 'అది మత్స్య న్యాయం... అదే లోక న్యాయం' చెప్పింది తల్లి చేప. పిల్ల చేపకు బోధ పడలేదని దాని కళ్ళుచూసి అర్థం చేసుకుంది తల్లి.

'తనకన్నా చిన్న చేపని మింగి పెద్ద చేప బతుకుతుంది' అంది తల్లి చేప. 'బతకాలి అంటే తినాలి. తినాలి అంటే అది మనకన్నా చిన్నదై వుండాలి...' అర్థం చేసుకుంటున్నట్టు కూడబలుక్కుంటూ అంది పిల్ల చేప. 'మనం మనకన్నా చిన్నవైన పురుగుల్ని తింటాం, చేపల్ని తింటాం. ఔనూ... మనం పెద్ద చేపల్ని యెందుకు తినం?' అడిగింది పిల్ల చేప. 'తినం కాదు, తినలేం' దిద్దింది తల్లి చేప. 'అదే యెందుకు?' నిలదీసినట్టు అడిగింది పిల్ల చేప. 'పెద్ద చేపకు పెద్ద నోరు... చిన్న చేపకు చిన్న నోరు' అని చెప్పి, చెప్పింది చాల్లేదనేమో 'చిన్న చేపలకు చిన్న పొట్ట... పెద్ద చేపలకు పెద్ద పొట్ట' అంతకుమించి చెప్పలేకపోయింది తల్లిచేప. 'అంటే పెద్ద చేపకు పెద్ద ఆకలి. చిన్న చేపకు చిన్న ఆకలి...' ఆలోచిస్తూ అంటున్న పిల్ల చేపని చూసి 'ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టు యెంత జీవికి అంత ఆకలి. అలాగని ఆకలికి చిన్నా పెద్దా లేదు' బోధపరిచింది తల్లి చేప.

'ఆకలి అందరికీ సమానం అయినప్పుడు ప్రాణం అందరికీ సమానం యెందుక్కాదూ?' కొద్ది సేపటి తరువాత పిల్ల చేప అడిగింది. పిల్ల చేప యింకా ఆలోచిస్తోందని తల్లి చేపకు అర్థమయింది. అందుకే మనసు మరల్చడానికి మాట మార్చింది. 'తొందరగా పద' అంది తల్లి చేప, యీత వేగం తగ్గించకుండా. పిల్ల చేప తల్లి ముక్కుమీద వాలి గట్టిగా పట్టుకుంది.

'ప్రాణం అంటే ఆహారం కదా అమ్మా?' పిల్ల చేప తల్లి ఆ కన్నులోకి యీ కన్నులోకి చూస్తూ అడిగినా– వినపడి కూడా వినపడనట్టే వూరుకుంది తల్లి చేప. 'తినకపోతే– తినని చేప చచ్చిపోతుంది. తింటే– తిన్న చేప చచ్చిపోతుంది. అంటే ప్రాణమే ఆహారం. ఆహారమే ప్రాణం!' అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టుగా వొక్కోమాటని బరువుగా పలికింది పిల్ల చేప.

'నీ చిన్న బుర్రకు పెద్ద ఆలోచనలు యెందుకు?' అని అనబోయి ఆగిపోయింది తల్లి చేప. ఎందుకంటే తనుకూడా ఆలోచనల్లో పడిపోయింది. అప్పుడే తన ముఖానికి యెర తగిలితే ఆలోచనలు యెగిరిపోయి ఆగిపోయి తినబోయింది. నోరు పట్టలేదు. అంతలోనే పెద్ద చేప వచ్చి యెరని చప్పున తినేసి పైకి యెగిరినట్టు క్షణాల్లో మాయమయిపోయింది. తల్లి చేపా పిల్ల చేపా ఆ దృశ్యాన్ని చూసి నివ్వెరపోయాయి.



నీళ్ళన్నీ అల్లకల్లోలం అయిపోయాయి, చేపల్లాగే. నీళ్ళు కెలకలయ్యాయి. తల్లి చేప తల్లడిల్లింది పిల్ల చేప కోసం. అటూ యిటూ యీదుతూ వెతుకుతోంది. నీళ్ళు తేటదేరుతూ వుండగా పిల్ల చేప గొంతు వినిపించింది, తను ముక్కు మీదినుంచి జారి చెంపని పట్టుకొనే వుంది.

'ఎరలు కూడా మనల్ని యెత్తుకెళిపోతాయా అమ్మా...' పిల్ల చేప నోట్లో మాట నోట్లో వుండగానే మరో పెద్ద చేప నోట్లోకి నీళ్ళతో పాటు వెళ్ళి చెంపల్లోంచి బయటకు వచ్చాయి తల్లీ పిల్లలు. ఉపద్రవం వచ్చి వెళ్ళినట్టుగా అయింది. నీళ్ళలోనే కాదు కలకలం... ఆ చిన్ని చేపల గుండెల్లోనూ.

మాటల్లేవు. ప్రయాణం ఆగలేదు. మళ్ళీ ముందుకే. ఈదుతూ. ఎదురీదుతూ.

'అసలు చేపలు చేపల్నే యెందుకు తినాలి?' పిల్ల చేప మాటలకు చుట్టూవున్న చేపలు ఆగి గిర్రున దగ్గరకు వచ్చాయి.

'మత్స్యమైపుట్టి మత్స్య న్యాయాన్నే ప్రశ్నిస్తావా?' ఆవేశంతో బోర విరిచి, పొగరుగా తోకతో తట్టి మరీ అడిగింది తోటి చేపొకటి.

పిల్ల చేపకు తల్లి చెప్పిన కథలు గుర్తుకువచ్చాయి. ఆ కథలవల్ల పులి మేకను తింటుందని తెలుసు. మేక కాకపోతే జింకను తింటుంది. అందమైన పక్షి అనాకారి అయిన పురుగుల్ని తింటుందని తెలుసు. అందుకే 'పక్షులూ జంతువులూ తమ జాతిని తాము తినవు, మన జాతిలోనే యీ స్వజాతి భక్షణ యెందుకూ?' అడిగింది పిల్ల చేప.

ఒకే రకం చేపలన్నీ వొకే చోట గుమికూడాయి. కిలకిల మాని కలకలము అయ్యాయి. ఆ పిల్ల చేపను చూస్తే– మత్స్యజాతినే అసహ్యించుకుంటున్నట్టుగా తోచింది వాటికి.

'మనకే మనజాతికే భేదమూ ఖేదమూ అనుకోవద్దు. ప్రతి జాతి తనకంటే అల్పమైన జాతిని తింటుంది. పాము కప్పనే కాదు, పామునీ తింటుంది. కప్ప కూడా కప్పని తింటుంది. కాని కప్ప పెద్దదైనప్పుడు పాము పిల్లయినప్పుడు కప్ప పామునీ తింటుంది. ఎన్ని బాంద్రకప్పల్ని చూడలేదూ? ఆమాట కొస్తే అల్పమైన జాతి దొరక్కపోతే స్వజాతిలోనే అల్పమైన దాన్ని చూసుకుంటుంది. అంతేకాని స్వజాతిని అంటరానిదిగా ఆకలికి పనికిరానిదిగా యే జీవీ చూడదు. భావించదు. అప్పుడూ తింటుంది. అన్నాన్ని కాదంటే కళ్ళు పోతాయి. అందుకే కళ్ళకద్దుకొని మరీ తినాలి. అన్నం అంటేనే తినేది. తినబడేది కూడా. అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఎంచరాదు...' ముదర చేప చెప్పుకుపోతోంది.

ఈ చర్చల్లో వుండగా తమకన్నా వొక పిసరంత పెద్ద చేప వచ్చి పుంజిడు చిన్న చేపల్ని చటుక్కున నోటితో పట్టి మింగలేక కక్కలేక కష్టపడి ఆపై గుటుక్కున దిగమింగేసి పోయింది.

'చేప జాతిలో పుట్టి చేపల్నే తింటావా? ఛీ' అని వొక్క చేపా అడగలేదు. అన్యాయమనీ అనలేదు. ఆ విషయమే పిల్ల చేప గొంతెత్తి అడిగింది. 'మనకన్నా పెద్దది కావడం తప్ప ఆ చేపకు యేం అర్హత వుందని, మనల్ని తినడానికి? దానికేమయినా రెండు తోకలున్నాయా?' అంది పిల్ల చేప. 'పెద్దది కావడం అంటే కొలతలో పెద్దది కావడమే అనుకోకు. బలంలో పెద్దది కావడం. బలంలో పెద్దది కావడం అంటే శక్తి సామర్థ్యాలలో పెద్దది కావడం. మనమీద పెత్తనంలో పెద్దది కావడం' ముదురు చేప చెప్పడం పూర్తికాలేదు, 'బలవంతుడికి బలహీనుడు లొంగివుండాలి' అంది తల్లి చేప. 'లొంగి వుండడం కాదు, అన్నంగా వుండాలి' అంది పిల్ల చేప. అని ఆగలేదు, 'ఆ పెద్ద చేప చటుక్కున నోటితో మన బుల్లి చేపల్ని పట్టుకున్నప్పుడైనా అందరం కలిసి వెళ్ళి ఆపే ప్రయత్నం చెయ్యాలి కదా?' గింజుకుంది పిల్ల చేప.

> 'బలవంతుడికి బలహీనుడు లొంగివుండాలి' అంది తల్లి చేప. 'లొంగి వుండడం కాదు, అన్నంగా వుండాలి' అంది పిల్ల చేప. అని ఆగలేదు, 'ఆ పెద్ద చేప చటుక్కున నోటితో మన బుల్లి చేపల్ని పట్టుకున్నప్పుడైనా అందరం కలిసి వెళ్ళి ఆపే ప్రయత్నం చెయ్యాలి కదా?' గింజుకుంది పిల్ల చేప.

'నీకు బుర్ర లేదా? నువ్వే అన్నట్టు మన చిన్న చేపలు పెద్ద చేపలకు అన్నం. అన్నం తింటున్నప్పుడు ఆటంకపరచడం మహా పాపం' అని తల్లి చేప సహా అన్ని తోటి చేపలూ పిల్ల చేపని తలంటి తిట్టిపోశాయి. ఆ తరువాతే ఆహారమైపోయిన ఆ నాలుగు చేపలకు నివాళులు అర్పించాయి. వాటి కుటుంబసభ్యులకు తమ సానుభూతిని తెలియజేశాయి. దేవుడు వాటి నుదిటన అలా రాశాడని సరిపెట్టుకొని, కళ్ళు తుడుచుకొని ఆ చేపలు మళ్ళీ యెదురీదడం మొదలుపెట్టాయి.

నీళ్ళు వీటన్నిటినీ కడగలేనన్నట్టు తన తోవన తాను పారుతోంది. ఒంటికాలి మీద తపస్సు చేస్తున్న కొంగ నీడని నీట్లో చూసి యీదుతున్న చేపలన్నీ వొక్కసారిగా బిక్కటిల్లిపోయాయి. అడుగుకు చేరి నెమ్మదిగా మట్టిలో దూరి పాకుతూ మన్ను వెన్ను మీద పోసుకుంటున్నాయి, కనపడకుండా. అంతకుముందే తల్లి చెప్పిన జాగ్రత్తలవల్ల అనుభవాలవల్ల అర్థం చేసుకున్న పిల్ల చేపకు ఆ సమయంలోనూ అనుమానం వచ్చింది. ఆగలేకపోయింది. 'అమ్మా... కొంగమామ వొంటికాలితో వొంటికన్నుతో దొంగ జపం చేసేకన్నా నిజం జపం చేస్తే యెంచక్కా ఆ దేవుడే ప్రత్యక్షమవుతాడు కదా, అది మానేసి పీతి పొట్టకోసం మనల్ని వేటాడమెందుకూ?' పిల్ల చేప అడిగింది.

ఆ మాటని నిజం చేస్తూ అప్పుడే కొంగ గుటుక్కున నోటికి దొరికిన చేపల్ని మింగింది. తమకన్నా పెద్ద చేప నోటికి దొరకడంతో కొంగ యెగిరిపోయింది.

ఆపద దాటి యెదురీదిన చేపలు 'బతుకు జీవుడా' అనుకున్నాయి. కర్మనుకున్నాయి. దేవుడలా రాసి పెట్టాడని అనుకున్నాయి. 'ప్రతి గింజమీద తినేవాడి పేరు రాసుంటుందట కదా? మరి ప్రతి చేపమీద తినే స్వజాతి చేపగారి పేరో విజాతి కొంగగారి పేరో రాసివుంటుందా?' పిల్ల చేప అనుమానం పిల్ల చేపది. తల్లి చేపే కాదు, యే చేపా పిల్ల చేప ప్రశ్నలకు జవాబు యివ్వలేదు. 'నోర్మూసుకు యీదు' అన్నాయి.

పిల్ల చేప యీదుతూ తల్లి చేప ముందుకు వచ్చి 'అమ్మా... దేవుడు నా నుదుటిమీద నావొంటి మీద యేమని రాశాడు? ఎవరి పేరు రాశాడు?' అని తల్లి చేపని అడిగింది పిల్ల చేప. 'అది చదివే శక్తి నాకే కాదు, యే జీవికీ లేదు' చెప్పింది తల్లి. 'అంటే... దేవుడి రాత దేవుడికే బోధపడుతుందన్నమాట...' పైకే అనుకుంది పిల్ల చేప.

'తప్పు నీ పిల్లది కాదు, దాని వయసుది' అంది ముదురు చేప, తల్లి చేపకేసి చూస్తూ. ఆపై పిల్ల చేపని చూసి నవ్వింది. పిల్ల చేప నవ్వలేదు. 'నా అనుభవమంత లేదు నీ వయసు' మళ్ళీ అంది ముదురు చేప. 'నీకింకా చెంప పండలేదు' అని కూడా అంది. అప్పుడు పిల్ల చేప అంది. 'ఎంత అనుభవం వుంటే యేమి లాభం? నువ్వు చిన్న చేపవి చిన్న చేపవే, యెప్పటికీ పెద్ద చేపవి కాలేవు. పెద్ద చేపకి ఆహారం కావడం తప్ప' అంది చిన్న చేప. 'తప్పు నాది కాదు, దేవుడు యీ జీవుడ్ని అలా పుట్టించాడు' దిగులుగా అంది ముదురు చేప.

నీటి గలగలలు వినిపించేంత నిశ్శబ్దం.

'దేవుడు మనలా చిన్న చేప పిల్లై పుడితే బాగుణ్ణు' అంది పిల్ల చేప. ఆ మాటతో తల్లి చేపా ముదురు చేపా తోటి చేపలన్నీ అలాగే నోరు తెరచుకు వుండిపోయాయి. ముందుగా తేరుకొన్న ముదురు చేప 'మళ్ళీ పుట్టడం యెందుకు? దేవుడు నీలోనూ వున్నాడు కదా?' అంది. పిల్ల చేప చూపు చూస్తే అది ఆ మాటని నమ్మినట్టు లేదని బోధపడింది. అందుకని ముదురు చేప మళ్ళీ చెప్పింది.

'దేవుడు నీలో వున్నాడు, నాలో వున్నాడు. ప్రతి జీవిలోనూ వున్నాడు' అని. 'అంటే, పెద్ద చేపల్లోనూ చిన్న యెరల్లోనూ తెల్ల కొంగల్లోనూ దేవుడు వున్నాడా?' అమాయకంగా అడిగింది పిల్ల చేప. లేదు– అని అక్కడున్న చేపలేవీ చెప్పలేకపోయాయి.

> పిల్ల చేప యీదుతూ తల్లి చేప ముందుకు వచ్చి 'అమ్మా... దేవుడు నా నుదుటిమీద నావొంటి మీద యేమని రాశాడు? ఎవరి పేరు రాశాడు?' అని తల్లి చేపని అడిగింది పిల్ల చేప. 'అది చదివే శక్తి నాకే కాదు, యే జీవికీ లేదు' చెప్పింది తల్లి. 'అంటే... దేవుడి రాత దేవుడికే బోధపడుతుందన్నమాట...' పైకే అనుకుంది పిల్ల చేప.

అక్కడున్న ఆ చిన్న చేపల ముఖాల్లో పెద్ద దిగులే కమ్ముకుంది. కాని పిల్ల చేప ముఖంలో మాత్రం అప్పటికప్పుడు యేదో తేజస్సు వచ్చిచేరింది. 'దేవుడు యెక్కడున్నాడో తెలిసిపోయింది' అని సంతోషంతో గంతులేసింది. బుడుంగు బుడుంగుమని మునిగి తేలింది.

పిల్ల చేప చుట్టూ పెద్ద చేపలన్నీ చేరాయి. దేవుడు యెక్కడ వున్నాడో చెప్పమన్నట్టు చూశాయి. దేవుడే ఆ పిల్ల చేపలో దూరి జ్ఞానం పంచుతున్నట్టు ఆశగా తేరిపార చూశాయి. అప్పుడు పిల్ల చేప యిలా చెప్పింది.

'చిన్న చేపా పెద్ద చేపా వున్నప్పుడు దేవుడు పెద్ద చేపలో వుంటాడు. అందుకే పెద్ద చేపకి అంత బలం. చేపా కొంగా వున్నప్పుడు దేవుడు చేపలో వుండకుండా కొంగలో వుంటాడు. అందుకే కొంగకి అంత బలం. అలాగని దేవుడు అన్నీ పెద్ద వాటినే యెంచుకోడు. చిన్న యెరలోనూ వుంటాడు. అందుకే దేవుడే పుట్టిస్తాడు... దేవుడే తీసికెళిపోతాడు– అని అనేది'

పిల్ల చేప బోధపరచుకొని తిరిగి బోధ చేయడం యింకా పూర్తికాలేదు. చేపలన్నీ క్షణకాలంలోనే వొక పెద్ద వలలో వున్నాయి. నీళ్ళు కారుతూ. ఊపిరి అందనట్టు యెగిరిపడి కొట్టుకుంటూ.

'ఇప్పుడు దేవుడెక్కడున్నాడూ?' అంత విషమ సమయంలోనూ పిల్ల చేప ప్రశ్న వేయడం మానలేదు.

'ఇప్పుడు దేవుడు జాలరి పగ్గంలో వున్నాడు' అన్ని చేపలదీ వొకే మాట! ✿

## రచయిత



బమ్మిడి జగదీశ్వరరావు పుట్టింది శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో. 1998 నుంచి హైదరాబాద్‌లో నివాసం. వృత్తి– ప్రవృత్తి రచనే. అయిదు వందల కథలు రాశారు. రెక్కల గూడు, పిండొడిం, దేవుళ్ళు దెయ్యాలూ మనుషులూ, మట్టితీగలు, హింసపాదు, రణస్థలి, మనువాచకం, ఈతిహాసము, లోకాయణము అనే కథా సంపుటాలు వెలువరించారు. ఆరు జానపద కథా సంపుటాలు, ఒక పిల్లల కథా సంపుటితో కలిపి మొత్తంగా ఆయనవి ముప్పైయ్యొక్క పుస్తకాలు ప్రచురితమయ్యాయి. హిందీ, అస్సామీ, బెంగాలీ, కన్నడ భాషల్లోకి కొన్ని కథలు అనువాదమయ్యాయి. బాస, మాతృకలో, ప్రజాతంత్ర, సారంగ, విరసం డాట్ ఆర్గ్, తెలంగాణ డాట్ ఇన్, కొలిమి, వసంతమేఘం వంటి పత్రికలు, వెబ్ మ్యాగజైన్స్‌లలో కథలతో కూడిన కాలమ్స్ రాశారు– రాస్తున్నారు కూడా. సినీరంగంలోనూ బమ్మిడికి ప్రవేశం ఉంది. కథ, స్క్రీన్ ప్లే, మాటలు రాస్తున్నారు. కొన్ని డాక్యుమెంటరీలకు పనిచేశారు.

☎ 9490696911

## వ్యవస్థలో ఓ పనిముట్టు, అది తెలియకపోతే...

'**కా**లసర్పం' కథ చదివిన తర్వాత రచయిత నాకు తెలిసిన పండరీనాథ్ కాదని తోచింది. బహుశా ఇది అతని అచ్చయిన మొదటి కథ అనుకుంటా. మొదటి కథలోనే వస్తుశిల్పాల్లో సమతూకం పాటించాడు. కథనంలో మనకు రావిశాస్త్రి కనిపిస్తాడు. కానీ వర్ణనలు, రచయిత జోక్యం అంతగా కనిపించవు. ఆధునిక శిల్పంలోని రహస్యం అదే అనుకుంటా. బహుశా ఇటువంటి కథలు మనకు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా ప్రజల్లో భయాన్ని కల్పించి హీరోగా గుర్తింపు పొందిన పోలీసాఫీసర్ శంకర్ లెక్క తప్పి వ్యవహరించడంతో పతనావస్థకు చేరుకోవడం ఈ కథ సారాంశం. ఇది ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు శంకర్ కథ. అతని కథను ప్రారంభించి, ముగించడంలో ప్రభల పండరీనాథ్ అద్భుతమైన కళాప్రదర్శన చేశాడు. పండరీనాథ్ రిపోర్టర్‌గా పనిచేశాడు. అనేక స్టింగ్ ఆపరేషన్లు కూడా చేశాడు. వార్తలు, వార్తాకథనాలు మాత్రమే రాశాడు. కానీ ఫిక్షన్ రాయలేదు. ఇప్పుడు అతను కథారచన అనే సృజనాత్మక రంగంలోకి ప్రవేశించాడు.

పెద్దల ఆదేశాలతో శంకర్ ఎన్‌కౌంటర్ పేరు మీద కొంత మందిని చంపుతూ ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరు సంపాదించుకున్నాడు. అతని ధైర్య సాహసాలను సమాజం కూడా మెచ్చుకుంటుంది. దానికితోడు ధనం కూడా సమకూరుతుంటుంది. అలా ఒక వెలుగు వెలిగిన శంకర్ స్థాయి పూర్తిగా దిగజారిపోయిన తర్వాత ఎవరూ పట్టించుకోరు. ఖర్మపల్లి మస్తాన్ రఫీ అలియాస్ రఫీ కాల్చివేత శంకర్ పాలిట శాపంగా మారుతుంది. రఫీ గురించి రచయిత చెప్పినప్పుడు మనకు గులాం రసూల్ గుర్తుకు వస్తాడు. ఒక వాస్తవాన్ని కాల్పనిక స్థాయికి తీసుకుని వెళ్లాడు రచయిత. తద్వారా విశ్వ జనీన సత్యాన్ని చాటాడు. ఇటువంటి కథను కేవలం పండరీనాథ్ మాత్రమే రాయగలడు అనిపిస్తుంది. ఎందుకంటే, క్రైమ్ రిపోర్టింగ్‌లో అతనిది తిరుగులేని చేయి. అతని కలం నుంచి మరిన్ని కథలు రావాలని ఆశిస్తూ, అందులో వెలుగు చూడానికి సామాజిక కోణాలు ఆయన కథల్లో ప్రతిఫలించాలని కోరుకుంటున్నాను.

• కాసుల ప్రతాపరెడ్డి




## కట్టుకథల గుట్టు విప్పిన 'కాలసర్పం'!

**పం**డరినాథ్ ప్రభల రాసిన కథ 'కాలసర్పం' నిజ ఘటనకు ప్రతిరూపంలా ఉంది. కథలోని శంకర్ పాత్రధారి పోలీసుగా తన వృత్తిధర్మాన్ని మరిచి ఒక అమానవీయ వ్యక్తిగా వ్యవహరిస్తుంటాడు. ఎన్‌కౌంటర్లు చేస్తే కెరీర్‌లో ఎదగడానికి అవి సోపానం అవుతాయని నమ్ముతాడు. దీంతో పాటు పేరు, డబ్బు వస్తాయిని అనుకుంటాడు. తను అనుకుంటేనో లేదా పై అధికారులు ఆదేశిస్తేనో నిర్దాక్షిణ్యంగా అతని చేతి వేలు ట్రిగర్ నొక్కేస్తుంటుంది. అతనొక హీరో అన్నట్టుగా మీడియాలో హైప్ క్రియేట్ అవుతుంది. తను చేసే పనికి ఎదురుగా ప్రశ్నలు, విమర్శలు రాని స్థాయిలో వ్యవహారం అంతా గుట్టుగా సాగిపోతుంటుంది. ఇలాంటి సంఘటనలు మన మధ్య ఇప్పుడు కూడా జరుగుతున్న విషయం తెలిసిందే. విజయవాడలో లాకప్ డెత్‌గా వార్తలు వచ్చిన సాయికృష్ణ తల్లి రోదిస్తూ 'నా కొడుకును చంపేశారని అంటున్నారు. శవాన్ని కాల్చేశారేమో. కనీసం బూడిద అయినా ఇవ్వండి సార్లో' అని వేడుకుంటున్న దృశ్యాలు చూశాం. ఇక్కడే 'కాలసర్పం' కథ పాఠకులకు బాగా కనెక్ట్ అయింది.

శంకర్ చివరి ఎన్‌కౌంటర్‌లో ఎక్కడో తేడా కొడుతుంది. లోగుట్టు బయటికి పొక్కుతుంది. ఏ పోలీసు వ్యవస్థ అండని చూసుకుని అతను రెచ్చిపోతాడో.. అదే వ్యవస్థ అతన్ని అనుమానంగా చూస్తుంది. అప్పటివరకూ ఉన్న హీరో ఇమేజ్ తలకిందులై... శంకర్‌ని అందరూ హంతకుడిగా చూసే పరిస్థితి వస్తుంది. ట్రిగర్ నొక్కి ఎందరో మనుషుల కథ ముగించిన శంకర్.. చివరికి తన కథ కూడా ముగింపుకొచ్చిందని తెలిసి తట్టుకోలేకపోతాడు. ఇదీ సంక్షిప్తంగా కాలసర్పం సారాంశం. రచయిత పండరినాథ్ ప్రభల కథాకథనాన్ని నేర్పుగా మలిచి, ఆద్యంతం ఆసక్తిగా చదివించేలా రాశారు. సన్నివేశాల తీరు వాస్తవాలను ప్రతిబింబించేలా చిత్రించారు. ఇలాంటి కథలు పాఠకులను ఆలోచింపజేస్తాయి.

• వలీ హుసేన్

## మానవ నైతిక సంక్షోభాల లోతుల్ని తవ్విన కథ

**సా**హిత్యం కేవలం సమాజపు పైకి కనిపించే పొరలను మాత్రమే కాకుండా, మనిషి అంతరంగంలో గూడుకట్టుకున్న అదృశ్య కోణాలను, అమానుష ప్రవృత్తులను సైతం నిర్మొహమాటంగా విశ్లేషించగలగాలి. అప్పుడే అది ప్రయోజనాత్మకమైన, జీవమున్న సాహిత్యం అవుతుంది. ఆదివారం తెలుగుప్రభ సంచికలో పండరీనాథ్ ప్రభలగారు రచించిన కాలసర్పం కథ చదివిన తర్వాత నాలో కలిగిన బలమైన భావన ఇదే. పైకి ఇది ఒక నేర పరిశోధనాత్మక (క్రైమ్) కథలా కనిపించినా, నిశితంగా పరిశీలిస్తే ఇందులో అడుగడుగునా మానవ సంబంధాల విధ్వంసం, నైతిక విలువల పతనం, మనిషిలోని అస్తిత్వ పోరాటం స్పష్టంగా గోచరించాయి. కథలో పోలీసుల దర్యాప్తు అనేది కేవలం ఒక బాహ్య చట్రం మాత్రమే. ఆ చట్రం లోపల నలిగిపోతున్న, భయంతో కూరుకుపోతున్న, ప్రాణరక్షణ కోసం ఎంతటికైనా తెగించే మనుషుల నిజ స్వరూపాలను రచయిత ఎంతో వాస్తవికంగా, ఒక సామాజిక శాస్త్రవేత్త దృష్టితో చిత్రించారు.

కథన శిల్పం విషయానికి వస్తే ఎక్కడా ఉత్కంఠ సడలకుండా, పాఠకులను ఏకబిగిన చదివించే గుణం ఈ కథలో పుష్కలంగా ఉంది. నేరస్తుడు పోలీసుల కళ్ళు కప్పగలడేమో కానీ, సమాజాన్ని శాసించే కాలం అనే మహాసర్పం కళ్ళ నుంచి ఎన్నటికీ తప్పించుకోలేడు అనే తాత్విక సత్యాన్ని రచయిత ఇందులో అంతర్లీనంగా ప్రవచించాడు. మనిషి చేసే ప్రతి అమానుష చర్యకు కాలం ఏదో ఒక రూపంలో కాటేసి తీరుతుంది అన్నదే ఈ కాలసర్పం ఇస్తున్న ఒక మౌన హెచ్చరిక. పండరీనాథ్ భాషా ప్రయోగం, పాత్రల చిత్రణలో ఎక్కడా కృతకత్వం లేదు. వాస్తవికతకు అద్దం పట్టేలా ఉన్న సంభాషణలు కథాగమనానికి ఎంతో బలాన్నిచ్చాయి. నేటి పెట్టుబడిదారీ, ఆధునిక సమాజంలో డబ్బు, వ్యామోహాల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతున్న మనిషి మానసిక సంఘర్షణకు ఈ కథ ఒక సజీవ సాక్ష్యం.

• భూక్యా గోపీనాయక్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# అపరిచితుడు

- నందకిషోర్ పులిపాక

ఢిల్లీ నుంచి మద్రాస్‌కి బయల్దేరిన లగ్జరీ ట్రైన్ ఫస్ట్ క్లాస్ కూపేలోకి ఎంటరయ్యాను.

అతను లేటెస్ట్ ఇంగ్లీష్ మూవీ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నాడు.

"మీరు మాధవ్" అన్నాను పలకరింపుగా.

ఐపాడ్‌లో మూవీ చూస్తూ తల ఊపాడు.

"నా పేరు రమణ. మనిద్దరం మద్రాస్ వరకూ కలిసి ప్రయాణం చేస్తున్నాం.. సుమారు 24 గంటలు" నవ్వుతూ చెప్పాను.

వేణుమాధవ్ అతని పూర్తి పేరు. ఆ పేరుని బట్టి ఎందుకో అతనంటే నాకో మంచి అభిప్రాయం కలిగింది. ట్రైన్ డిజిటల్ చార్ట్‌లో చూశాను అతని పేరు.

"మద్రాస్‌లో ఎక్కడ ఉంటారు?" అడిగాను.

ఒక లగ్జరీ ఫైవ్‌స్టార్ హోటల్ పేరు చెప్పాడు.

"అరే నేను కూడా అక్కడే స్టే చెయ్యబోతున్నాను వారం రోజులు."

'అవునా' అన్నట్టు చూశాడు.

"బిజినెస్ పనిమీద" అని చెప్పాను.

"ఏం బిజినెస్ చేస్తూ ఉంటారు?"

"ఫైనాన్స్ బిజినెస్. పది సంవత్సరాల క్రితం మొదలుపెట్టాను. సెలెక్టెడ్ క్లయింట్స్ పదిలంగా ఉన్నారు. ఎక్కువ వడ్డీ ఆశించను. మార్ట్‌గేజ్ మీద ఇస్తాను. రూపాయికి తక్కువ వడ్డీ. సులభ వడ్డీ" అని నా కంపెనీ పేరు చెప్పాను.

"అవునా ... పెద్ద కంపెనీ. టర్నోవర్ కూడా ఎక్కువే. మరి ఫ్లైట్లో వెళ్లకుండా ఎందుకు ట్రైన్‌లో వస్తున్నారు?" ఆసక్తిగా అడిగాడు.

"నాకు ట్రైన్ జర్నీ అంటే ఇష్టం. ఫ్లైట్‌లోలా వెయిటింగ్, చెక్-ఇన్, చెక్-అవుట్.. మొత్తం మీద పెద్ద తేడా ఉండదు. ట్రైన్‌లో అయితే ఓ రోజు రిలాక్స్ అవ్వొచ్చు. ఫోన్ డిస్టర్బెన్స్ కూడా తక్కువ."

"అది కూడా ఒక విధంగా నిజమే."

"మీరేం చేస్తుంటారు?" అడిగాను.

అతను తన బిజినెస్ గురించి చెప్పాడు. డైమండ్స్ వ్యాపారం చేస్తాడట. రిస్క్ ఎక్కువ. అపారమైన అనుభవం ఉందట.

"అందుకా జువెలరీ అంశాలున్న సినిమా చూస్తున్నారు" అన్నాను.

"మ్యాజిక్, దొంగతనాలు కూడా చేస్తాను" అని చెప్పి, పెద్దగా నవ్వాడు.

నేను కూడా అతడి నవ్వుతో వంతకలిపాను.

"ఏం తీసుకుంటారు?" అడిగాను.

నిషేధం అమలులో ఉంది. బయట ఒక్క చుక్క మద్యం అందుబాటులో లేదు. అతను నా వంక అనుమానంగా చూశాడు. చిన్నగా నవ్వి అడిగాను.

"సోడా కలిపిన విస్కీ కావాలా? లేక స్ట్రైట్‌తో వోడ్కానా?"

బ్యాగ్ వెనక అరలోంచి రెండు సీసాలు తీసి తన ముందుంచాను.

క్యాటరింగ్ బాయ్‌ని పిలిచి 500 రూపాయల నోట్ చేతిలో పెట్టి గ్లాసులు, ఐసు తెచ్చి పెట్టమని అడిగాను.

మొహమాటంగా చిన్న నవ్వు నవ్వి వెళ్లిపోయాడు చేతులు నలుపుకుంటూ.

నేను పోసుకుని తన గ్లాసులోకి బ్లాక్ స్టాలియన్ రిజర్వ్ విస్కీ వంచాను.

"మంచి క్వాలిటీ సర్వ్ చేశారు" ఓ గుక్క తాగి చెప్పాడు.

కొద్దిసేపు ఇంగ్లీష్ సినిమాల గురించి అనర్గళంగా మాట్లాడాడు.

ఎక్కువగా జువెలరీ గురించి, జ్యూయలరీ థీఫ్ సినిమాల గురించి, తనకొచ్చిన మ్యాజిక్ గురించి మాట్లాడాడు. ఎందుకో నాకు అతనంటే ఓ విధమైన ఆసక్తి ఏర్పడింది.

నేను అతని ఐప్యాడ్ తీసుకొని సినిమా చూస్తుండగా... జరగబోయేది అంతకు ముందు జరిగిన వేరే సినిమాలో ఈ హీరో ఎలా చేశాడు అని చెప్పసాగాడు. నాకు ఇలా సినిమా చూస్తుంటే ఎవరైనా పక్కన కూర్చొని చెప్తుంటే చెడ్డ కోపం వస్తుంది.

ఇంతలో క్యాటరింగ్ బాయ్ వచ్చాడు, రెండు కట్ చేసిన నిమ్మకాయలు తీసుకొని.

"ఫుడ్ ఏమన్నా సర్వ్ చేయమంటారా" అడిగాడు చిల్లర అక్కడ పెడుతూ.

"200 నువ్వు తీసుకో" చెప్పాను.

మిగిలిన చిల్లర అక్కడే ఉంచాడు.

"ఒక తమాషా చూపిస్తాను" అన్నాడు మాధవ్.

నేను క్యాటరింగ్ అబ్బాయికి చికెన్ ఫ్రై, మటన్ కుర్మా తీసుకురమ్మని చెప్పాను.

అతను సరేనని వెనుతిరిగాడు.

"ఆగు" అన్నాడు మాధవ్.

"ఏంటి" అని వెనుదిరిగాడు క్యాటరింగ్ అబ్బాయి.

"మిగిలిన డబ్బులు అక్కడ పెట్టి వెళ్ళు"

"ఇందాక అక్కడ పెట్టాగా" అన్నాడు.

"నీ జేబులో చూడు ఓసారి" అన్నాడు మాధవ్.

అతను జేబు తడుముకుంటే డబ్బుల నోట్లు జేబులో ఉన్నాయి.

అవాక్కైపోవడం నా వంతు అయింది.

పెద్దగా నవ్వాడు మాధవ్.

"మ్యాజిక్ అంతా మ్యాజిక్" అంటూ ఆ బాయ్‌ని బుజ్జగించి మరో వంద ఇచ్చి పంపించేశాడు.

ఇలా సమయమే తెలియకుండా అనేకసార్లు చిన్న చిన్న మ్యాజిక్కులు చేసి నన్ను తికమక పెట్టేవాడు.

ట్రైన్ దిగాక ఇద్దరం హోటల్ బసకి చేరుకున్నాం.

రూములు కూడా పక్కపక్కనే దొరికాయి.



అంతా యాదృచ్ఛికంగా అలా జరిగిపోతోంది అనుకున్నా. అతను పోను పోను నాకు బాగా నచ్చేస్తున్నాడు.

మంచి కలుపుగోలు మనిషి. హోటల్లో ఉండే వాళ్ళను, స్టాఫ్‌ను బాగా పరిచయం చేసుకున్నాడు.

మిడ్‌నైట్ క్యాసినో నైట్, రూఫ్‌టాప్ లైవ్ జాజ్ సెషన్, ఎలైట్ టాంబోలా లాంజ్, సిగ్నేచర్ కరావోకే సర్కిల్ మొదలైన వాటిల్లో చాలా ఉత్సాహంగా పాల్గొనేవాడు.

ఓ రాత్రి డిన్నర్ టేబుల్ దగ్గర కూర్చొని ఉండగా ముత్యాల ప్రసక్తి వచ్చింది.

నేను నా క్లయింట్ ధనరాజ్ సేఠ్ దగ్గర కొన్న ముత్యాల హారం తీసి అతనికి చూపించాను.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈ వారం కథ




"ఎంతకు కొన్నారు?" అడిగాడు మాధవ్ చిరునవ్వుతో.

"ఒక కోటి 25 లక్షలు. బయట మార్కెట్లో ఒక కోటి 47 లక్షలుంది దీని రేటు" గర్వంగా చెప్పాను.

"బయట మార్కెట్లో ఎంక్వయిరీ చేశారా?"

"ఎంక్వయిరీ చేయటం ఏంటి!? అనేకచోట్ల చూసి ఫోటోలు తీసి, కొటేషన్స్‌తో సహా అతనికి చూపించి అలాంటిదే నాకు కావాలని అడిగాను. అతను నాకు తగ్గించి మంచి ధరకి ఇచ్చాడు."

"సరే జాగ్రత్తగా ఉంచండి. ఇంకా కొద్ది రోజులు ఉంటాం కదా... దీని గురించి రేపు రాత్రికి భోజనాల దగ్గర చర్చిద్దాం."

"ఏం ఇప్పుడు చెప్పకూడదా? నేను కొన్న ధర సరైనదేనా? క్వాలిటీ ఎలా ఉంది?"

అతను చిరునవ్వుతో "చెప్పాను కదా.. రేపు రాత్రికి చూద్దాం అని. అంత సులభం కాదు దీని క్వాలిటీ కనిపెట్టటం." చిన్నగా నవ్వాడు.

"ఎంతో అపారమైన అనుభవం ఉందని చెప్పావు కదా? ఇప్పుడు చెప్పకూడదా?" అన్నాను నేను ఆసక్తిగా.

నాలో ఏదో చిన్న సందేహం బయలుదేరింది.

"ఏమి భయపడొద్దు. సందేహించవద్దు. రేపు రాత్రికి మీకు బోధపడుతుంది. పదిలంగా ఉంచండి."

నాకు అంతా అయోమయంగా అనిపించింది.

ఏమైనా 'ధనరాజ్ సేఠ్ నాకు పాతమిత్రులు. నేను నమ్మొచ్చు' అని నిద్రపోయాను.

అయినా చిన్న సందేహం నన్ను మరుసటి రోజు వెంటాడుతూనే ఉంది.

మరుసటి రోజు రాత్రి డిన్నర్‌కి బయలు దేరేటప్పుడు డోర్ బెల్ మోగింది.

తలుపు తీశాను.

ఎదురుగా మాధవ్!

"సర్‌ప్రైజ్.. రండి లోపలికి" ఆహ్వానించాను.

"ముందు మీ సందేహం నివృత్తి చేసి తర్వాత భోజనానికి వెళ్దాం... ఏది మీ నగ తీయండి చూద్దాం" అన్నాడు ఓ పరికరం బయటకు తీస్తూ.

నేను లాకరులో నుంచి గొలుసు బయటకు తీసి, అతని ముందు కూర్చున్నాను.

అతను నెక్లెస్‌ను లైట్ కింద, పేపర్ కింద పెట్టి చూశాడు.

"కొద్దిగా నీళ్లు తీసుకురండి" అన్నాడు.

నేను సందేహిస్తుంటే -

"మీ గొలుసు నేను కాజేయను. పట్టుకు రండి" నవ్వాడు.

నేను మంచినీళ్ల గ్లాస్ తీసుకొని తిరిగివచ్చే లోపు...

సంభ్రమాశ్చర్యాలతో నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను.

రెండు గొలుసులు పక్కపక్కనే ఉన్నాయి.

"ఇప్పుడు చెప్పండి ఇందులో మీ వస్తువు ఏది?" అన్నాడు.

"ఎలా వచ్చాయి రెండు?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"చెప్పాను కదా... మ్యాజిక్ చేస్తానని."

"అలా కాదు... ఇందులో నాదేది?" అన్నాను భయంగా.

"రెండూ నీవే. ఒకటి నీకు గిఫ్ట్."

"వద్దు... ఇంత ఖరీదైన బహుమానం వద్దు."

"మన పరిచయం అయినప్పటి నుంచి చాలా ఆప్యాయంగా నన్ను చూశావు. అందుకే ఇది" అన్నాడు.

తర్వాత చెప్పాడు.

"ఈ నెక్లెస్ తీసుకుని ధనరాజ్ సేఠ్‌కి తిరిగి ఇవ్వు. నీకు ఇప్పుడు అవసరం లేదని చెప్పు. డబ్బు ఒక లక్ష తక్కువైనా సరే తీసుకో."

"ఎందుకు?" అడిగాను.

"కొన్నిసార్లు ఎవరికైనా సరే పాఠం చెప్పాలి."

ఫుడ్ రూమ్‌కి ఆర్డర్ చేసి ఇద్దరం డ్రింక్స్ తాగుతూ టీవీలో అవే సినిమాలు చూస్తూ కూర్చున్నాం.

మరుసటి రోజు ఉదయమే ఫ్రెష్‌గా తయారయ్యి ఆ నెక్లెస్ తీసుకొని ధనరాజ్ సేఠ్ షోరూమ్‌కి వెళ్లాను.

సాదరంగా ఆహ్వానించి, "కూర్చోండి. ఏమిటి సారు మళ్ళా ఏమైనా రిక్వైర్‌మెంట్ వచ్చిందా? లేక, ఆ నగ నచ్చలేదా మీ మేడం గారికి?" అని అడిగాడు.

"లేదు మిత్రమా నేను కొంచెం ఆగుదాం అనుకుంటున్నాను. దయచేసి ఈ నగ వెనక్కి తీసుకొని నా ఖాతాలో ఆ అమౌంట్ జమచెయ్యి. అకౌంట్ సెటిల్ చెయ్."

"ఏం సార్.. నగ నచ్చలేదా? మీకు క్వాలిటీ నచ్చకపోతే మరొకటి ఇస్తాను."

"లేదులే తర్వాత తీసుకుంటాను. నా భార్యను తీసుకొని వచ్చి ఇద్దరం కలిసి చూస్తాం."

ధనరాజ్ సేఠ్ జేబులో నుంచి రుమాలు తీసి చెమటలు తుడుచుకొని నగని తీసుకొని ఒకసారి పరీక్షగా చూశాడు.

"కంటి చూపుతోనే నగని పసిగట్టగలవు నువ్వు ధనరాజ్ సేఠ్" అన్నాను నవ్వుతూ.

"అవును సారు 30 ఏళ్లుగా... ఎన్నో ఢక్కామొక్కీలు తిన్నాను.. ఎక్కడికి పోతుంది అనుభవం" అన్నాడు బింకంగా.

బిల్లు కూడా తీసేసుకుని, కౌంటర్లో ఉన్న వ్యక్తిని పిలిచి 'దీన్ని జాగ్రత్తగా సరిచూసి లోపల పెట్టు' అని పురమాయించాడు.

ఆ వ్యక్తి ఒకసారి నా వంక ధనరాజ్ సేఠ్ వంక చూసి మళ్లీ ఆ నగని జాగ్రత్తగా పరీక్షించి ధనరాజ్ సేఠ్ వంక చూస్తూ నిలుచున్నాడు.

"తీసుకెళ్లి లోపల పెట్టు" అన్నాడు ఏదో అర్థం కాని కోడ్‌లో మాటలు జోడిస్తూ.

"ఏమిటి ఏమన్నా ప్రాబ్లమా" అడిగాను.

"ఏమీ లేదు.. నిన్న కస్టమ్స్ వాళ్ళు వచ్చారు. కొంచెం ఇబ్బంది కలిగింది. ఇన్వెంటరీలో చిన్న తేడా వచ్చింది. అందుకని వాడు అలా బిహేవ్ చేస్తున్నాడు."

అవునా అన్నట్టు చూశాను.

"అది మేము చెప్పుకోలేములే..." అన్నాడు.

"ధనరాజ్ ఆ బిల్లు నాకు ఇస్తావా.. నా లెక్కల్లో ఖర్చులు రాసుకుంటాను. తర్వాత ఎటూ నగ కొంటానుగా.. అప్పుడు చూసుకుందాం ... కావాలంటే ట్యాక్స్, ప్రాఫిట్ మార్జిన్ వరకు ఉంచుకో" అన్నాను.

**"ఎంతకు కొన్నారు?" అడిగాడు మాధవ్ చిరునవ్వుతో.**
**"ఒక కోటి 25 లక్షలు. బయట మార్కెట్లో ఒక కోటి 47 లక్షలుంది దీని రేటు" గర్వంగా చెప్పాను.**
**"బయట మార్కెట్లో ఎంక్వయిరీ చేశారా?"**
**"ఎంక్వయిరీ చేయటం ఏంటి!? అనేకచోట్ల చూసి ఫోటోలు తీసి, కొటేషన్స్‌తో సహా అతనికి చూపించి అలాంటిదే నాకు కావాలని అడిగాను. అతను నాకు తగ్గించి మంచి ధరకి ఇచ్చాడు."**

కొంచెం ఆశ్చర్యంగా.. అనుమానంగా నా వంక చూశాడు. కొంచెం సేపు ఆలోచించి తల విదిలించాడు.

"సరే.. తీసుకో సార్. ఎలాగూ నాకు కొంత ఇన్వెంటరీ తగ్గిందిగా... దానిలో ఆ నగ సర్దుకుంటానులే" అన్నాడు.

గొణుక్కుంటూ ఇచ్చేశాడు.

ఎంతైనా పదేళ్ళ కష్టాల్లో ఆదుకున్న బంధం కదా నాది.

అలాగే కూల్ డ్రింక్ తెప్పించాడు. తాగాక గుమస్తా వచ్చి చెప్పాడు 'ఏకౌంటు సెటిల్ చేశాన'ని.

"సార్ మీ అకౌంటు సెటిల్ అయింది. జమ చేసేశాం."

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



"సరే ధనరాజ్ సేఠ్.. నేను సెలవు తీసుకుంటాను. నా భార్యతో వచ్చి మరోసారి కలుస్తాను" అని చెప్పి వేరే క్లైంట్ దగ్గరికి బయలుదేరి వచ్చేశాను.

ఆ రోజు రాత్రి మాధవ్ కనిపించలేదు.

ఆ తర్వాత రోజు వచ్చాడు.

ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు.. గాల్లో తేలిపోతున్నట్టు.

"నిన్న ఎక్కడికి పోయావు?" అడిగాను.

"ఏదో ఒక డీల్ తగిలింది వెళ్లానులే. సక్సెస్ అయింది."

ఏమిటన్నట్టు చూశాను.

"నేను వచ్చిన పని అయింది.. ఇక నేను బయలుదేరుతాను" అన్నాడు.

"మాధవ్ నా పనులు కూడా అయిపోయాయి. రేపు బయలుదేరి వెళ్దాం. కలిసిపోదాం. ఫ్లైట్‌కి టికెట్ బుక్ చేయనా?" అడిగాను.

"రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నారా" అడిగాడు మాధవ్.

"లేదు" అన్నాను కంగారుపడుతూ.

"ఏమన్నాడు ధనరాజ్ సేఠ్.. వాపస్ తీసుకున్నాడా?"

"ఆ... కొంచెం ఇబ్బందిగానే! కాకపోతే నిన్న ఏదో రైడ్ జరిగిందని ఇన్వెంటరీలో ఏదో చిన్న తేడా వచ్చిందని చెప్పాడు."

మాధవ్ నవ్వుతూ "అవునా?" అన్నాడు.

"బిల్లు కూడా వెనక్కి ఇచ్చేశాడు. జీఎస్టీ, ప్రాఫిట్ మార్జిన్ కట్టాను. ఏంటి మాధవ్.. అసలు విషయం చెప్పు?" అన్నాను.

"లెక్క సరిపోయింది."

"అంటే" అడిగాను.

"ఏమీ లేదు మిత్రమా.. నీకు సెకండ్స్ క్వాలిటీ.. అదీ ఇన్ఫీరియర్ క్వాలిటీ ఇచ్చాడు. దానికి దీనికి సుమారుగా 50 % పైగా తేడా ఉంటుంది. నువ్వు ఒరిజినల్ నెక్లెస్ ఫోటో తీసుకెళ్లి చూపించావు. అతను నీకు సెకండ్స్ ఇచ్చాడు అంతే. బెల్జియం మేడ్. ఇది పట్టుకోవడం సామాన్యుడి వల్ల కాదు. అందుకే అతను బిత్తరపోయాడు. ఏమీ చెప్పుకోలేక దిగమింగుకున్నాడు."

"మరి ఈ ఒరిజినల్ నీకు ఎలా వచ్చింది?.. నేను తీసుకోనులే."

"చెప్పానుగా మిత్రమా నాకు మ్యాజిక్ తెలుసని. నీకోసం ఇంకోటి సృష్టించాను.

**మరుసటి ఉదయం.**
**హోటల్ రిసెప్షన్‌లో అడిగాను,**
**"మిస్టర్ మాధవ్ చెక్ అవుట్ అయ్యారా?"**
**రిసెప్షనిస్ట్ కంప్యూటర్ చూస్తూ తల ఎత్తి,**
**"సర్, ఆ పేరుతో ఎవరూ ఇక్కడ స్టే చేయలేదు" అన్నాడు.**
**నా చేతిలోని కాఫీ గ్లాస్ నేలపై జారిపోయింది.**
**నా గదిలోకి పరుగెత్తాను.**
**లాకర్ తెరిచాను.**
**హారం భద్రంగా ఉంది.**
**అది ఏది?**
**నిజమా? నకిలీనా?**

ఇంద్రధనుస్సులతో" అన్నాడు నవ్వుతూ కన్నుగీటాడు.

"నువ్వు ఎవరు మిత్రమా?" అడిగాను, రెండో పెగ్గు ముగిస్తూ.

"చెప్పానుగా చాలాసార్లు" అన్నాడు నవ్వుతూ మాధవ్.

నా గుండె ఒక్కసారిగా గట్టిగా కొట్టుకుంది.

"అంటే...?"

"భయపడొద్దు రమణా.. కొన్నిసార్లు ఎవరో ఒకరికి పాఠం చెప్పాలి. అంతే."

"ధనరాజ్ సేఠ్‌కి?"

అతను సమాధానం చెప్పలేదు. ఖాళీ గ్లాస్ బోర్లించాడు.

తలుపు దగ్గరకు వెళ్లి ఆగాడు.

"రేపు ఉదయం నేను చెక్ అవుట్ అవుతాను" అన్నాడు.

"మళ్లీ కలుస్తామా?" అడిగాను.

అతను వెనక్కి తిరిగి చూసి చిన్నగా నవ్వాడు.

"నేను అవసరమైతే మాత్రమే కనిపిస్తాను."

మరుసటి ఉదయం.

హోటల్ రిసెప్షన్‌లో అడిగాను,

"మిస్టర్ మాధవ్ చెక్ అవుట్ అయ్యారా?"

రిసెప్షనిస్ట్ కంప్యూటర్ చూస్తూ తల ఎత్తి,

"సర్, ఆ పేరుతో ఎవరూ ఇక్కడ స్టే చేయలేదు" అన్నాడు.

నా చేతిలోని కాఫీ గ్లాస్ నేలపై జారిపోయింది.

నా గదిలోకి పరుగెత్తాను.

లాకర్ తెరిచాను.

హారం భద్రంగా ఉంది.

అది ఏది?

నిజమా? నకిలీనా?

టేబుల్ మీద ఒక చిన్న కాగితం.

"మ్యాజిక్ అనేది మాయ కాదు రమణా... నమ్మకం ఎక్కడ ఉంటుందో అక్కడే నిజం దాగి ఉంటుంది."

సంతకం లేదు.

అపరిచితుడు.

---

87907 87628 (WhatsApp Only)

## రచయితలకు విజ్ఞప్తి

ఆదివారం ఆంధ్రజ్యోతి కోసం మెయిల్ ద్వారా పంపే కథలను తప్పనిసరిగా యూనికోడ్‌లో మాత్రమే టైప్ చేసి, ఓపెన్ ఫైల్‌తో పాటు పి.డి.ఎఫ్ ఫైల్ కూడా పంపాలి. పోస్టు ద్వారా పంపే కథలు డి.టి.పి. చేసి పంపితే మంచిది. రాతప్రతులను పంపేవారు అక్షరాలు అర్థమయ్యేలా రాయాలి. ఎలా పంపినా కథ స్వంతమేనని, కాపీ కథ కాదని, మరో పత్రికలో పరిశీలనలో లేదని, గతంలో ప్రచురితం కాలేదని, ఇతర మాధ్యమాల్లో ప్రసారం కాలేదని వివరణాత్మకంగా హామీపత్రం విధిగా జతచేయాలి. అందులో మీ పూర్తి చిరునామాతో పాటు ఫోన్ నెంబరు కూడా ఉండాలి. వ్రాత ప్రతిని పంపినప్పుడు ఆ కథ జిరాక్స్ మీవద్ద ఉంచుకోగలరు. ఎన్నిక కాని కథలను తిప్పిపంపడం సాధ్యం కాదు గనక, మీరు పంపిన కథతో పాటు స్టాంపులు అతికించిన కవరు జత చేయాల్సిన అవసరం లేదు. కథ ఎంపికైనదీ, లేనిదీ మీకు ఫోన్ (మెసేజ్) ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

కొత్త ఇతివృత్తాలతో సమకాలీన సమస్యలను ప్రతిబింబించే కథలకు, కొత్తగా రాసే రచయితలకు ప్రాధాన్యత ఉంటుంది. ఇతివృత్తం ఎంత కొత్తదైనా, రాసే విధానంలో పరిణతి లేకపోతే కథ ఎంపిక చేయడం జరగదు. కథనంలో, శైలిలో, శిల్పంలో కొత్త ప్రయోగాలు చేసినా, కథ సామాన్య పాఠకుడికి అర్థమయ్యేలా ఉండాలి. అలాగే, ఇతివృత్తాలు కులపరంగా, మతపరంగా... మరే రకంగానూ ఇతరులను కించపరచేవిగా ఉండకూడదు. ఈ నిబంధనలు పాటించని కథలు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశీలించబడవు. మాకు అందిన తేదీ నుంచి మూడు నెలల లోపున మీ కథ ఎంపికైనదీ, లేనిదీ తెలియజేస్తాం. అంతవరకు ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. కథకులందరూ సహకరించగలరని మనవి.

**మా చిరునామా:** ఈవారం కథ, సండే డెస్క్ , కేరాఫ్: ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం: 76, రోడ్ నెం. 70, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033 ; **మెయిల్ :** sunday.aj@gmail.com

కథ

# వివర్ణం

గట్టిగా ఒక కూత కూస్తూ, ఇక చాలు బయలుదేరుదాం పద.. అన్నట్లు ప్లాట్‌ఫామ్ మీదకొచ్చింది మెట్రో. చెవికీ, భుజానికీ మధ్య ఫోన్ ఉంచి, అడుగు లోపల పెట్టాను. జనం పల్చగా ఉన్నారు, కూర్చోవడానికి చోటు దొరికింది. ఫోన్ రింగవుతూనే ఉంది. ఎత్తితే బావుణ్ను. ఇది మూడవ సారి, కాస్త టెన్షన్‌గా అనిపించింది. మనసులో ఏవేవో భయాలు మొదలవుతున్నప్పుడు, లిఫ్ట్ చేశాడు..

''చెప్పు హర్ష!'' అంటూ.

''ఫోన్ ఏం అన్నా లిఫ్ట్ చేయట్లేదు, ఎన్నిసార్లు చేశాను నీకు!'' అన్నాను కోపంగా.

''పడుకున్నాను రా! ఏమయింది, ఏమయినా ఎమర్జెన్సీ ఆ..?'' అడిగాడు.

ఓ క్షణంపాటు ఏం చెప్పాలో అర్థం కాలేదు. తర్వాత నెమ్మదిగా చెప్పాను..

''హైదరాబాద్ వచ్చాను, బిజినెస్ పని మీద. నిన్నుకూడా చూసి వెళ్దామని చేశాను'' అని.

''నేను సెలవు పెట్టాను, కాస్త నీరసంగా ఉందని. నీ పని చూసుకుని నేరుగా నా రూంకి వచ్చేయ్'' చెప్పి ఫోన్ పెట్టేశాడు.

అద్దాల కిటికీ నుంచి బయటకు చూస్తూ కూర్చున్నాను. ఆలోచనలు మెట్రో కన్నా వేగంగా పరిగెడుతున్నాయి, వెనక్కి! పెరుగుతున్న వయసు, వందల కిలోమీటర్ల దూరం, వేరు అయిపోయిన జీవన ప్రయాణాలు..! ఏవేవి అన్న నుంచి దూరాన్ని పెంచాయి? ఎన్ని జ్ఞాపకాలు అన్నతో! ఆటలు, పోట్లాటలు, ఏటిలో ఈతలు, పట్టి మంచంపై చేరబడి చెప్పుకొన్న కథలు..! ఒక జీవితకాలపు నేస్తం అన్న, నా అల్లరంతటికీ ఆది గురువు అన్న.

ఆరేడేళ్లేమో నాకు, పదేళ్లలోపే అన్నకు. మామిడితోటలో చూసిన ఏడురంగుల సీతాకోక చిలుకను, అచ్చు గుద్దినట్లు, అలానే గీసి చూపించాడు. ఇప్పటికీ మనసు కాన్వాస్‌పై ఆ బొమ్మ రంగులు అలానే ఉన్నాయి.

మరి దానిని చూసి నాన్నేమన్నాడు..

''ఎవ్వరికీ కనిపించని వింతలన్నీ నీకే కనిపిస్తాయి. ఏడో ఎక్కం రాదుగానీ, ఏడు రంగులతో బొమ్మలేయడమొచ్చు'' అని కసురుకోలేదా..!

అది మొదలు.. జ్ఞాపకాల కాగితాలపై ఏనాడూ అన్నని నాన్న మెచ్చుకున్నట్లు ముద్రింపబడలేదు.

ఎవరో ఇంటికొచ్చినాయన..

''మీ పెద్దోడు చాలా తెలివైన వాడండి'' అని అంటే..

''అబ్బే! వాడొట్టి మొద్దండి. మా చిన్నోడు తెలివైన వాడు'' అన్నారు.

అన్నని తిట్టి నన్ను చేరిన పొగడ్త, నాన్న తిట్లకన్నా ఎక్కువే బాధ పెట్టించిందా రోజు.

ఓసారి ఎప్పుడో అడిగాను..

''అన్నా! అమ్మ తిట్టదనేగా అమ్మంటే ఇష్టం. నాన్న కొడుతాడు గనుక, నాన్నంటే కోపం'' అని.

వాడన్నాడూ..


''అమ్మ మాటే కదరా మనకి ఓదార్పు. అమ్మ లేకుంటే ఇంటికి రావాలని కూడా అనిపించదు రా'' అని. అలాంటిది..!

కళ్లంట జలజలా రెండు నీటి చుక్కలు రాలాయి. కర్చీఫ్‌తో తుడుచుకొని తలెత్తి చూశాను. నీ ఆలోచనలతో నాకు సంబంధం లేదన్నట్లు పరుగెడుతున్నది మెట్రో. తలలు మొబైళ్లలో ముంచి జోగుతున్నారు జనం.

పదేళ్లేమో అప్పుడు..! నవోదయలో సీటు తెచ్చుకోలేదని నాన్న అన్న చెంపను చెళ్లుమనిపిస్తే, నా గుండెలదిరాయి. తర్వాత ఏడుపులు, ఓదార్పులు, బుజ్జగింతలు.. అన్నని కాదు, నాన్నని.

''నా జీవితం ఇలా అయిపోయింది. మీవి ఇలా కాకూడదనే కదరా చదవమనేది'' అని, ఎమోషనల్ బ్లాక్ మెయిల్.

ఆ రోజు అర్థం కాని చాలా విషయాలు, వయసు పెరుగుతున్న కొద్దీ, కొద్దికొద్దిగా అర్థమవ్వసాగాయి. మన దేశంలో ముప్పై ఐదు, నలభై సంవత్సరాల వయసు దాటాక, మనిషికి ఎదిగేందుకు కష్టపడదామన్నా, కొత్తగా ప్రయత్నిద్దామన్నా, ఏ అవకాశమూ కనిపించదు. స్కిల్‌గానీ, పెట్టుబడిగానీ లేని మనిషిక్కడ వ్యర్థ మానవుని కిందే లెక్క. అతనికి అడుగు ముందుకు కదిపే అవకాశమే ఉండదు. ఆపై.. ఏ కలుగులోని ఎలుక ఆ కలుగులోలా బతకాల్సిందే! మరో దారి లేదు. ఆ కలుగుల్లో కనిపించే వెలుగు రేఖలు పిల్లలు. డబ్బు కాదు, కీర్తి కాదు, కేవలం మా జీవితాల్లా వాళ్లవి కాకూడదన్న భయం. మాకు దక్కని గెలుపు మా పిల్లలకు దక్కాలన్న వెర్రి ఆశ. మీ ఆశల బరువులకు వాళ్ల రెక్కలు విరిగిపోతు





‘నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీ పీఠం’ సంయుక్తంగా నిర్వహించిన ‘కథల పోటీ-2026’లో ప్రథమ బహుమతి రూ.50 వేలు పొందిన కథ.

న్యాయన్నా వినరు, వినిపించుకోరు. ఇదో సాంఘిక దురాచారం, అయినా దానిని గుర్తించే నాథుడూ ఉండడు. ఎందుకంటే, ప్రతి వందలో తొంభై మందిది ఇదే బతుకు కనుక. ఎనభై ఏళ్ల స్వతంత్ర భారతంలో, ఇంకా ఎదుగుదలకు మొదటి మెట్లుగా కనిపించే పిల్లలే, ప్రతి ఇంటా..! అటువంటి బతుకే మా ఇంటిదీ, మా జీవితాలదీ..! ఆశల మేడల్లో నాన్న, అందుకోలేని అగాథంలో మేము! మిషన్ నవోదయ ఫెయిలయ్యాక, మరికొన్ని మిస్ ఫైర్‌లూ, మరికొంత మెలోడ్రామా..! చూసి, విని, కాసి ఎక్కడ లేని మొండితనం వచ్చేసింది నాలో.

‘‘కనీసం నువ్వయినా...’’ అన్న మాట వినిపిస్తే చాలు, అందనంత దూరం పరిగెత్తేవాడిని. ఈ చదువు అనే దానికి ఎంత దూరంగా ఉంటే, మనమంత సేఫ్ అని అనిపించేది నాకు.

అన్న మాత్రం వేరు. ఐఐటీ సీటు దక్కనప్పుడు నాన్న ఏడుపులే కాదు, అన్నలోనూ ఏదో మార్పు గమనించాను. అప్పటినుండీ వాడు పుస్తకాలే ప్రపంచంగా మారిపోయాడు. చిన్నప్పుడు నాతో పోటీపడి అల్లరి చేసే అన్న.. ఒక్కసారిగా ఓ మౌన యోగిలా మారిపోయాడు. ఒక్కోసారి అనిపించేది, నేను కాకుండా మరో స్నేహితుడైనా ఉన్నాడా? వీడికి అని.

ఎన్ఐటీలో బీటెక్ చేశాడు. తర్వాత నాన్న

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవమంటే మరో మాట మాట్లాడకుండా సరేనన్నాడు. ఢిల్లీ ట్రైన్ ఎక్కేముందు అడిగాను వాడిని..

''అన్నా! నిజంగా ఇష్టంగానే చేస్తున్నావా? లేక నాన్న కోసమే ఒప్పుకొన్నావా?'' అని.

అప్పుడన్నాడు..

''మన చదువులు మారాలిరా హర్షా! ఏ ఒత్తిడీ లేకుండా, భవిష్యత్తు మీద భయం లేకుండా పిల్లలు చదువుకొనే రోజులు రావాలి. అందుకు నా వంతుగా ఏమైనా చేయగలనా? అనిపిస్తే, ఇదే మంచి అవకాశంగా కనిపించింది'' అని.

భలే అనిపించింది వాడి జవాబు. గట్టిగా కౌగిలించుకుని.. 'ఆల్ ద బెస్ట్' చెప్పాను.

రెండు సంవత్సరాలు..! అన్న ప్రిలిమ్స్ కూడా దాటలేకపోయాడు.

''అశోక్.. స్థాయికి మించి ఖర్చు పెడుతున్నాను రా! అందొచ్చిన కొడుకు ఉద్యోగం ఎందుకు చేయట్లేదని అడుగుతున్నారు అందరూ. సమయం వృథా చేసుకోకు, త్వరగా ఏదో ఒకటి సాధించు..'' ఇవే మాటలు ఫోన్ లో. ఇవేనా మాట్లాడాల్సిన మాటలు..? అనిపించేది నాకు.

మూడో ప్రయత్నంలో అన్న ఒక్కో మెట్టూ దాటుతూ ముందుకెళ్తుంటే, మా మనసులు ఉద్వేగంతో నిండిపోయాయి. అన్న ఇంటర్వ్యూకి ఎంపికైనప్పుడు ఇంట్లో ముగ్గురం చిన్న పండుగులా చేసుకున్నాం. ఆ క్షణం అన్న కూడా ఇంట్లో ఉండుంటే, ఈ ఇంట్లో తను ఎంత గొప్ప విజయం సాధించాడో తనకు అర్థమై ఉండేది.

ఇంటర్వ్యూ రోజుకోసం, ఒక్కో రోజు లెక్క పెడుతూ ఉండేవాళ్లం. అయితే మేము అనుకున్నట్లు జరగలేదు. ఇంటర్వ్యూకి ఇంకా వారం రోజులు ఉందనగా, అమ్మకు ఛాతీలో మంటగా ఉందంటే హాస్పిటల్‌కి తీసుకువెళ్లాం. మందులేవో తీసుకుని తిరిగొచ్చాం. కాస్త బాగానే ఉందని చెప్పి, అమ్మ పడుకుంది. కానీ ఉదయానికి తనలో ప్రాణం లేదు. ఒక్కసారిగా మా జీవితాలు చీకట్లోకి వెళ్లిపోయాయి అనిపించింది. దుఃఖం తన్నుకొచ్చింది. అన్నకు ఎలా చెప్పాలో కూడా అర్థం కాలేదు.

''నేను చెప్తాను'' అన్నారు నాన్న.

తెలిసిన వాళ్లూ, బంధువులూ వచ్చారు, ఏర్పాట్లేవో చేశారు. సాయంత్రానికి ఏడ్చీ, ఏడ్చీ ఎర్రబారిన నా కళ్లకు అందరూ మాయగా కనిపించారు. అలాగే శ్మశానానికీ తీసుకువెళ్లారు. నన్ను కర్మకాండలు చేయమన్నారు ఎవరో. ఒక్కసారిగా వీపు మీద చరిచినట్లయింది.

''అన్నేడి?'' చుట్టూ చూస్తూ అడిగాను.

నాన్న కళ్లలో అపరాధ భావం. విషయం అర్థమవుతున్నది. మెల్లగా నా తలకెక్కుతుంది.

''వాడికి జీవితంలో ఒక్కసారే వచ్చే అవకాశం రా ఇది'' అన్నారు నా చేయి పట్టుకుని.

చేయి విదిలించుకున్నాను విసురుగా. బంధువులెవరో ఫోన్ చేసి తెచ్చి చేతికిచ్చారు. అవతల అన్న.. వెక్కివెక్కి ఏడుస్తూ, మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాడు.

''ఏరా! ఎవరో చెబితే గానీ, అమ్మ చనిపోయిందని కూడా నాకు తెలియలేదు. అమ్మను కడసారి చూడటానికీ నా చదువే అడ్డు వచ్చిందా రా!'' అని.

''అన్నా..! తప్పు జరిగిపోయింది! క్షమించు, క్షమించు'' ఏడుస్తూనే చెప్పాను.

ఆ రోజు అన్న వీడియో కాల్‌లో అమ్మని చూస్తుంటే, నేను కర్మకాండలు పూర్తిచేశాను. ఇంటర్వ్యూ అయిన మరుసటి రోజు అన్న ఊరొచ్చాడు. ఒకరినొకరం పట్టుకుని ఏడ్చేశాం. దాదాపు నెలరోజుల పాటు అన్న ఇంట్లోనే ఉండిపోయాడు. తన రిజల్ట్స్ వచ్చాయి. సెలెక్ట్ అవలేదు. ''ఏం చేద్దాం అనుకుంటున్నావు'' అని అడిగాను.

తెలియదన్నట్లు చేయి ఊపుతూ, విరక్తిగా ఓ చిన్న నవ్వు నవ్వాడు. రెండు రోజుల తర్వాత ఢిల్లీకి మళ్లీ టికెట్ బుక్ చేసుకుని వెళ్లిపోయాడు.

ఇంట్లో ఖాళీగా ఉండటం ఇష్టం లేక, సోలార్ ప్యానళ్ల ఇన్‌స్టలేషన్ పనికి ఒప్పుకొన్నాను. కాలేజ్ ప్రాజెక్ట్ నాటి పరిచయాలు అందుకు పనికొచ్చాయి. ఒక్కో ఇన్‌స్టలేషన్ పూర్తి చేస్తుంటే, ఈ పని గురించి, దీని వెనుక ఉన్న ప్రభుత్వ పథకాల గురించీ కొద్దికొద్దిగా అర్థమవసాగింది. ఇందులో భవిష్యత్తు ఉందనిపించింది. మాడ్యూల్స్ ప్రొక్యూర్మెంట్ కూడా మనమే చేసుకుంటే, స్థిరమైన వ్యాపారంగా అభివృద్ధి చేయవచ్చు అనిపించింది. నాలాంటి ఆలోచనలే ఉన్న కొంత మంది స్నేహితులతో కలిసి ఆ విధంగా అడుగులు వేయడం మొదలుపెట్టాను.

అమ్మ మరణం తర్వాత ఇదంతా నాకొక పాజిటివ్ మార్పు. అన్న కూడా ఇలానే తన దృష్టంతా తర్వాత ఏడాది పరీక్షపై పెట్టి సన్నద్ధం అవుతున్నాడని అనుకున్నాను. ఎప్పుడో ఓసారి మాట్లాడినా, రెండు మూడు మాటలతో ఫోన్ పెట్టేసేవాడు. మూడు నెలల తర్వాత అన్న రూమ్మేట్ ఒకతను ఫోన్ చేసి.. అన్నయ్య పరిస్థితేమీ బాలేదు, ఒకసారి రమ్మని చెబితే, ఎకాఎకిన ఢిల్లీ బయలుదేరి వెళ్లాను. ఎర్రని కళ్లతో, చింపిరి జుట్టుతో పిచ్చోడిలా కనిపించాడు అన్న. వాడిని చూస్తేనే అర్థమయింది, వాడు ఎన్నో రోజులుగా నిద్రపోలేదని. నన్ను చూసి అన్నాడు..

''హర్షా! అమ్మ నాతో మాట్లాడుతుంది రా!'' అని. ఒళ్లు జలదరించింది. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

''అమ్మ మాట్లాడటమేమిటి అన్న, అమ్మ చనిపోయింది కదా!'' అన్నాను.

''లేదు.. అమ్మ మాటలు నాకు వినిపిస్తున్నాయి. తను చాలా బాధ పడుతోంది. నా ఎగ్జామ్ క్లియర్ అవలేదని, ఎప్పుడూ ఏడుస్తూనే ఉంది...'' చెప్పుకొంటూ పోతున్నాడు వాడు.

కాలికింద నేల కూలిపోతున్నట్లు అనిపించింది నాకు. ''ఇలానే మాట్లాడుతున్నాడు. ఒక మాటతో మరో మాటకు సంబంధం ఉండట్లేదు. ఎవరితోనూ కలవట్లేదు'' చెప్పాడు తన రూమ్మేట్.

మౌనముని మనోఫలకం బద్దలయింది. లోపలున్న వేదనేదో బయటకొచ్చి తననే కాల్చేస్తోంది. నిస్సహాయంగా చూడటం తప్ప, నేనేమీ చేయలేనా!? అనిపించింది.

ఊరు తీసుకొచ్చి, మంచి సైకియాట్రిస్ట్‌కి చూపించాను. పరీక్షించి 'స్కిజోఫ్రెనియా' అనే మానసిక రుగ్మత అన్నారు. నాన్న మీద విపరీతమైన కోపం వచ్చింది. ఆయన వల్లే అన్నకు ఈ పరిస్థితి వచ్చిందని అనిపించింది. డాక్టర్ మాత్రం.. ''నిర్దిష్టంగా అదే కారణమని చెప్పలేం'' అన్నారు.

కానీ, తలమీద ఒత్తిడి పెట్టి కూర్చుంటే, ఆ

మనిషి ఎంత ఎదిగాడో బయటకు కనిపిస్తుంది గానీ, లోపలెంత కృంగిపోయాడో ఎవరికీ కనిపించదు కదా..!

యాంటీ డిప్రెసెంట్ మందులేవో ఇచ్చారు. వాటి ప్రభావంతో అన్న, దాదాపుగా రోజంతా నిద్రలోనే ఉండేవాడు. తినడం, పడుకోవడం, ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉండటం, ఇదే వాడి దినచర్య. నన్ను మినహా అందరినీ అనుమానంగా చూసేవాడు. తనకేదో హాని చేయబోతున్నారని అనేవాడు. అర్థంకాని మాటలేవో మాట్లాడేవాడు, అమ్మ ఏదో చెబుతుందనేవాడు.

వాడు ఏం అన్నా, ఎలా ఉన్నా.. ఎప్పుడూ వాడిని ఏమైనా అంటే బాగోదని నాన్నకు చెప్పాను. ఆయన కంట్లో ఓ నీటి చార.. 'ఇంకేమనగలను?' అన్నట్లు.

''స్థిరమైన ఉద్యోగమో, ఆదాయమో లేకపోతే, జీవితంలో ఎన్ని అవమానాలూ, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయో చూశాను రా! అందుకే మీ జీవితాలు అలా అవకూడదనుకున్నాను. అంతే గానీ ఇలా..!'' మాట తడబడింది.

భుజం మీద చేయి వేశాను, ఓదార్పుగా.

దాదాపుగా, ఆరునెలల పాటు అన్న జీవితం అలానే గడిచింది. మందులు, కౌన్సెలింగ్ సెషన్లతో కొంత మెరుగైనా.. అది మునుపటి అన్నను మాకు తిరిగి ఇవ్వలేదు. మందుల ప్రభావమో, శారీరక శ్రమ లేకపోవడమో, ఆరు నెలల్లో దాదాపు పాతిక కిలోల బరువు పెరిగాడు. మాటలో, ఆలోచనలలో వేగం పోయింది. ఎవరేమైనా చెప్పినా, అర్థం చేసుకోవడానికి తనకు సమయం పట్టేది. మందులన్నీ చెప్పిన సమయానికి కచ్చితంగా వేసుకోవల్సిందే. లేదంటే, తల తిరుగుతుంది అనేవాడు.

ఇది ఇలానే కొనసాగుతుందా..? ఏమిటీ పరిస్థితి అనిపించేది. ఒకరోజు ఓ పోస్ట్ వచ్చింది ఇంటికి, అన్న ఎప్పుడో ఏడాది క్రితం రాసిన ఓ ఉద్యోగానికి ఎంపికయ్యాడని, హైదరాబాద్ వచ్చి జాయిన్ అవ్వమని. ఓ చిన్నస్థాయి ఉద్యోగమది. కానీ, ఇప్పుడు అన్న ఉన్న పరిస్థితికి అదయినా చేయగలడా? అనిపించింది. వాడి జీవితానికి ఇదే చిరువెలుగేమో అన్న ఆశతో ముగ్గురం హైదరాబాద్ వెళ్లాం. అన్న జాయిన్ అయ్యాక, అన్న పై అధికారిని కలిసి చెప్పాను, అన్నకు ఆరోగ్య సమస్యలున్నాయని. ఎప్పుడైనా అవసరమైతే, నా నంబరుకి ఫోన్ చేసి చెప్పమని. సరేనన్నారు.

అద్దెకో చిన్న రూం తీసుకున్నాం. కావలసిన సామాన్లేవో కొన్నాం. నాన్న అన్నతోపాటు ఉండిపోయారు, వాడి బాగోగులు చూసుకోవడానికి. ఉదయాన్నే లేచి వంట చేసి, లంచ్ బాక్స్ ప్యాక్ చేసి, చిన్న పిల్లాడిని స్కూలుకి తీసుకువెళ్లినట్లు అన్నను ఆఫీసుకు తీసుకువెళ్లేవారు. తిరిగి సాయంత్రం ఇంటికి తీసుకొచ్చి.. వాడు తిని, మందులేసుకుని పడుకునేవరకూ అన్నీ తానై చూసుకునేవారు. ఆఫీస్‌లోనూ అన్నతో పాటు జాయిన్ అయిన ఒకరిద్దరు కొలిగ్స్‌కు, అన్నకు పనిలో సాయం చేయమని రిక్వెస్ట్ చేసి చెప్పారు. ఇవన్నీ చూసి, ఒక్క కుదుపు జీవితాలను ఎంతగా మార్చేస్తుందో కదా!? అనిపించింది.

నా జీవితమూ చాలా మారిపోయింది, మరోలా... చిన్నగా ఇంటి మేడలపై ప్యానల్స్ అమర్చే స్థాయినుంచి, పాతికమంది పనివాళ్లను పెట్టుకుని కాంట్రాక్ట్‌లకు, ఆఫీస్‌లకు, స్ట్రీట్ లైటింగ్‌కూ, సోలార్ పార్క్‌లకూ ఇన్‌స్టలేషన్లు చేసే స్థాయికి.. నేను కోరుకున్న స్థిరమైన వ్యాపార స్థాయికి. మానస పరిచయం అయ్యాక జీవితంలో ఇంకో మలుపు. తాను అనుకున్నప్పుడు జీవితంలోకి వచ్చి, తాను కోరుకున్నట్లుగా మనిషిని మార్చేసేదే ప్రేమ. అది జరిగింది. కళ్లల్లోని మెరుపు, మనసులోని రూపమై, బంధమై, బాధ్యతయింది. పెళ్లికి అడుగు దూరంలో నిల్చున్నాం.

మూడో ఆలోచన లేనంతగా ఇవి రెండూ నా జీవితాన్ని నింపేశాయి. నాన్న ఉన్నంతవరకూ అన్న గురించి నేను ఆలోచించాల్సిన అవసరమూ పడలేదు. అన్నీ తానై చూసుకున్నారు. ఏడాది క్రితం ఆయన చనిపోయారు, వయసుతోపాటు వచ్చిన ఆరోగ్య సమస్యలతో.. చివరి వరకూ, అన్న గురించి విచారం ఆయన మనసులో ఉండిపోయిందని అనిపించింది. పన్నెండు రోజులు ముగిశాక అన్నను అడిగాను..

''నువ్వు ఒంటరిగా ఉండగలవా..?'' అని.

''ఫర్వాలేదు, నేను మేనేజ్ చేసుకోగలను'' అన్నాడు.

ఆ తర్వాత ఈ ఏడాదిలో ఎన్నిసార్లు కలిశాం! మహా అయితే, రెండు మూడు సార్లేమో కదా..!

ఆలోచనల ప్రయాణానికి ఆఖరి స్టేషన్ వచ్చేసింది, నేను దిగాల్సిన స్టేషన్. స్టేషన్ నుంచి బయటకు వచ్చి, అన్న రూం వైపుగా నడక మొదలుపెట్టాను. అర కిలోమీటర్ దూరమేమో.. చాలా కాలమైనట్లుంది ఈ చోటుకొచ్చి.

నడుస్తుంటే మానస ఫోన్ చేసింది.

''ఏమైంది వెళ్లిన పని? మీ అన్నయ్యని కలిశావా?'' అని.

''ఇదిగో వెళ్తున్నాను'' అన్నాను.

''సరే! ఏ విషయమో ఫోన్ చేసి చెప్పు. మా అమ్మ నా తల తింటుందిక్కడ'' అని చెప్పి పెట్టేసింది.

మానస వాళ్ల ఇంట్లో పెళ్లి చేసుకోమని పోరు పెడుతున్నారు. వాళ్లకి మా సంగతి తెలుసు. అన్నకి కాకుండా నేనెలా చేసుకోగలనని నేను.

''అసలు మీ అన్నయ్యకు పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉందో, లేదో కనుక్కో! చేసుకుంటాడంటే.. మనమే ఓ మంచి అమ్మాయిని వెతుకుదాం'' అంది మానస. అదే కారణం, హైదరాబాద్ రావడానికి.

కాలింగ్ బెల్, మూడు నాలుగుసార్లు మోగాక, వచ్చి తలుపు తీశాడు. అప్పుడే నిద్రలేచి వచ్చినట్లున్నాడు, ముఖం మత్తుగా ఉంది. లోపలికి వచ్చాక, కూర్చోమంటూ కుర్చీ వైపు చూపించాడు. రూం అంతా అస్తవ్యస్తంగా ఉంది. గాలి లేదు, వెలుతురు లేదు. ఇంటి నిండా ధూళి, వింత వాసన.

''మంచి నీళ్లేమైనా తాగుతావా..?'' నా ఎదురుగా కూర్చుంటూ అడిగాడు.

''లేదు'' అన్నాను.

''రాత్రంతా నిద్ర పట్టలేదు. అమ్మ మాట్లాడుతూనే ఉంది. ఈ మందుల మత్తుకేమో ఉదయం నిద్ర పట్టేస్తుంది. ఇప్పటికీ తల తిరిగేస్తుంది'' ఆవలిస్తూ చెప్పాడు.

అన్ననీ, తన రూంనీ నమ్మలేనట్లుగా చూస్తూ కూర్చున్నాను.

''నువ్వు ఫ్రెష్ అవు, నేను ఓ కునుకు తీసి వస్తాను. లేచాక తినడానికి బయటకు వెళ్దాం'' అని చెప్పి, నా జవాబు కోసమైనా చూడకుండా బెడ్ రూం లోపలికి వెళ్లిపోయాడు.

ఫ్లోర్ పై అంగుళమెత్తు ధూళి ఉంది. బ్యాగ్ ఎక్కడ పెట్టాలో తెలీక చుట్టూ చూసి, తిరిగి లేచి నేను కూర్చున్న కుర్చీ మీదే పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ బెడ్ రూం లోపలికి వెళ్లాను.

అప్పటికే మత్తునిద్రలోకి వెళ్లిపోయాడు అన్న. అలా తననే చూస్తూ నిల్చున్నాను. ముప్పై రెండేళ్ల అన్న.. బానపొట్టతో, తెలుపునెరుపు అంటుకున్న గెడ్డంతో, నలభై ఐదేళ్ల వాడిలా ఉన్నాడు. కాళ్లూ, చేతులూ బారగా చాపి, పసిపిల్లాడిలా నిద్రపోతున్నాడు. ఎదురుగా గోడపై ఏదో పెయింటింగ్ కనిపించింది, దగ్గరకు వెళ్లి చూశాను. యానిమే పెయింటింగ్. రంగురంగుల సీతాకోకచిలుకలు గాల్లో ఎగురుతుంటే, నేలపై ఓ గొంగళి పురుగు ఒంటరిగా పైకి చూస్తూ నిల్చుంది, తనకు రెక్కలు రావన్నట్లు, రంగులు చూడలేదన్నట్లు... అన్న మనసుకి అద్దంలా..!

కళ్లంట జలజలా నీళ్లు. తను అనుకున్న లక్ష్యానికి చేరుకోలేకపోయాడు. ప్రేమ లేదు, పెళ్లి లేదు, మరో సంతోషమో, వ్యాపకమో లేదు. ఇంకా ఈ మానసిక రుగ్మత నయం కాలేదు. ఏమిచ్చింది జీవితం అన్నకు? రంగులన్నీ లాగేసుకుని గొంగళి పురుగుగానే గడపమన్నట్లు. తను ఉన్న ఈ పరిస్థితికి ఏ ధైర్యంతో  అడగగలను, పెళ్లి చేసుకుంటావా? అని. లేదంటే, నేను చేసుకుంటానని ఎలా చెప్పగలను? ఈ స్థితిలో ఉద్యోగమెలా చేస్తున్నాడు? ఏం తింటున్నాడు? ఎలా ఉంటున్నాడు? అన్నను అలా చూస్తూ నేలపై కూలబడి ఏడ్చేశాను, ఎంత సమయమో గుర్తు లేనంతగా. నాలుగు గోడల మధ్య, అన్న నిద్రా విగ్రహం పక్కన, నా కళ్లు నేలను తడిపాయి, నా గొంతు ఎండింది.

ఓ నిర్ణయం తీసుకున్నాక లేచి నిల్చున్నాను. ఇకపై అన్నను ఇలా వదిలేయకూడదు. అన్నతో పాటే ఉండాలి. అన్నకు ట్రాన్స్‌ఫర్ చేయించో, లేదంటే నేనే బిజినెస్ ఇక్కడికి మార్చుకునో, ఒకేచోట బతకాలి. వాడిని బాగా చూసుకోవాలి. రెండు మూడేళ్లు చిన్నవాడిని, ఏం అన్నకు అన్నను కాలేనా! అమ్మా, నాన్ననై చూసుకోలేనా! నాకంటూ మిగిలిన కుటుంబం వీడే కదా, వీడినొదిలి ఎక్కడికీ ఈ పరుగు..!

వాడిచేతిని నా చేతిలోకి తీసుకున్నాను. ఓ కన్నీటి చినుకు తన చేతిని తడిపింది. మెల్లగా కళ్లు తెరిచి నన్ను చూశాడు. ■



పొన్నాడ వెంకట అన్నాజీరావు
94411 21556

ఈవారం కథ



● డా. సన్నిహిత్


# తరువుకి కాయ భారమా!

ఓటమి అనేది ఎవరికైనా బాధాకరం. జీవితంలో ఎంతో సాధించాక, ఎన్నో మెట్లెక్కాక, ‘నువ్వు ఓడిపోయావు’ అని నీ జీవితం నీతో చెబితే అది ఎంత విషాదకరం. రఘురాం పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉంది. ఎక్కడో పల్లెటూర్లో పుట్టిన వాడు. కష్టపడి చదువుకుని ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఢిల్లీ దాకా ఎదిగిన వాడు. కానీ ఏం లాభం? ఇప్పుడు వెనక్కు తిరిగి చూసుకుంటే, సాధించిందంతా శూన్యం అని తెలిసి వచ్చింది. భార్య, పిల్లలు అందరూ అతన్ని ఒక చేతగాని వాడు అని తీర్మానించి వదిలారు. వయసు మళ్ళిన అతను ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. అయితే అది నిజమా లేక కేవలం వారి అభిప్రాయం మాత్రమేనా అన్న సంశయం అతన్ని పీడించసాగింది. ఎటూ తేల్చుకోలేక నిరంతరం ఆలోచనల్లోకి జారిపోతున్నాడు. ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతున్నాడు!

●●●

‘రఘూ... అన్నం తిను నాన్నా’ అని బతిమాలుతున్న తల్లిని కోపంగా చూశాడు రఘురాం.

అన్నపూర్ణకు కూడా కోపం వచ్చింది. ఎంతసేపూ చదువు చదువు అంటూ తిండీ తిప్పలు మానేస్తున్నాడు రఘురాం. ఇలా అయితే పిల్లాడు ఎలా బలంగా ఉంటాడు అని ఆమె బాధ. అసలే పల్లెటూరు, తిండి తినకుండా



అనారోగ్యం పాలైతే వైద్య సౌకర్యం లేదు. ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న టౌన్ హాస్పిటల్‌కి వెళ్లాల్సి వస్తుంది.

చాలాసేపు బతిమాలాక పుస్తకం ముందు నుండి లేచాడు రఘురాం. తల్లి పెట్టిన అన్నం కూర తిని పెరుగు కూడా వేసుకున్నాడు. సంతృప్తిగా చూసింది అన్నపూర్ణ.

‘ఏరా...అన్నం తిన్నావా?’ ప్రేమగా అడిగాడు అప్పుడే పొలం నుండి వచ్చిన శంకరయ్య.

‘తిన్నాను నాన్నా’ అని చెప్పి మళ్ళీ పుస్తకం అందుకున్నాడు రఘురాం. ముసి ముసిగా నవ్వుకుంది అన్నపూర్ణ.

రఘురాం చాలా మంచి విద్యార్థి. రోజూ ఇంటి పక్కనే ఉన్న ఎలిమెంటరీ స్కూల్‌కి వెళుతూ బుద్ధిగా చదువుకుంటాడు. టీచర్లకు కూడా అతనంటే ఎంతో ఇష్టం. చదువు పట్ల అతని శ్రద్ధను చూసి మురిసిపోతారు అన్నపూర్ణ శంకరయ్యలు. ఊరి వాళ్ళు కూడా ‘మంచి కొడుకుని కన్నావమ్మా’ అని చెబుతూ ఉంటారు అన్నపూర్ణతో!

కాలచక్రం గిర్రున తిరిగింది. రఘురాం ఇంజినీరింగ్ పూర్తి చేసి కేంపస్ ఇంటర్వ్యూలో క్లియర్ అయ్యాడు. హైదరాబాద్‌లో ఉన్న ఒక పబ్లిక్ సెక్టార్ కంపెనీలో జూనియర్ ఇంజినీర్ పోస్ట్‌కి సెలెక్ట్ అయ్యాడు. అతని విజయాన్ని చూసి గ్రామస్థులు వేనోళ్ళ పొగిడారు. కొడుక్కి దిష్టి తీసి హైదరాబాద్ పంపించింది అన్నపూర్ణ.

జాబ్‌లో జాయిన్ అయి సెటిల్ అయ్యాక తల్లిదండ్రులని రమ్మన్నాడు రఘురాం.

ఒక మంచిరోజు చూసుకుని హైదరాబాద్ వచ్చారు వాళ్ళు. కొడుకు ఉంటున్న కంపెనీ క్వార్టర్‌ని, ఆ నాగరిక వాతావరణాన్ని చూసి మురిసిపోయారు. తమలాంటి వాళ్ళ కడుపున పుట్టి ఇక్కడి దాకా ఎదిగిన కొడుకు మీద వారి ప్రేమ రెట్టింపయింది. ఉన్నన్నాళ్ళు వాళ్ళకి హైదరాబాద్‌లో ఉన్న అన్ని టూరిస్ట్ ప్రదేశాలను తిప్పి చూపించాడు రఘు. సంతోషపడిపోయారు వాళ్ళు. కొన్ని రోజుల పాటు కొడుకుని బాగా చూసుకుని తమ ఊరు వెళ్ళడానికి బయలుదేరారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో వాళ్ళను ట్రైన్ ఎక్కించి బయటకు వస్తూ చిన్న పిల్లాడిలా కన్నీళ్ళు పెట్టుకున్నాడు రఘురాం.

చాలా ఒంటరిగా ఫీల్ అయ్యాడు. ఇంకోవైపు రైల్లో వెళుతున్న అతని తల్లిదండ్రుల పరిస్థితి కూడా అదే. కొడుకును వదిలి ఎప్పుడూ ఉండలేదు వాళ్ళు!

●●●

వృత్తిలో ఎదుగుతున్నాడు రఘురాం. ఒక గ్రేడ్ ప్రమోషన్ పొందాక పెళ్ళి మీద మనసయింది అతనికి. కొలీగ్ రవళి అందుకు కారణం. అందం, తెలివితేటలతో అతని మనసు దోచుకుంది.

అమాయకంగా కనపడుతూ కష్టపడే మనస్తత్వం ఉన్న రఘురాం కూడా ఆమె మనసుని కొల్లగొట్టాడు. ఈ విషయం తెలిసి ఎంతో సంబరపడిపోయారు అన్నపూర్ణమ్మ దంపతులు.

ఆకాశమంత పందిరి వేసి భూదేవి అంత పీట వేసి కొడుక్కి పెళ్ళి చేశారు. మనసారా దీవించి దగ్గరుండి దంపతులతో కాపురం పెట్టించారు. శోభనం ముహూర్తం పెట్టి, ఆ అద్భుత క్షణాల్లో రఘుని, రవళిని గదిలోకి పంపించారు. రఘు మనసు ఉద్విగ్నంగా ఉంది. అనుభవించబోయే సుఖాన్ని తలచుకుని అతని మనసు గాల్లో తేలుతోంది. రవళిని ఆశగా దగ్గరకు తీసుకున్నాడు.

సున్నితంగా అతన్ని విడిపించుకుని దూరంగా జరిగింది రవళి. నవ్వుకున్నాడు రఘు. తొలి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కలయిక పట్ల ఆమెకు భయం ఉంది అనుకున్నాడు.

రవళి సిగ్గుపడుతూ 'ఇంట్లో మీ అమ్మా నాన్న ఉన్నారు కదా... నాకు కొంచెం ఇబ్బందిగా ఉంది. వాళ్ళు ఊరు వెళ్ళిపోయాక మనం కలుద్దాం. అప్పటిదాకా వద్దు' అంది.

ఆమె చెప్పిన లాజిక్ అర్థం కాలేదు రఘుకి. అయినా 'సరే ' అన్నాడు. తర్వాత మంచంపై విడిగా పడుకున్నారు ఇద్దరూ.

తర్వాతి రోజు నుంచే కోడలి మనస్తత్వం అర్థం చేసుకున్నారు రఘు తల్లిదండ్రులు. తాము ఉండటం ఆ అమ్మాయికి ఇష్టం లేదు అని తెలుసుకున్నారు. ఆ విషయాన్ని గొడవగా మారిస్తే కొడుకు మనసు బాధపడుతుందని మిన్నకుండిపోయారు.

'ఊళ్లో పనులు ఉన్నాయిరా... వెళ్తాం' అని కొడుకుతో అన్నారు. వెంటనే, 'సరే...' అన్నాడు రఘు.

సికింద్రాబాద్‌లో వాళ్ళని రైలు ఎక్కించి బయటకు వచ్చాక 'హమ్మయ్యా' అని రిలీఫ్‌గా ఫీలయ్యాడు.

ఆ రాత్రి రవళి కౌగిలిలో కరిగిపోతూ స్వర్గాన్ని చూశాడు.

కొడుకు సుఖాన్ని కోరుకున్న రఘు తల్లిదండ్రులు ఆ తర్వాత ఎప్పుడూ హైదరాబాద్ రాలేదు. ఏదైనా అవసరం ఉంటే రఘు మాత్రమే ఊరు వెళ్ళి వస్తూ ఉండేవాడు.

తొలిసారిగా కొడుకు పుట్టాడు రఘు దంపతులకి. వాళ్ళ ఆనందం అంబరాన్ని అంటింది.

నామకరణం రోజున రమ్మని తల్లిదండ్రులకు కబురు చెప్పాడు రఘు.

ఆ రోజుకి హైదరాబాద్‌లో దిగారు వాళ్ళు. ప్రేమగా ఆహ్వానించాడు రఘు. రవళి మాత్రం వాళ్ళతో మాట్లాడలేదు. మనవడ్ని చూసి మురిసిపోయారు అన్నపూర్ణమ్మ దంపతులు.

ఆ పసివాడికి తమ కులదైవం పేరు పెట్టాలని అడిగారు రఘుని. అది విన్న రవళి 'నా కొడుక్కి పిచ్చి పిచ్చి పేర్లు పెట్టొద్దు. నచ్చితే ఉండండి లేదంటే వెళ్ళిపోండి' అని కఠినంగా చెప్పింది. దెబ్బ తిన్న పక్షుల్లా చూశారు వాళ్ళు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి వాళ్ళకి. రఘు అయితే నోట మాటరాక అలా నిలబడిపోయాడు.

అసలు కోడలికి తమ మీద ఎందుకంత ద్వేషమో అర్థం కాలేదు వాళ్ళకి. నామకరణ కార్యక్రమం అయిన మర్నాడే తమ ఊరు వెళ్ళిపోయారు. వెళుతూ వెళుతూ, 'మమ్మల్ని ఇంకెప్పుడూ పిలవకురా' అని రఘురాంతో చెప్పారు. అభావంగా చూశాడు రఘు.

●●●

శంకరయ్య దిగులుతో మంచం పట్టేశాడు. కొడుకు దగ్గర ఉంటూ శేష జీవితాన్ని హాయిగా గడపాలనుకున్న అతని కల నెరవేరక



**అ లా గా!**

అమెరికన్ వ్యాపార దిగ్గజం వారెన్ బఫెట్ పెట్టుబడుల వ్యూహాల గురించి, ఆయన వ్యాపార విజయాల గురించి చాలామందికి తెలుసు.

ఆయనకు స్టాక్ మార్కెట్ వ్యూహాల్లోనే కాదు, సంగీతంలోనూ నైపుణ్యం ఉంది. ఉకులెలె వాయించడం ఆయనకు ఇష్టమైన కాలక్షేపం. కొన్ని బహిరంగ కార్యక్రమాల్లో కూడా ఆయన ఉకులెలె ప్రదర్శనలు ఇచ్చారు.

మనోవ్యాధిగా మారింది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు.

ఇక బ్రతకడం కష్టం అని డాక్టర్స్ చెప్పాక రఘుకి కబురు పెట్టింది అన్నపూర్ణమ్మ. బిజీ (?)గా ఉండటం వల్ల వెంటనే ఊరికి వెళ్ళలేకపోయాడు రఘు. చివరి చూపులు కూడా దక్కకుండా కన్ను మూశాడు శంకరయ్య. ఆ విషయం రఘుకి చేరవేశారు ఊరి వాళ్ళు. తండ్రి మరణ వార్త విని మనసులో విపరీతంగా దుఃఖించాడు రఘు.

'నాన్నగారు ఇక మనకి లేరు' అని రవళితో ఏడుస్తూ చెప్పాడు.

పెద్దగా బాధ పడలేదు ఆమె. మామగారితో అంత అనుబంధం లేదు కదా ఆమెకు.

'సరే... వెళ్ళి జరగాల్సిన కార్యక్రమాలు చూసుకుని తిరిగి వచ్చెయ్' అని చెప్పింది. వెంటనే బయలుదేరి ఊరికి వెళ్ళాడు రఘురాం.

ఊరి వాళ్ళంతా 'ఇప్పుడా రావడం' అన్నట్టు అతన్ని ఒక దోషిలా చూడసాగారు. మనసులో బాధ పడుతూనే తండ్రికి అంత్యక్రియలు జరిపించాడు. తల్లికి జాగ్రత్తలు చెప్పి హైదరాబాద్ తిరిగి వచ్చేశాడు.

అన్నపూర్ణమ్మ పరిస్థితి మరీ దిగజారిపోయింది. ఇన్నాళ్ళూ తోడు ఉన్న భర్త చనిపోవడంతో ఒంటరితనం చుట్టుముట్టింది ఆమెను. కొడుకు దగ్గరకి వెళ్ళి ఉండమని గ్రామస్తులు సలహా ఇచ్చారు.

ఒక రోజు రఘుకి ఫోన్ చేసి 'బాబూ... నీ దగ్గరకు వస్తానురా... ఇక్కడ నాకు భయంగా ఉంది' అని అడిగింది. గొంతులో ఏదో అడ్డు పడినట్టు ఏమీ చెప్పలేకపోయాడు రఘు.

'మళ్ళీ ఫోన్ చేస్తానమ్మా' అని కాల్ కట్ చేశాడు. ఆఫీసు నుండి ఇంటికి వచ్చాక 'అమ్మ ఫోన్ చేసింది. ఇక్కడకు వస్తాను అంటోంది' అని రవళితో చెప్పాడు.

'అనుకున్నాను... ఇలాంటి రోజు వస్తుందని. నాకు అయితే ఆవిడ రావడం ఇష్టం లేదు. నీకు నచ్చితే పిలిపించుకో' అని తేల్చేసింది రవళి. తల పట్టుకున్నాడు రఘురాం.

బాగా ఆలోచించాక, తల్లిని అలా వదిలేస్తే లోకం నిందిస్తుందని భయపడి ఏదైతే అది అయిందని తల్లిని తన దగ్గరకు రమ్మని ఫోన్ చేశాడు. ఒక రోజు పొద్దున్నే హైదరాబాద్‌కి చేరుకుంది అన్నపూర్ణమ్మ. తల్లిని రైల్వే స్టేషన్ నుండి పికప్ చేసుకుని తీసుకొస్తూ, దారిలో బోలెడన్ని జాగ్రత్తలు చెప్పాడు రఘు. రవళితో ఎక్కువగా మాట్లాడొద్దని, తమ వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించాడు. అన్నిటికీ తలూపింది అన్నపూర్ణమ్మ.

ఇంట్లోకి వచ్చిన అత్తను చూసి తల తిప్పుకుంది రవళి. ఈ చర్యతో చెప్పలేని బాధకు గురయింది అన్నపూర్ణమ్మ. భర్త చనిపోయి ఇక్కడికి వస్తే కనీసం పలకరించే దిక్కు లేదు అని మథనపడింది. రఘురాం ఇది గమనించినా, తెలియనట్టు తప్పుకున్నాడు.

అత్తాకోడళ్ళు ఇద్దరూ ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నారు ఇంట్లో. రఘు వాళ్ళిద్దరి మధ్యన నలిగిపోతున్నాడు. మనవడు ఆదిత్య మాత్రం, నాన్నమ్మతో అప్పుడప్పుడు మాట్లాడేవాడు. అది కొంత ఉపశమనం కలిగించేది అన్నపూర్ణమ్మకు.

రఘురాంకి ఆఫీసులో ఇది ప్రమోషన్ రావాల్సిన టైము. కష్టపడి పని చేసి బాస్‌ని ఇంప్రెస్ చేస్తున్నాడు. రోజూ ఆఫీసు నుండి లేట్‌గా వస్తున్నాడు. రవళి కూడా వర్క్‌లో బిజీగానే ఉంటోంది.

ఆదిత్య తన స్కూల్ ఫ్రెండ్స్‌తో చాటింగ్ చెయ్యడం, స్మార్ట్ ఫోన్‌లో రీల్స్ చూడటంతో ఎవరినీ పట్టించుకునే స్థితిలో ఉండడు. వీటన్నిటి వల్ల అన్నపూర్ణమ్మ ఒంటరిగా ఫీల్ అవసాగింది. కొడుకు దగ్గర ఉంటే మనసు కుదుట పడుతుందని వస్తే అది మరింత మానసిక ఒంటరితనం కలిగించడం ఆమెకు నచ్చడం లేదు. అలాగని ఊరు తిరిగి వెళితే అది మరింత పరువు పోయే చర్య అవుతుంది.

కొడుకు ఉంచుకోలేక పంపించేశాడు అని నవ్వుతారు ఊళ్ళో వాళ్ళు. అందుకే మనసు చంపుకుని కాలం వెళ్ళదీయసాగింది.

ఒక రోజు ఆఫీసు నుండి వస్తూనే అసహనంగా అరవసాగాడు రఘురాం.

'ఏమైంది... ఇలా డిస్టర్బ్‌డ్‌గా ఉన్నావు?' అని అడిగింది రవళి.

'ఎలా ఉంటాను... నా పేరు ప్రమోషన్ లిస్ట్‌లో లేదు' అని ఏడుపు మొహం పెట్టాడు రఘు.

'అందుకే నేను ఎప్పటి నుండో చెబుతున్నాను. ఆ దరిద్రాన్ని ఇంట్లో నుండి పంపెయ్యమని. మీరు వినడం లేదు. తెచ్చి నెత్తి మీద పెట్టుకున్నారు. ఇక ప్రమోషన్ ఎలా వస్తుంది' అని అగ్నికి ఆజ్యం పోసింది.

'అవును... నిజమే' అని కోపంగా రగిలిపోతూ తల్లి దగ్గరకు వచ్చి, 'అమ్మా... నువ్వు

ఊరెళ్ళిపో' అని గట్టిగా అరిచాడు.

హతాశురాలైంది అన్నపూర్ణమ్మ. ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్టు తనకు సంబంధం లేని ఈ గొడవకు తాను కారణం ఎలా అవుతుంది అని ఆశ్చర్యపోయింది.

కొడుకుని కష్టపడి పెంచి పెద్దచేసి ఒక స్థాయికి తీసుకువస్తే ఇవాళ అతని కంటికి తానొక దరిద్రంలా కనబడటం జీర్ణించుకోలేకపోయింది. ప్రాణం పోయినట్టు విలవిల్లాడిపోయింది. ఇక కొడుకు దగ్గర ఉండటం అర్థరహితం అని నిర్ణయించుకుని మర్నాడే ఊరు బయలుదేరింది.

సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆమెను రైలు ఎక్కించి బయటకు వచ్చాక 'హమ్మయ్యా... దరిద్రం వదిలింది' అని రిలీఫ్‌గా ఫీల్ అయ్యాడు రఘురాం.

● ● ●

'తల్లి' అనే దరిద్రం వదిలాక వృత్తిలో ఎదగసాగాడు రఘురాం. ప్రమోషన్ కూడా వచ్చింది.

అయితే ఢిల్లీలో పోస్టింగ్ ఇచ్చారు. వెళ్ళక తప్పని పరిస్థితి. రవళిని, కొడుకు ఆదిత్యాని వదల్లేక వదల్లేక వదిలి ఢిల్లీ వెళ్ళి ఆఫీసులో జాయిన్ అయ్యాడు. అక్కడే క్వార్టర్స్‌లో మకాం పెట్టాడు. వంటకు అదీ ఇబ్బంది లేదు. వేళకు తిండి తినడం, ఆఫీసుకు వెళ్ళి పని చేయడం ఇదే అతని దినచర్య. ఇక్కడ హైదరాబాద్‌లో రవళి , తన కొడుకు ఆదిత్యను బాగా చదివిస్తూ బిజీగా అయిపోయింది.

కొన్నాళ్ళ తర్వాత పై చదువులకు విదేశాలు వెళ్ళిపోయాడు ఆదిత్య. అటు భర్తకు దూరంగా ఉండటం, ఇటు కొడుకు ఎబ్రాడ్ వెళ్ళడంతో ఒంటరితనం ఆవరించింది రవళికి. ఆమె మనసు స్వేచ్ఛను, ఆనందాన్ని కోరుకోసాగింది.

ఒకరోజు రఘురాం రవళితో ఫోన్‌లో అన్నాడు. 'నువ్వు జాబ్ మానేసి ఢిల్లీ వచ్చెయ్. హాయిగా కలిసి ఉందాం' అని. ఒళ్ళు మండింది రవళికి.

'నేను జాబ్ ఎందుకు మానాలి? నువ్వే మానేసెయ్. నేను కూడా కెరీర్‌లో ఎదగాలి కదా?' అని మండిపడింది. ఇక నోరు తెరవలేకపోయాడు రఘురాం.

ఒకసారి ఎందుకో భార్యను చూడాలి అనిపించి చెప్పా పెట్టకుండా హైదరాబాద్ వచ్చాడు. కానీ తీరా ఇంటికి వచ్చేటప్పటికి రవళి లేదు. సెల్‌కి కాల్ చేస్తే రెస్పాన్స్ లేదు. ఇక చేసేదేమీ లేక వెయిట్ చెయ్యసాగాడు. ఎప్పుడో రాత్రికి వచ్చింది రవళి. రఘురాంని చూసి షాక్ అయింది.

హతాశురాలైంది అన్నపూర్ణమ్మ. ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్టు తనకు సంబంధం లేని ఈ గొడవకు తాను కారణం ఎలా అవుతుంది అని ఆశ్చర్యపోయింది.

'ఏంటి చెప్పకుండా దొంగలా వచ్చావు? నా మీద అనుమానమా?' అని వెటకారంగా అంది.

నిజానికి ఆమె తన వాట్సాప్ గ్రూప్ ఫ్రెండ్స్‌తో ఊరి చివర రిసార్ట్‌కి ఔటింగ్‌కి వెళ్ళింది. బాగా ఎంజాయ్ చేసి అలసిపోయి వచ్చింది.

'అలా ఎందుకు అనుకుంటావు. రావాలి అనిపించింది వచ్చాను. ఇందులో తప్పేం ఉంది?' నెమ్మదిగా అన్నాడు రఘురాం.

'తప్పేం లేదు. నిన్ను నమ్మడం నాదే తప్పు' అని విసుక్కుంది. ఆ రాత్రి ఆమెను దగ్గరకు తీసుకోవాలి అనుకున్నాడు కానీ రవళి అతనికి ఆ ఛాన్స్ ఇవ్వలేదు. భౌతికంగా దూరమైన వారి మధ్య ఇప్పుడు మానసిక దూరం కూడా పెరిగిపోయింది. తెల్లారి లేచి ఢిల్లీ వెళ్ళిపోయాడు రఘురాం.

ఎందుకో తెలీదు కానీ క్రమంగా అనారోగ్యం పాలయ్యాడు రఘురాం. బీపీ, షుగర్ అతన్ని ముట్టడించాయి. రోజు రోజుకీ బాగా నీరసించిపోతున్నాడు.

ఇక తప్పక ఒక రోజు భార్యకు ఫోన్ చేసి, 'నాకు దగ్గరగా ఉండు... సమయానికి చేసే వాళ్ళు లేక ఇబ్బందిగా ఉంది.. ఇక్కడికి వచ్చెయ్' అని బతిమాలాడు.

గట్టిగా నవ్వింది రవళి. 'ఏం మాట్లాడుతున్నావు? నేను అన్నీ మానుకుని వచ్చి నీకు సేవలు చెయ్యాలా? ఏ కాలంలో ఉన్నావు? నాకు నా లైఫ్ ముఖ్యం. నీ బాగోగులు చూసుకుంటూ నా లైఫ్ వృథా చేసుకోలేను... బై' అని ఫోన్ పెట్టేసింది. కొడుకు ఆదిత్యకు కాల్ చేస్తే కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదు వాడు. గుండె ముక్కలు అయింది రఘురాంకి. తన శక్తియుక్తులన్నీ కుటుంబం కోసమే ధారపోశాడు. తన బంధువులందరినీ వదులుకుని, భార్య, కొడుకు చుట్టూనే తన జీవితాన్ని నిర్మించుకున్నాడు. కానీ తను కొంచెం బలహీనం అయ్యేసరికి ఎవరికీ అక్కరలేకుండా పోయాడు. ఇదేనా కుటుంబ బంధాలకు ఉన్న విలువ? ఇందుకోసమేనా తన జీవితాన్ని పణంగా పెట్టింది అన్న ప్రశ్నలు అతన్ని వేధించ సాగాయి. మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి.

బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాడు. వాలంటరీ రిటైర్మెంట్‌కి అప్లై చేశాడు. మూటా ముల్లె సర్దుకున్నాడు. ఎయిర్ పోర్ట్‌కి వచ్చి టికెట్ కొనుక్కుని ఫ్లయిట్‌లో కూర్చున్నాడు. ఇప్పుడు అతని మనసు ప్రశాంతంగా ఉంది.

● ● ●

ఉరుము లేని పిడుగులా ఊడిపడ్డ కొడుకుని చూసి ఆనందాశ్చర్యాలకు లోనయింది అన్నపూర్ణమ్మ.

'రా నాయనా... రా...' అని ప్రేమగా ఆహ్వానించింది. తల్లిని చూసి పసివాడిలా కన్నీళ్ళు పెట్టుకున్నాడు రఘురాం. చిన్నప్పుడు తల్లి తనని వదిలి ఏదైనా ఊరు వెళితే ఆమె వచ్చేదాకా ఎదురు చూసి రాగానే, 'అమ్మా ...' అంటూ కౌగలించుకునేవాడు. ఎంత నిశ్చింతగా ఉండేదో అప్పుడు.

ఇప్పుడు కూడా అలాగే నిశ్చింతగా, సెక్యూర్డ్‌గా ఫీల్ అయ్యాడు. తనకు ఇంక ఏ భయమూ లేదని ఆనంద పడ్డాడు.

'అమ్మా... ఇక నిన్ను విడిచి నేను ఎక్కడికీ వెళ్ళనమ్మా...' అని చిన్న పిల్లాడిలా చెప్పాడు. నిండుగా నవ్వింది అన్నపూర్ణమ్మ.

'అలాగే నాయనా... ఎక్కడికీ వెళ్ళొద్దు... నాతో పాటే నువ్వూ ... నా ఊపిరి ఉన్నంత వరకు నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటాను' అని దగ్గరకు తీసుకుంది. తల్లి ఒడిలో పసివాడిలా ఒదిగిపోయాడు పెద్ద రిటైర్డ్ ఆఫీసర్ రఘురాం... భార్యా కొడుకులకు భారం అయిపోయిన రఘురాం!!

---

**కిసుక్కు**

**బుడుగు:** మనుషుల కంటే రైళ్లే తెలివైనవి.

**చింటూ:** ఎలా?

**బుడుగు:** తెలియని చోటుకెళితే మనం దారి తప్పిపోతుంటాం. రైళ్లు మాత్రం తప్పిపోకుండా తిరిగి అదే స్టేషన్‌కు వచ్చేస్తాయి.

---

## కథాకళి FEED ME A STORY

**5.7.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'గొలుసు ఉత్తరం' కథకి పాఠకులు సూచించిన టాప్ 5 పేర్లు.**

సాయి – కసాయి
రామనపూడి వీరభద్రరావు, చిక్కాల

సాయి లేఖ – చావు కేక
ఉత్తరాది అఖిల, అనంతపురము

మృత్యులేఖ
ఆర్. ఎన్. కళ్యాణి, హైదరాబాద్
ఆరె సరళా రాణి, కుంచనపల్లి.

ఉత్తరానికి దక్షిణ
ఎస్.ఎస్.జీ.కే రాజు, హైదరాబాద్

'ఉత్తర' లోకాలకి
ఏ.ఎస్.వి. రామకృష్ణ, కాకినాడ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# తెలుగుతేజం

కథ

రాచపూటి రమేష్
9866727042

ఆఫీస్ రూంలో తన ముందు నిలబడ్డ బక్కచిక్కిన ఆరడుగుల ఆంజనేయులును తేరిపార జూశాడు పిప్పళ్ల బస్తాలాగా పూరిపోయిన ఒళ్లుతో సీటంతా ఆక్రమించిన శీనప్ప.

'ఏంది సంగతి? అన్నట్టు ఉరిమాడు శీనప్ప.

'సార్, మన జాంజిబార్ ఇంటర్నేషనల్ స్కూల్లో అన్ని సబ్జెక్టుల టీచర్లకూ నెలకు ముప్పై వేల జీతం వుంది. తెలుగు టీచర్నైన నాకు మాత్రం ఇరవై వేలే. ఇదెక్కడి అన్యాయం సార్?' బాధను అభినయిస్తూ చెప్పాడు ఆంజనేయులు.

'ఏందేంది? తెలుగు టీచరు శాలరీ పెంచాల్నా? అసలేముందయ్యా తెలుగులో. టైంలేదు గానీ నేనే చెప్పి పారేస్తును తెలుగు క్లాసు. సాంస్క్రీట్ తీసుకోమంటే వినకుండా కొందరు పిలకాయలు తెలుగు క్లాసులోనే కూలబడుండారు. ఐనా పిలకాయలందరితో ఇంగ్లీష్ మాట్లాడాలని సర్క్యులర్ ఇచ్చుండాము గదా, నువ్వేమో తెలుగులోనే మాట్లాడతా వుండావంట. ఏంది కత?' అని మళ్లీ ఉరిమాడు శీనప్ప.

'తెలుగు టీచర్ని, నేనెట్ల ఇంగ్లీషులో మాట్లాడేది సార్?'

'మాట్లాడాలయ్యా, ఎవరి కోసం మాట్లాడతావు? నెల తిరగంగానే ఇరవై వేలు బిళ్లకుడుములాగా ఇస్తా వుంటిమి. మేనేజ్మెంట్ అంటే అంత నిర్లక్ష్యమా. స్పీకిన్ ఇంగ్లీష్ మై డేయ్' శీనప్ప కోపోద్రేకంతో తాను వచ్చిన పని మరచిపోయాడు ఆంజనేయులు.

'అట్నే సార్, ఇంగ్లీషులోనే స్పీకుతా' అని కరస్పాండెంట్ గది నుండి బయటకు నడిచాడు ఉసూరుమని.

• • •

'అమ్మా, మన పిలకాయ ఆంజనేయులుకు మంచి సంబంధం తెచ్చుండాను. మీరు ఊ.. అంటే ఈ ఆదివారం పిల్లను చూసుకోను పోయొస్తాము' మధ్యవర్తి గురునాథం ఆంజనేయులు నాయనమ్మ ప్రభావతి ముందు వాలి అన్నాడు. ఒక యాక్సిడెంట్లో ఆంజనేయులు తల్లిదండ్రులు పోయారు. అప్పటి నుండి ఆంజనేయులు తన నాయనమ్మ ప్రభావతితో బాటూ స్వంత ఊరు తిరుపతి దగ్గరే వున్న చిగురువాడలో నివసిస్తూ వున్నాడు. రోజూ సిటీ బస్సులో తిరుపతి వెళ్లి, వస్తూ వుంటాడు.

'ఎందబ్బా గురునాథం! అమ్మాయి ఫోటో ఏదైనా వుందా?' గురునాథం తెచ్చిన ఫోటోలో అమ్మాయి సుబ్బలక్ష్మిని చూసి ముచ్చటపడింది ప్రభావతి వక్కాకు నములుతూ.

'పంతులుగారూ, నాకిప్పట్లో పెళ్లి, గిళ్లీ ఏమీ వద్దంటే మళ్లీ ఈ సంబంధాలు పట్టుకొనొస్తా వుండారు' బామ్మ ఇచ్చిన కాఫీని జుర్రుకుంటూ తాగుతూ అన్నాడు ఆంజనేయులు.

'అట్ల అంటే ఎట్లా అంజి బాబూ! ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలంటారు పెద్దవాళ్లు' బామ్మ ఇచ్చిన కాఫీ గ్లాసు ఆత్రంగా అందుకుంటూ అన్నాడు గురునాథం.

'వాడికేమి తెలుసు పిచ్చినాగన్నాని అట్నే గుర్నాథమూ! ఈ ఆదివారం పొద్దన పదిగంటలకు పిల్లను చూసుకోను వస్తామని వాళ్ల వాళ్లకు చెప్పు, అట్నే నువ్వు ఆ రోజు పొద్దునే ఇక్కడకు రా' అన్నది ప్రభావతి ఆనందంగా.

• • •

'తెలుగు టీచరు అంటే పిలక పెట్టుకొని, పంచె కట్టుకొని వూడిపడతారు అనుకొన్నుంటా. మరేంటి మామూలుగానే వుండారు!' అని ఆంజనేయులును చూసి నవ్వింది సుబ్బలక్ష్మి.

'సుబ్బలక్ష్మిగారూ! తెలుగు అన్నా తెలుగు టీచర్లన్నా మనవాళ్లు చాలామందికి చిన్నచూపు వుంది. మన మాతృభాష తెలుగు. మన సంస్కృతి, మన సంప్రదాయం తెలుగు. సుందర తెలుగు అన్నాడు. తమిళకవి భారతి, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అన్నాడు వెనిస్ యాత్రికుడు నికోలాకాంటీ. మన వాళ్లకింకా మన తెలుగు భాష గొప్పతనం అర్థం కాకపోవడం శోచనీయం' అన్నాడు ఆంజనేయులు.

'మీరెట్లాంటి పెద్ద పదాలు వాడితే మా పోలోళ్లకు అర్థం కాదు. ఏ సైన్సో, మాత్సో ఐతే ట్యూషన్లు చెప్పుకోనైనా బతకచ్చు. తెలుగు టీచర్ని కట్టుకొని ఏం సుఖపడతావు అంటా వుండారు మా ఫ్రెండ్సు. కానీ మీ సంబంధం ఒప్పుకోలేదంటే ఇంట్లో వాళ్లు అరుస్తారు. కాబట్టి మీరే నేను నచ్చలేదని చెప్పేయండి' అన్నది సుబ్బలక్ష్మి నవ్వుతూ.

భారమైన మనసుతో గదిలోంచి బయటకు వచ్చాడు ఆంజనేయులు.

'లక్షణమైన పిల్ల. నీకెందుకు నచ్చలేదురా' అని దారి పొడుగునా బామ్మ గొణుగుతూనే వుంది.

• • •

'హల్లో ఆంజనేయులూ, నేను మీ పల్లెకొస్తున్నా. మన స్కూలు బస్సు డ్రైవరు రహీము మీ పల్లెలోనే గదా వుండేది. అతని ఇల్లు నీకు తెలుసునా?' స్కూలు వైస్ ప్రిన్సిపాలు సూరరాజు నుండి ఫోన్ వచ్చింది ఆంజనేయులుకొక ఆదివారం.

'తెలుసు సార్' అన్నాడు అంజి. అట్లనే అన్నట్లుగానే సెంటరుకు వెళ్లి సూరరాజును రిసీవ్ చేసుకున్నాడు ఆంజనేయులు. టీకొట్టు బాష దగ్గర టీ తాగించాడు.

'ఏమైంది సార్, అట్లా మా వూరికొచ్చేసుండారు' సూరరాజును అడిగాడు ఆంజనేయులు.

'ఏమీ లేదు ఆంజనేయులూ, మన స్కూలు బస్సు డ్రైవరు రహీము పని మానేస్తానని నెలరోజులుగా గొణుగుతా వుండాడు. జీతం తక్కువంట. ఐదువేలు ఎక్కువివ్వాలంటాడు. అప్పటికీ మూడువేలు ఎక్కువిస్తామన్నాము. దానికీ ఒప్పుకోలే. రెండు రోజులుగా పనికే రాలే. పేరెంట్సు ఒకటే గోల. మనకి వేరే ఏ డ్రైవరూ దొరకలా. అందుకే వాడికి నచ్చజెప్పి, పనికి వచ్చేలా చూడాలని వచ్చుండా. వాడి ఇల్లు చూపించు. నేనే అతనితో మాట్లాడతా' అన్నాడు సూరరాజు. ఆంజనేయులు సూరరాజుకు రహీం ఇల్లు చూపించాడు.

'నువ్విక్కడే వుండు, నేనింట్లోకి పోయి మాట్లాడి వస్తా' అని రహీం ఇంట్లోకి పోయాడు సూరరాజు. అలా వెళ్లినవాడు పదినిమిషాల తర్వాత మొఖం వేలాడేసుకొని వచ్చాడు.

'ఏమైంది సార్?' అడిగాడు ఆంజనేయులు.

'ఆ రహీం మొండిగా వున్నాడు. పనికి రానంటే రానని అలిగి కూర్చున్నాడు. నేను ఎంత బతిమాలినా లాభం లేకపోయింది' అన్నాడు సూరరాజు.

'మీరిక్కడే వుండండి సార్' అని

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఆంజనేయులు రహీం ఇంటిలోనికి వెళ్లాడు.

రహీం దోస్తులతో ఒక టేబుల్ చుట్టూ ఉన్న ఛెయిర్స్ లో కూర్చుని వున్నాడు. టేబుల్ పై మందుసీసా, కూల్ డ్రింక్స్, పకోడీ, చిప్స్ వున్నాయి.

'ఏమి రహీం భాయ్ అలిగినావంట, అలుగుటయే ఎరుగని మహా మహిమాన్వితుడు అజాతశత్రుడవే అలిగిన నాడు/సాగరములన్ని ఏకము గాకపోవు/ కర్ణులు పదివేలుగ నెత్తురు నత్తురు రాజవాడా' అని ఆంజనేయులు పద్యం అందుకోగానే ఫక్కున నవ్వేశాడు రహీం.

'అంజి భాయ్, నాకు నాటకాలన్నా, పద్యాలన్నా ఎంత ఇష్టమో నీకు తెలుసు. మన వూరిలో తిరుపతి కేశవులు డ్రామా ఎప్పుడు నాటకం వేసినా నేను ముందు వరసలోనే వుంటాను' అన్నాడు రహీం ఆనందంగా. ఆంజనేయులు పకోడీ నములుతూ రహీంతో అదీ- ఇదీ మాట్లాడి మరునటి రోజు నుండి పనిలోకి వెళ్లేలా ఒప్పించాడు.

'ఎంతైనా ఒకే వూరి వాళ్లం. ఇంకో మూడు నెలల్లో ఈ మూడు వేలు కాకుండా ఇంకో రెండు వేలు నీ జీతంలో పెంచే పూచీ నాది' అన్నాడు ఆంజనేయులు. రహీం ఒప్పుకున్నాడు. ఈ శుభవార్త సూరరాజు చెవిలో వేసేసరికి అతడు పరమానంద భరితుడయ్యాడు. ఆంజనేయులు ఇమేజ్- మేనేజ్ మెంట్ దృష్టిలో పెరిగిపోయింది.

• • •

'అమ్మా, మొన్న పొరబాటున ఆ సుబ్బలక్ష్మి వాళ్ల సంబంధం చెప్పాను. మీరు సరే అంటే గజలక్ష్మి అనే చక్కనైన పిల్ల సంబంధం మాట్లాడతాను' పెళ్లిళ్ల పేరయ్య గుర్నాథం చెప్పాడు ప్రభావతితో.

'ఏమాత్రం వద్దు గురునాథం గారూ, ఆ సుబ్బలక్ష్మితోనే తలనొప్పి వచ్చింది. ఈ గజలక్ష్మి ఏం ఇక్కట్లు పెడుతుందో' మధ్యలో అందుకొని, చిందులు తొక్కాడు ఆంజనేయులు.

'మున్ముందెటికీ అలా జరగదండి. ఆ సుబ్బలక్ష్మి చదువు, సంధ్య లేని పిల్లాయె. ఈ గజలక్ష్మి అలా కాదే. డిగ్రీ, బీఈడీ చేసి మధురవాణి హైస్కూల్లో టీచరుగా పనిచేస్తూ వుంది. కాబట్టే మనవాడిని అర్థంచేసుకొని సహకరిస్తుంది. పైగా త్యాగరాజ కీర్తనలు పాడిందంటే ఎవరైనా మైమరచి పోవలసిందే' అన్నాడు గురునాథం ఊగుతూ. ఆ మాటలకు ఎగిరి గెంతేసింది ప్రభావతి. ఆ ఆదివారం పెళ్లి చూపులకు గజలక్ష్మి ఇంటి గడప తొక్కాల్సిందే అని డిసైడ్ చేసింది.

• • •

క్లాసులో చదివే పిల్లలకంతా రోజూ ఒక మంచి పద్యాన్ని చెప్పించి, వాళ్ల తల్లిదండ్రుల దగ్గరో, ఇంటిలోని తాతలు, నాయనమ్మలు వంటి పెద్దవారి వద్దనో ఆ కంఠతా పట్టిన పద్యాన్ని సమయం చూసి, పఠించమని చెప్పాడు ఆంజనేయులు పిల్లకాయలతో. వారం తరువాత ఆంజనేయులు క్లాస్ రూంలో వుండగా ప్రిన్సిపాల్ రమ్మని కబురుపెట్టారు. 'మళ్లీ ఏం కొంప మునిగిందో' అని భయపడుతూ ఆంజనేయులు ప్రిన్సిపాల్ భుజగోవిందం గదిలోకి అడుగుపెట్టాడు. సఫారీ సూట్‌లో దర్జాగా ఛెయిర్లో కూర్చుని వున్న ముప్పై ఐదేళ్ల వ్యక్తిని చూసి బెదిరిపోయాడు ఆంజనేయులు.

అతను షాక్ నుండి కోలుకోకముందే 'ఈయన మా తెలుగు టీచర్ ఆంజనేయులు గారు' అని అతడిని సఫారీ సూట్ వ్యక్తికి పరిచయం చేశాడు భుజగోవిందం.

సఫారీ సూట్ వాలాకు అయోమయంలోనే చేతులు జోడించాడు ఆంజనేయులు. సూట్ వాలా ఆంజనేయులు చేతులు పట్టుకొని వూపేస్తూ 'మాస్టారూ, మీరు మాకు మహోపకారం చేశారు' అన్నాడు. ఆంజనేయులు బిత్తరపోయాడు.

'నేను మిమ్మల్ని ఇప్పుడే చూస్తున్నాను. నేను మీకు ఉపకారం చేయడమేమిటి సార్?' అన్నాడు అయోమయంగా.

'చెప్తాను. నా పేరు సూరిబాబు. నేను సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాను. మా నాన్నగారి పేరు రెడ్డెప్ప, పెద్ద భూస్వామి. పాటలన్నా, పద్యాలన్నా చెవులు కోసుకుంటారు. నేను చాలా కాలంగా మా నాన్నను పొలాలు కౌలుదారులకు అప్పగించి, పల్లెటూరు వదలి నా దగ్గర వుండిపొమ్మని పోరు పెడుతున్నాను. కానీ మా నాన్న అందుకు ససేమిరా అంటున్నాడు. మీరు క్లాసు పిల్లలకు పద్యాలు నేర్పించి, రోజూ ఒక పద్యం పెద్దవాళ్ల దగ్గర చెప్పమన్నారా, నిన్న అనుకోకుండా మా ఇంటికి వచ్చిన మా నాన్న దగ్గర ఆ పద్యాలు పాడి వినిపించాడు మావాడు బాబీ. మా నాన్న చాలా సంతోషించి, రోజూ మనవడు చెప్పే పద్యాలు వినడానికి మా ఇంట్లోనే ఇక వుండిపోతానన్నాడు. ఈ ఘనతంతా మీదే!' అన్నాడు ఆనందంగా. ఆంజనేయులుకు నోట మాట రాలేదు.

సూరిబాబు పదివేలకు చెక్ రాసి, భుజగోవిందం చేతికిచ్చి 'ఇది ఆంజనేయులు గారికి మా ఫామిలీ తరఫున బహుమానం. తెలుగు భాషకు వారు చాలా మంచి సేవ చేస్తున్నారు. కాబట్టే నెల నెలా మీకే చెక్ పంపుతాను. జీతంతోపాటూ ఆంజనేయులుకు నేనిచ్చేది ఉదారా భక్తిగా ఇవ్వండి. ఆంజనేయులు గారు ఏ స్కూలుకు మారినా, నేను మా బాబీని ఆ స్కూలుకు పంపి, ఈ పారితోషికం ఇస్తానే వుంటాను' అన్నాడు. సూరిబాబు ఇంకా ఆంజనేయులును ఎన్నో విధాలుగా పొగిడి సెలవు తీసుకున్నాడు. అతడు వెళ్లిపోయాక భుజగోవిందం, 'ఆంజనేయులూ, నువ్వు మంచిపని చేస్తున్నావు. నీకు జీతం తక్కువిచ్చి పొరబాటు చేస్తున్నాం. ఇక మీదట నీకు మిగతా టీచర్లతో సమానమైన జీతం ఇస్తాం. అదనంగా ఈ సూరిబాబు నుండి వచ్చే పదివేలు కూడా ఇస్తాం' అన్నాడు. ఆంజనేయులుకు ఒక్కసారిగా కొండెక్కినంత సంబరం కలిగింది.

• • •

ఆంజనేయులు, వాళ్లమ్మ ప్రభావతి పెళ్లిచూపుల కోసం వచ్చి గజలక్ష్మి ఇంట్లో కూర్చుని వున్నారు. గజలక్ష్మి తండ్రి పీతాంబరం, తల్లి ఆండాళ్లు హడావిడిగా వున్నారు. కాఫీలు తాగాక, గజలక్ష్మినొక త్యాగరాజ కీర్తనను ఆలపించమని కోరింది ప్రభావతి. 'నగుమోము గనలేని....' అన్న కీర్తనను గుక్కతిప్పుకోకుండా పాడింది గజలక్ష్మి. ప్రభావతి ఆనందానికంతు లేదు.

'అబ్బాయి, అమ్మాయి మాట్లాడుకోవాలంటే ఆ గది వుంది' అన్నాడు పీతాంబరం. చెప్పినదే తడవుగా ఆ గదిలోకి దూరింది గజలక్ష్మి. వెనుకగానే ఆంజనేయులు వెళ్లాడు. 'మీకు నేను నచ్చకపోయినా, నా వుద్యోగం నచ్చకపోయినా ఇప్పుడే చెప్పేసెయ్యండి' అన్నాడు ఆంజనేయులు.

'మీరేమి, మహారాజులా వున్నారు. టీచరుద్యోగమైనాక తెలుగైనా ఒకటే, హైస్కూలైనా ఒకటే, ఆ మాటకొస్తే నేనూ టీచర్నే కదా. నాది ఒకటే కండిషను' అంది గజలక్ష్మి.

'ఏమిటో ఆ కండిషను' ఎకసెక్కంగా అన్నాడు అంజి.

'మీకు పల్లెలో రెండెకరాలు పొలం వున్నదని మీ బయోడేటాలో చూశాను. నేను పనిచేసే మధురవాణి స్కూలు అమ్మకానికుంది. ఓనరు ఇరవై లక్షలు చెబుతున్నాడు. నా దగ్గర ఒక ఐదు లక్షలు వుంది. మీ పొలమమ్మి మీరో పదిలక్షలు తెస్తే, మిగతాది అప్పో చేసైనా ఆ స్కూలు మనం కొని, స్వంతంగా నడుపుకోవచ్చు. బాగా నడుపుకొంటే నాలుగైదేళ్లలో ఆ అప్పు తీర్చేయవచ్చు' అంది గజలక్ష్మి.

ఆంజనేయులు నవ్వి, 'నేను చదువుకొన్నది, ఇన్నాళ్లూ మా ఇల్లు గడిచినది ఆ పొలం నుండి వచ్చే ఫలసాయంతోనే. ఇన్నాళ్లూ స్కూల్లో నా సంపాదన బ్యాంకులో దాస్తూ వచ్చాను. ఆ మొత్తం దాదాపు పది లక్షలు వుంటుంది. స్కూలు కొనడానికి ఆ మొత్తం సర్దడం నాకు పెద్ద పనేం కాదు' అన్నాడు. గజలక్ష్మి ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బై 'ఇక మన పెళ్లికి వేరే ఓకే కదా' అన్నది.

'ఓకేనే కానీ, నాదీ ఒక షరతు' అన్నాడు ఆంజనేయులు.

గజలక్ష్మి ఆందోళనగా 'ఏమిటది?' అన్నది.

'మన స్కూల్లో పిల్లలు ఇంగ్లీషులోనే మాట్లాడాలన్న నిబంధన వుండకూడదు, అలాగే మూడు నెలలకోసారి పద్య పఠనంలో పోటీలు పెట్టి, గెలుపొందినవారికి బహుమతులివ్వాలి' అన్నాడు ఆంజనేయులు.

గజలక్ష్మి ఆనందంగా ఆ షరతుకు ఒప్పుకొంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# చదువు - చేయూత

- శరత్ సుదర్శి, 7386046936

ఎయిడ్స్‌తో భర్త మరణించిన తర్వాత 11 ఏండ్ల భార్గవిని ఎలా పెంచాలో మమతకు అర్థం కాలేదు. కూతురిని బాగా చదివించాలని ఆమె కోరిక. దీంతో బతుకు తెరువు కోసం అనంతపురం నుండి హైదరాబాదులో ఉంటున్న తమ్ముడు ప్రదీప్ వద్దకు వచ్చింది. ఏదైనా పని చూసుకొని భార్గవిని దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలనుకుంది.

'భార్గవి కోసం దగ్గర్లో ఏదైనా గవర్నమెంట్ స్కూలుంటే చూడు జాయిన్ చేద్దాం. ప్రైవేట్ స్కూల్లో నేను ఫీజులు కట్టలేను' అంది తమ్ముడితో మమత. 'ఒక స్కూల్ ఉంది కానీ ఇక్కడి నుండి మూడు కిలోమీటర్లు. అంత దూరం భార్గవి ఎలా వెళ్లొస్తుంది' అన్నాడు ప్రదీప్. దాంతో మమతకు ఏం చేయాలో తోచలేదు.




వెంటనే ప్రదీప్ 'మనకు దగ్గరలో రెండు ప్రయివేటు స్కూల్స్ ఉన్నాయి. వాటిలో తక్కువ ఫీజుతో ఎవరైనా చేర్చుకుంటారేమో చూద్దాం' అన్నాడు. దీంతో మమత కాస్త ఊపిరిపీల్చుకుంది.

వారం రోజుల తర్వాత ప్రదీప్ ఒక రోజు 'అక్కా, ఇక్కడ దగ్గరలో చాక్లెట్ కంపెనీ ఉంది. అందులో లేడీ వర్కర్స్ కావాలంట. కూర్చొని చాక్లెట్స్ ప్యాకింగ్ చేసే పని. నెలకి రూ. 9,000 ఇస్తారు. నీకిష్టమైతే మాట్లాడతాను' అన్నాడు. 'వెళ్తాను రా, ఎందుకు వెళ్ళను. తిండికి గడవాలి కదా!' అని మరొసారి రోజు నుండే చాక్లెట్ కంపెనీకి వెళ్లడం మొదలుపెట్టింది. మూడు రోజుల తర్వాత 'భార్గవి స్కూల్ సంగతి ఏంటీ, ఇప్పటికీ చాలా రోజులయిపోయింది' అని అడిగింది తమ్ముడిని. 'మన బస్తీలోనే ఒక స్కూల్ ఉంది. ఆ స్కూల్లో ఏడాదికి పదిమంది పేద పిల్లలకు ఉచితంగా చదువు చెప్తారంట. అట్లాగే బట్టలు, పుస్తకాలు కూడా ఉచితంగా ఇస్తారంట' అన్నాడు ప్రదీప్.

ఎలాగైనా భార్గవిని ఆ స్కూల్లో చేర్చాలనుకుంది మమత. మరుసటి రోజు ఉదయాన్నే 8:30 గంటలకి భార్గవిని తీసుకొని ఎంతో ఆశతో ఆ స్కూల్‌కి వెళ్ళింది. అప్పటికే స్కూల్ ప్రారంభమై నెల రోజులు దాటిపోయింది. గేటు తీసుకుని లోపలికి వస్తుంటే, ఆయా అనుకుంటా 'ఏం కావాలి' అని అడిగింది. 'ఈ స్కూల్లో పేద పిల్లలకి ఉచితంగా చదువు చెప్తారంట కదా, మా అమ్మాయిని చేర్పిద్దామని వచ్చా' అన్నది మమత. దానికి ఆమె వెంటనే 'అడ్మిషన్లు అయిపోయాయి. ఇప్పుడు కుదరదు' అన్నది. ఆ మాటలతో మమత గుండెల్లో రాయిపడ్డట్టయింది. వెంటనే తేరుకుని 'ఒకసారి సార్‌ని కలుస్తాను, బతిమలాడో, కాళ్లు పట్టుకొనో చేర్చుకోమని అడుగుతా' అంటూ ఆయమ్మను అర్థించింది. కూతురు చదువు ఎక్కడ ఆగిపోతుందో అనే దిగులు ఆమె మాటల్లో, కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

ఆమె మాటలకు కరిగిపోయిన ఆయమ్మ 'సరే నువ్వు ఇక్కడే ఉండు, నేను అడిగొస్తాను' అని ప్రిన్సిపాల్ రూమ్‌కి వెళ్లింది. సార్ మీటింగ్‌లో ఉండడం గమనించి 'సార్ మీటింగ్‌లో ఉన్నాడు, కొద్దిసేపు అక్కడ కూర్చో' అని కూర్చీలను చూపించింది. అరగంట తర్వాత ఆయమ్మ ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వెళ్లి 'అడ్మిషన్ కోసం ఎవరో వచ్చారు సార్, అమ్మాయి వాళ్ళ నాన్న చనిపోయాడంట' అన్నది. 'అడ్మిషన్స్ అయిపోయాయి కదా! ఇప్పుడు కుదరదని చెప్పు' అంటూ తన పనుల్లో బిజీ అయిపోయాడు ప్రిన్సిపాల్ సందీప్. ప్రిన్సిపాల్ రూమ్‌లో నుంచి బయటకు వచ్చిన ఆయమ్మతో 'ఏమన్నారు సార్' అంటూ ఎంతో ఆత్రంగా అడిగింది మమత. 'అడ్మిషన్లు లేవన్నారు' అంటూ దీనంగా చెప్పింది ఆయమ్మ.

'ఒకసారి నేను సార్‌ని కలవొచ్చా' అడిగింది. 'సార్ ఇప్పుడు పనిమీద బయటికి వెళ్తున్నారు, రేపు రండి' అని చెప్పి ఆయమ్మ తన పనిలో నిమగ్నమయ్యింది. ఇక చేసేది లేక మమత దిగులుగా భార్గవిని తీసుకొని ఇంటికి వెళ్లింది. మమతా కంపెనీలో చేరిన కొద్దిరోజులకే అందరిలో మంచి పేరు తెచ్చుకుంది. కొందరు మంచి స్నేహితులు కూడా అయ్యారు. వాళ్లతో భార్గవి స్కూల్ గురించి కూడా చెప్పింది. లక్ష్మి అనే ఓ స్నేహితురాలు 'మీ ఏరియాలో ఓ స్కూల్ ఉంది. ఆయన చాలా మంచి మనిషి. ఏదో ఫౌండేషన్ పెట్టి పేదలకు సహాయం చేస్తుంటాడు, అక్కడకు వెళితే నీ కూతురికి కచ్చితంగా సీటు ఇస్తారు, సాయం చేస్తారు' అంది. 'నిన్ననే వెళ్లొచ్చా. అడ్మిషన్లు అయిపోయాయన్నారు. ఏం చేయాలో అర్థం కావట్లేదు' అంటూ బాధపడింది. 'నువ్వు మళ్లీ ఓ సారి వెళ్లి సార్‌ని కలిసి నీ పరిస్థితి చెప్పు, కచ్చితంగా సీటు ఇస్తారు' అని లక్ష్మి ఎంతో నమ్మకంగా చెప్పింది. దాంతో మరుసటి రోజు ఉదయాన్నే ఎనిమిది గంటలకే భార్గవిని తీసుకొని మళ్లీ స్కూల్‌కి వెళ్లింది మమత.

వాళ్లను చూసిన ఆయమ్మ వెంటనే 'సార్ నిన్న వచ్చారు కదా అడ్మిషన్ కోసం వాళ్ళు మళ్ళీ వచ్చారు' అని సందీప్‌కు చెప్పింది. 'అడ్మిషన్స్ లేవని చెప్పాను కదా, మళ్లీ ఎందుకు వచ్చారు.. సరే లోపలికి పంపించు నేను మాట్లాడతాను' అన్నాడు. మమత లోపలికి రావడంతోనే రెండు చేతులు జోడించి 'సార్ నా కూతురు భార్గవిని స్కూల్లో చేర్చుకొని పుణ్యం కట్టుకోండి సార్, నాకు చదివించే స్థోమత లేదు' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. దాంతో కరిగిపోయిన సందీప్ 'మీరెక్కడ ఉంటారు' అని అడిగాడు. 'మాది కర్ణాటక బోర్డర్ అనంతపురం దగ్గర్లో ఉంటాం సార్. నా


ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

భర్త ఎయిడ్స్‌తో చనిపోతే బతకడం కోసం హైదరాబాద్ వచ్చాం. ఇక్కడే ఈసీ నగర్‌లోనే మా తమ్ముడి దగ్గరకు వచ్చాం సార్' అన్నది.

'ఇప్పుడు పాప ఏ క్లాస్' అని అడిగాడు. 'ఆరో క్లాస్‌కి వెళ్లాలి సార్' అన్నది. 'అడ్మిషన్స్ క్లోజ్ చేశాము, ఇప్పుడు తీసుకోవడం కష్టం' అన్నాడు సందీప్. 'మీరే ఎలాగైనా సాయం చేయాలి సార్, గవర్నమెంట్ స్కూల్‌కి పంపాలంటే చాలా దూరంలో ఉంది. ఆడపిల్లను అంత దూరం పంపించే ధైర్యం లేదు. వేరే ప్రయివేటు స్కూల్లో చేర్చే ఆర్థిక స్థోమత కూడా లేదు. మీరు మాలాంటి వాళ్ల పిల్లలకు ఉచితంగా చదువు చెబుతారని విని మీ దగ్గరకు వచ్చా. ఇప్పుడు మీరు కాదంటే నా కూతురు చదువు ఆగిపోతుంది' అంటూ కాళ్లు పట్టుకోబోయింది. మమత పరిస్థితి విన్న తర్వాత ప్రదీప్ మనసు కరిగిపోయింది. దాంతో భార్గవికి ఎలాగైనా అడ్మిషన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు.

'రోజూ మా స్కూలుకి వస్తావా' అడిగాడు భార్గవిని. 'వస్తాను సార్' అని ఎంతో ఉత్సాహంగా చెప్పింది. చూడటానికి నల్లగా, ముద్దుగా ఉంది భార్గవి. చాలా యాక్టివ్ కూడా. అలా ఆరో తరగతిలో చేరిన భార్గవి. చూస్తుండగానే మూడేండ్లు గడిచిపోయాయి. ప్రతి ఏడాది తనే క్లాస్ ఫస్ట్. భార్గవి 9వ తరగతి చదువుతుండగా స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సందీప్ తన స్కూల్లో ఓ సదస్సు నిర్వహించారు. అమ్మాయిలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న అమ్మాయిలు, అబ్బాయిలు దేనికి ఎక్కువగా అలవాటు పడుతున్నారు అనే విషయాలు పైన ప్రముఖ సైకాలజిస్టు అమ్మాజీని స్పీకర్‌గా పిలిచారు. ప్రసంగం ముగిశాక ఏమైనా సందేహాలు ఉంటే అడగమన్నారు. వెంటనే 'నాకు ఒక డౌట్ మేడం' అంది భార్గవి.

ఏంటని అడగితే 'మేడమ్ నేను ఫోన్ లేకుండా ఉండలేకపోతున్నాను. ఫోన్ చూడకపోతే ఆ రోజు ఏదో వెలితిగా ఉంటుంది. ఫోన్ చూడడం, మాట్లాడడం




తగ్గించాలంటే ఏం చేయాలి' అని అడిగింది. 'నీకు ఫోన్ ఎందుకు చూడాలనిపిస్తుంది. అంటే బోర్ కొట్టినప్పుడా లేదా ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఒంటరిగా ఉన్నప్పుడా?' అని అడిగింది ఆమె. అన్నింటికీ భార్గవి అవునని మౌనంగా తలూపింది. 'అయితే నువ్వు రోజుకి 30 నిమిషాలు లేదా 60 నిమిషాలు మాత్రమే ఫోన్ వాడాలని ఒక టైం పెట్టుకో. అట్లాగే నీ ఫోన్‌కి నోటిఫికేషన్స్ రాకుండా టర్న్ ఆఫ్ చేసుకో. భోజనం చేస్తున్నప్పుడు, పడుకునే గంట ముందు, నిద్ర లేచిన తర్వాత 30 నిమిషాల వరకు ఫోను వాడకూడదని ఒక రూల్ పెట్టుకో. బోర్ కొడితే కాసేపు వాకింగ్ చేయడం, పుస్తకాలు చదవడం, మీ కుటుంబ సభ్యులతో మాట్లాడడం.. ఇలా ఏదో ఒకటి చెయ్యి' అని పదిరకాల



చిట్కాలు చెప్పింది ఆమె. 'వీటిని పాటిస్తూ, నీకు నిజంగా ఫోన్ వాడకం తగ్గించాలనే కోరిక బలంగా ఉంటే కచ్చితంగా మానేస్తావు' అని చెప్పింది. అన్నింటికీ తలూపిన భార్గవి 'సరే మేడం మీరు చెప్పినవన్నీ కచ్చితంగా చేస్తాను' అని అన్నది. అలా పదవ తరగతి పూర్తి చేసుకుని 95% మార్కులు సాధించింది.

మమత ఓ రోజు స్కూల్‌కి వచ్చి 'సార్ మీ దయవల్ల నా కూతురు పదో తరగతి పూర్తి చేసింది. ఆ తర్వాత ఏం చదివితే బాగుంటుందో మీరే చెప్పండి సార్' అన్నది. భార్గవిని అడిగితే 'సిఇసి గ్రూప్ తీసుకుంటాను సార్' అన్నది. దానికి 'గుడ్, మంచి నిర్ణయం తీసుకున్నావు. ఓ ఐదేండ్లు కష్టపడితే నీ జీవితం మారిపోతుంది' అన్నాడు సందీప్. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది చదువుతున్నప్పుడు కరోనా రావడంతో ఆన్లైన్ క్లాసులు మొదలయ్యాయి. కరోనా బారిన పడి మామయ్య చనిపోయాడు. దాంతో మమతకు ఉన్న ఆ ఒక్క తోడు కూడా లేకుండా పోయింది. భార్గవి ఎంతో కష్టపడి చదివి ఇంటర్ మొదటి ఏడాదిలో 96% మార్కులు తెచ్చుకుని కాలేజీలో టాపర్‌గా నిలిచింది. మమత ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సందీప్ సార్‌కు మనసులోనే ఎన్నో సార్లు కృతజ్ఞతలు చెప్పుకుంది. మార్కుల గురించి తెలుసుకొన్న సార్ భార్గవిని ఒకరోజు స్కూల్‌కి పిలిపించి ఇలాగే బాగా చదివితే అన్ని విధాలుగా సపోర్ట్ చేస్తానని భరోసా ఇచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారమే భార్గవి రెండో ఏడాది కూడా మంచి మార్కులు తెచ్చుకుంది. సందీప్ సారే డిగ్రీలో చేర్పించాడు. హైదరాబాద్ నగరంలోనే టాప్ కాలేజీలో సీటు ఇప్పించాడు.

'చూడు భార్గవి ఈ మూడేండ్లు నువ్వు కష్టపడి చదవాలి. మీ అమ్మ నీపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. నాకూ నీపై నమ్మకం ఉంది. అందుకే నీ చదువుకు కావల్సిన ఫీజులన్నీ నేనే చూసుకుంటున్నాను. వేరే ఆలోచనలేమీ లేకుండా మూడేండ్లు పూర్తి చెయ్యి. మంచి ఉద్యోగం సంపాదించు' అని చెప్పాడు. అందరి నమ్మకాన్ని నిలబెట్టిన భార్గవి మూడేండ్లు బాగా చదివి 90% మార్కులు తెచ్చుకుంది. మంచి కంపెనీలో ఉద్యోగం కూడా వచ్చింది. నెలకు 47 వేలు జీతం. ఇంత మంచి ఉద్యోగం రావడంతో మమత, భార్గవిని తీసుకొని సందీప్ దగ్గరకు వచ్చింది.

'సార్ ఈరోజు భార్గవి ఈ స్థాయిలో ఉందంటే దానికి కారణం మీరే. ఆ రోజు మీరు పాపకు సీటు ఇవ్వకపోతే మా బతుకులు ఎలా ఉండేవో. పదో తరగతి అయిపోయిన తర్వాత కూడా తన చదువంతా మీరే చూసుకున్నారు. నిజంగా మీ రుణం నేను తీర్చుకోలేను' అంది. వెంటనే భార్గవి 'సార్ నేను ఒక పని మాత్రం చేయగలను. మీరు ఎలాగైతే మీ ఫౌండేషన్ తరపున నాకు చదువులో సాయం చేశారో, అలాగే నేను కూడా పేద పిల్లలకు సాయం చేస్తాను. చదువుకు నా వంతు చేయూతగా నెలకి వెయ్యి రూపాయలు ఇస్తాను. అది మీ చేతికి ఇస్తే చేరాల్సిన వారికి కచ్చితంగా చేరుతుందని నా కోరిక' అంది.

దానికి సందీప్ 'మంచి ఆలోచన భార్గవి. నీలాంటి యువత ఇలా ఆలోచిస్తే మన దేశంలో నిరక్షరాస్యత అనేదే ఉండదు. అందరూ చదువుకోగలుగుతారు. నువ్వే కాదు వీలైతే నీ స్నేహితుల ద్వారా కూడా సాయం చేయించు. చదువులో ఎలాగైతే రాణించావో అలాగే ఉద్యోగంలో కూడా రాణించాలి. ఉన్నత స్థాయికి చేరుకోవాలి. ఇది మీ అమ్మ కల' అని చెప్పి పంపించాడు.

◆◆

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథ



'నాన్నా! శంకరం ఇదే నా ఇల్లు. ఇక్కడ నాకు ఏ లోటూ లేదు. నువ్వు చెప్పిన సుఖ, సంతోషాలు నాకు ఇక్కడ పుష్కలంగా దొరుకుతున్నాయి. బాధ్యత బరువైనచోట బంధం బలహీనపడుతుంది. బాధ్యతను భుజాన మోస్తే బంధం బలంగా వుంటుంది. ఇక్కడ మాకు ఎవరికీ రక్త సంబంధాలు లేకపోయినా, మానవ సంబంధాలు మాత్రం బలంగా ఉన్నాయి. అవి లేనిచోట జీవచ్ఛవంలా బతకాల్సిందే. నువ్వు ఆ రోజు దేవాలయానికని తీసుకొచ్చి నన్ను ఇక్కడ వదిలిపెట్టి మంచిపని చేశావు. నిజంగా ఇది నాకు దేవాలయమే. అనుబంధాలకు, ఆప్యాయతలకు నిలయమైన వృద్ధాలయం. ఈర్ష్య, అసూయ, స్వార్థం లేని మమతల నిలయం' అంది సీతమ్మ.

'అది కాదమ్మా! ఈ వయసులో నీ ఆరోగ్యం గురించైనా ఆలోచించాలి కదా' అన్నాడు శంకర్రావు.

'నాన్నా, శంకరం! సంతోషం సగం బలం. మాది మలిపొద్దు వెలుగు. ఈ వయసులో మాకు ఆకలి కన్నా ఆత్మగౌరవం ముఖ్యం. ఇక్కడ ఉన్న వాళ్లందరూ చాలా ఆరోగ్యంగా ఉంటారు. ఒకవేళ ఎవరికైనా అనారోగ్యం వచ్చినా, ఆశ్రమంలో మంచి డాక్టరుగారు ఉన్నారు. నా గురించి నువ్వు బాధపడనక్కర్లేదు' అంది సీతమ్మ.

ఎంత చెప్పినా సీతమ్మ వినకపోయేసరికి, వచ్చిన వాళ్లు వచ్చినట్టు వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు.

'వెళ్లొస్తాను అత్తయ్య గారు' అన్న కోడలు గిరిజను దగ్గరకు తీసుకొని

'చూడమ్మా! గిరిజ పిల్లల్ని జాగ్రత్తగా పెంచండి. వారికి బాధ్యతలు నేర్పండి. మానవత్వపు విలువుల గురించి చెప్పండి. రేపు మీకు నాలాంటి పరిస్థితి రాకుండా చూసుకోండి' అంటూ సుతిమెత్తగా హెచ్చరిస్తూ, సలహా ఇచ్చింది సీతమ్మ.

పిల్లలను దగ్గరగా తీసుకొని వాళ్లకు ముద్దులు పెట్టి, బాగా చదువుకోండని దీవించింది.

'అమ్మా! నువ్వు జాగ్రత్త. మరి నేను వెళ్లివస్తాను' అంటూ వెళ్లిపోతున్న కొడుకు శంకరంతో...

'ఎలా వదిలేశావు నాన్నా?' అంటూ సీతమ్మ బరువెక్కిన హృదయంతో కంటతడి పెట్టుకొంది.



# మలిపొద్దు వెలుగు

డా. బొడ్డూరు విజయేశ్వరరావు
9490544551

ఆకాశం నల్లని రంగు పులుముకుంది. లోకం చీకటి మత్తులో మునిగిపోయింది. వణుకు పుట్టించే చల్లని గాలి తాకిడికి కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి శంకర్రావు మనసులా.

సాయంత్రం స్వప్న అడిగిన ప్రశ్న తనని ఇంకా నిద్ర పట్టనివ్వకుండా చేస్తుంది. తండ్రినని కూడా చూడకుండా ముఖం మీద కొట్టినట్లు అలా అడిగిందేమిటి? అయినా తాను ఎందుకు సమాధానం చెప్పలేకపోయాడు? ఇలా ప్రశ్నలతో మనసు అతలాకుతలమవుతోంది.

× × ×

కూతుర్ని ఎంతో అల్లారు ముద్దుగా పెంచాడు శంకర్రావు. స్వప్న చాలా తెలివైన అమ్మాయి. ధైర్యవంతురాలు. తప్పు ఎవరు చేసినా నిలదీసే స్వభావం ఆమెది.

సోషల్ వర్క్ చదువుతున్న స్వప్న, కాలేజీ ఫ్రెండ్స్‌తో కలిసి ఫీల్డ్ ట్రిప్పుకని వెళ్లింది. ఫీల్డ్ ట్రిప్ ముగించుకొని సాయంత్రానికి ఇంటికి వచ్చింది. ఇంట్లోకి వెళ్లగానే తల్లి గిరిజ ఎదురొచ్చింది.

'ఫీల్డ్ ట్రిప్ బాగా అయిందా! బాగా ఎంజాయ్ చేశావా!' అంది తల్లి.

'హా' అంది స్వప్న.

'ఏమే అలా ఉన్నావు. ఏమైంది?' అన్న తల్లి మాటలకు...

'ఏమీ లేదమ్మా! నన్ను విసిగించకు' అంటూ తన గదిలోకి వెళ్లిపోయింది స్వప్న.

ఇంతలో శంకర్రావు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాడు. వచ్చీ రాగానే...

'పాప వచ్చిందా?' అని భార్యని అడిగాడు.

'వచ్చింది మీ ముద్దుల కూతురు. కానీ...' అంది గిరిజ.

'కానీ ఏమిటి? ఏమైంది?' అన్నాడు శంకర్రావు.

'ఎందుకో డల్‌గా ఉంది. ఏమైందో తెలియదు. అడిగితే చెప్పడం లేదు. మీరైనా వెళ్లి కనుక్కోండి' అంటూ భర్తకు గ్లాస్‌తో నీళ్లు ఇచ్చింది గిరిజ.

శంకరరావు కూతురు గదిలోకి వెళ్లి...

'చిట్టితల్లీ! ఫీల్డ్ ట్రిప్ బాగా అయిందా? ఎక్కడికి వెళ్లారమ్మా?' అని అడిగాడు.

స్వప్న మాట్లాడలేదు.

'ఏమైందిరా? ఎందుకిలా ఉన్నావు?' అన్నాడు శంకర్రావు.

'మేము ఎక్కడికి వెళ్లామో తెలుసా నాన్న'...

తెలియదన్నాడు శంకర్రావు.

'బాపూజీ ఓల్డేజ్ హోమ్' కు అంది స్వప్న.

ఆ పేరు వినగానే శంకర్రావు నోటమాట రాలేదు. ఒక్కసారిగా బిక్క చచ్చిపోయాడు.

'సరే బాగా అలసిపోయినట్టున్నావు. రెస్ట్ తీసుకో' అంటూ వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్న తండ్రితో...

'నటించకు నాన్న! నువ్వు ఎందుకు అలా సైలెంట్‌గా వెళ్లిపోతున్నావో నాకు తెలుసు. చెప్పమంటావా?' అంది స్వప్న.

'నానమ్మని కలిశావా' అన్నాడు శంకరరావు.

'ఎందుకు వదిలేశావు నాన్న?' అంటూ నిలదీసింది స్వప్న.

'అంటే... అదీ...నీకు చెప్పినా అర్థం కాదమ్మా' అన్నాడు శంకర్రావు.

'ఐ హేట్ యు డాడీ. ప్లీజ్ వెళ్లిపోండి' అంటూ తండ్రిని బయటికి పంపించి తలుపు వేసుకొంది స్వప్న.

రాత్రి పన్నెండుగంటలు అయింది. శంకర్రావుకి నిద్రరావడం లేదు. కూతురు అడిగినప్రశ్న తనని వేధిస్తూ, వెంటాడుతోంది. అయినా తాను ఎందుకలా చేయాల్సి వచ్చింది? రెక్కలు ముక్కలు చేసుకొని తన్నింతవాణ్ణి చేసిన తల్లిని ఎందుకిలా నిర్దాక్షిణ్యంగా వదిలేశాడు? ఇలా ఆలోచనలతో గతంలోకి వెళ్లాడు.

× × ×

సీతమ్మకి ఒక్కగానొక్క కొడుకు శంకర్రావు. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో, అన్నీ తానై, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయక, కష్టపడి పనిచేసి, కష్టం తెలియకుండా కొడుకుని పెంచి, మంచి ప్రయోజకుణ్ణి చేసింది. కొడుకుకి పెళ్లి చేసి ఒక ఇంటివాణ్ని చేసి, తాను మురిసిపోయింది.

ఉద్యోగరీత్యా కొడుకు, కోడలు పట్నంలో ఉండగా తాను మాత్రం ఉన్న కొద్దిపాటి పొలాన్ని, ఇంటిని పదిలంగా కాపాడుకుంటూ ఆ పల్లెటూరులోనే ఉండిపోయింది. ఆరోగ్యం బాగాలేదని కబురు చేస్తే, తల్లిని చూడటానికని సొంత ఊరికి వెళ్లాడు శంకర్రావు. ఇంటికి వచ్చి తల్లిని చూశాక...

'ఈ వయసులో నువ్వు ఒక్కదానివి ఉండడం ఎందుకమ్మా? నాతో పట్నం వస్తే మంచి డాక్టరుకి చూపించి, మందులు వాడితే ఆరోగ్యం కుదుటపడుతుంది' అన్నాడు శంకర్రావు.

'ఊరు పొమ్మంటుంది కాడి రమ్మంటోంది. నాకెందుకు నాయనా పట్నం డాక్టరు. ఇక్కడే ఉండి ఏదో అలా కాలం గడిపేస్తాను' అంది సీతమ్మ.

'అది కాదమ్మా! ఈ పల్లెటూరులో ఇల్లు, పొలం ఉండి ఏం చేస్తాయి. పైగా వాటికి నువ్వు కాపలా. అవి అమ్మేసి పట్నంలో నీ పేరు మీద ఒక మంచి స్థలం కొనుక్కుంటే భవిష్యత్తులో మంచిరేటు వచ్చి, మనకు ఉపయోగపడుతుంది. ఆలోచించు' అన్నాడు.

ఇంతలో భార్య దగ్గర నుంచి ఫోన్ రాగానే మాట్లాడి, తర్వాత తల్లికి ఫోనిచ్చాడు శంకర్రావు.

అత్తయ్య క్షేమ సమాచారాలు తెలుసుకున్న తర్వాత...

'అయినా మీ చాదస్తం గానీ, మీరక్కడ, మేమిక్కడ ఎందుకండీ? మీరు పెద్దదిక్కుగా మాతోపాటు ఉంటే మాకు కొండంత ధైర్యం ఉంటుంది. మీ అబ్బాయి మాతో ఉన్నా, మనసంతా మీతోనే ఉంటుంది' అంటూ ఫోన్లో కోడలు తన ప్రేమను ఒలకబోసింది.

'అలాగేనమ్మా! ఆలోచిస్తాను' అంది సీతమ్మ.

కోడలు మాటలు సీతమ్మకు చాలా ఆనందాన్ని కలిగించాయి. కొడుకు శంకరం పదేపదే బతిమిలాడడంతో సీతమ్మ కాదనలేకపోయింది. ఉన్న కొద్దిపాటి పొలాన్ని, ఇంటిని అమ్మేసి మిగిలిన వ్యవహారాలన్నీ పూర్తి చేసి తల్లిని తీసుకొని పట్నం వచ్చేశాడు శంకర్రావు.

ఒకపక్క ఇంటి పనుల్లో కోడలికి సహాయం చేస్తూ, మరొక పక్క పిల్లలతో కాలక్షేపం చేస్తూ కాలం వెళ్లదీస్తుంది సీతమ్మ. తల్లి ఇచ్చిన డబ్బుతో భార్య పేరుమీద పట్నంలో ఇంటి స్థలం కొన్నాడు శంకర్రావు తల్లికి తెలియకుండా.

కొన్ని సంవత్సరాలు గడిచాక అత్తాకోడళ్ల మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయి. అయినదానికీ, కానిదానికీ అత్తను నిందించడం అలవాటైపోయింది గిరిజకు. ఒకరోజు స్వప్న తమ్ముడు ఆడుకుంటూ పరిగెడుతూ పడిపోయాడు. ఆ సమయంలో సీతమ్మ అక్కడే ఉంది. 'పిల్లల్ని అయినా జాగ్రత్తగా చూసుకోకపోతే మనుషులు ఇంట్లో ఉండి ఏం లాభం?' అంటూ అత్తను నిందిస్తూ మాట్లాడింది.

మరొక రోజు రాత్రి సీతమ్మకి ఆరోగ్యం బాగాలేక వాంతి అయింది. అది హాలంతా వెదజల్లడంతో అసహ్యించుకుంటూ, అసహనంతో ఇల్లు శుభ్రం చేస్తూ 'ఇప్పుడే ఇల్లంతా కడిగాను. మళ్లీ కడగాల్సి వస్తుంది. ఈ దరిద్రాన్ని ఇంకెన్నాళ్లు మోయాలో తెలియడం లేదంటూ' రుసరుసలాడింది.

ఉన్నట్టుండి ఒకరోజు 'చూడండి! ఇద్దరు పిల్లలతోనూ, ఇంటిపనులతోనూ నాకు సరిపోతుంది. ఇంకా మీ అమ్మకు కూడా సేవ చేయాలంటే నావల్ల కాదు. ఇంట్లో మీ అమ్మగారు ఉండాలో, నేను ఉండాలో తేల్చుకోండి' అంటూ భర్తతో తెగేసి చెప్పేసింది గిరిజ.

(మిగతా 5వ పేజీలో)



SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
19 ఆదివారం, జూలై 2026


# మలిపొద్దు వెలుగు

(కథ-4వ పేజీ తరువాయి)

శంకర్రావు అటు భార్యని కాదనలేక, ఇటు తల్లిని వదులుకోలేక చాలా సతమతమవుతున్నాడు. ఆఫీసుకు వెళ్లినా, ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా ఈ సమస్య పట్టిపీడిస్తోంది. ఏం చేయాలో తోచడం లేదు శంకర్రావుకి. ఒకరోజు గుడికి తీసుకెళ్తానని చెప్పి, తల్లిని తీసుకొని బయలుదేరాడు శంకర్రావు. ఫోన్ రాగానే పట్టణ శివారులో ఉన్న ఒక భవనం ముందు బండి ఆపి, అక్కడే వుండమని చెప్పి, ఇప్పుడే వస్తానంటూ వెళ్లిపోయాడు. అలా వదిలేసిన తల్లి రూపం మళ్లీ ఇన్నాళ్లకు ఈరోజు తన కళ్ల ముందు కదలాడింది.

× × ×

తెల్లవారగానే సీతమ్మ విషయంలో ఇంట్లో పంచాయతీ మొదలైంది. అనేక వాదోపవాదనలు జరిగిన పిమ్మట, సీతమ్మను ఆశ్రమం నుంచి ఇంటికి తీసుకురావడానికి అందరూ అంగీకరించారు.

కూతురు స్వప్న 'థాంక్యూ డాడీ' అంటూ తండ్రిని కావలించుకుంది.

అనుకున్నదే తడువుగా, శంకర్రావు భార్యా పిల్లల్ని తీసుకొని బాపూజీ ఆశ్రమానికి వెళ్లాడు.

పచ్చని పూలచెట్ల మధ్య ఆశ్రమం చాలా ఆహ్లాదకరంగా, హరితవనంలా ఉంది. లోపలికి వెళ్లి చూడగానే సీతమ్మ పూల మొక్కలకు నీళ్లు పోస్తుంది. మిగిలిన వృద్ధులు కూడా ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉన్నారు.

కొడుకుని చూడగానే సీతమ్మ 'నాన్న శంకరం బాగున్నావా!' అంటూ తనే ముందు పలకరించింది. 'బాగున్నానమ్మా నువ్వెలా ఉన్నావు?' అన్నాడు శంకర్రావు.

శంకర్రావు కళ్లల్లో పశ్చాత్తాపం తొణికిసలాడుతుంది. కోడలు, మనమల్ని కూడా సీతమ్మ పలకరించింది. తర్వాత ఆశ్రమం అంతా వాళ్లకు చూపించి, వాళ్లతో కాసేపు ముచ్చటించింది.

కొద్దిసేపటి తర్వాత 'అమ్మా! మనింటికి వెళ్లి పోదాం' అన్నాడు శంకరరావు తల్లితో.

'అవునండి అత్తయ్యగారు! రండి మనింటికి వెళ్దాం' అంది గిరిజ.

'నానమ్మ మాతో ఉండవా' అంటూ ముద్దుగా అడిగాడు మనవడు. సీతమ్మ చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

'అమ్మా! మనింట్లో నువ్వు సుఖంగా, సంతోషంగా ఉండవచ్చు' అన్న కొడుకు శంకర్రావుతో...

'నాన్నా! శంకరం ఇదే నా ఇల్లు. ఇక్కడ నాకు ఏ లోటూ లేదు. నువ్వు చెప్పిన సుఖ, సంతోషాలు నాకు ఇక్కడ పుష్కలంగా దొరుకుతున్నాయి. బాధ్యత బరువైనచోట బంధం బలహీనపడుతుంది. బాధ్యతను భుజాన మోస్తే బంధం బలంగా వుంటుంది. ఇక్కడ మాకు ఎవరికీ రక్త సంబంధాలు లేకపోయినా, మానవ సంబంధాలు మాత్రం బలంగా ఉన్నాయి. అవి లేనిచోట జీవచ్ఛవంలా బతకాల్సిందే. నువ్వు ఆ రోజు దేవాలయానికని తీసుకొచ్చి నన్ను ఇక్కడ వదిలిపెట్టి మంచిపని చేశావు. నిజంగా ఇది నాకు దేవాలయమే. అనుబంధాలకు, ఆప్యాయతలకు నిలయమైన వృద్ధాలయం. ఈర్ష్య, అసూయ, స్వార్థం లేని మమతల నిలయం' అంది సీతమ్మ.

'అది కాదమ్మా! ఈ వయసులో నీ ఆరోగ్యం గురించైనా ఆలోచించాలి కదా' అన్నాడు శంకర్రావు.

'నాన్నా శంకరం! సంతోషం సగంబలం. మాది మలిపొద్దు వెలుగు. ఈ వయసులో మాకు ఆకలికన్నా ఆత్మగౌరవం



ముఖ్యం. ఇక్కడ ఉన్న వాళ్లందరూ చాలా ఆరోగ్యంగా ఉంటారు. ఒకవేళ ఎవరికైనా అనారోగ్యం వచ్చినా, ఆశ్రమంలో మంచి డాక్టరు గారు ఉన్నారు. నా గురించి నువ్వు బాధపడ నక్కర్లేదు' అంది సీతమ్మ.

ఎంతచెప్పినా సీతమ్మ వినకపోయేసరికి, వచ్చిన వాళ్లు వచ్చినట్టు వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు.

'వెళ్లొస్తాను అత్తయ్య గారు' అన్న కోడలు గిరిజను దగ్గరకు తీసుకొని

'చూడమ్మా! గిరిజ పిల్లల్ని జాగ్రత్తగా పెంచండి. వారికి బాధ్యతలు నేర్పండి. మానవత్వపు విలువుల గురించి చెప్పండి. రేపు మీకు నాలాంటి పరిస్థితి రాకుండా చూసుకోండి' అంటూ సుతిమెత్తగా హెచ్చరిస్తూ, సలహా ఇచ్చింది సీతమ్మ.

పిల్లలను దగ్గరగా తీసుకొని వాళ్లకు ముద్దులు పెట్టి, బాగా చదువుకోండని దీవించింది.

'అమ్మా! నువ్వుజాగ్రత్త. మరి నేను వెళ్లి వస్తాను' అంటూ వెళ్లిపోతున్న కొడుకు శంకరంతో...

'ఎలా వదిలేశావు నాన్నా?' అంటూ సీతమ్మ బరువెక్కిన హృదయంతో కంటతడి పెట్టుకొంది.

శంకర్రావు వెంటనే వెనుతిరిగి, తల్లి పాదాలపై పడి బోరున ఏడ్చేశాడు. క్షమించమని వేడుకున్నాడు.

కొడుకుని పైకి లేపి 'తప్పు నాన్నా. మన మధ్య క్షమాపణలుఎందుకు? నువ్వు ఎక్కడున్నా, సుఖంగా జీవించాలని నా కోరిక. నీ సంతోషం కోసం నా ప్రాణంఇవ్వడానికికూడా నేను వెను కాడను. నువ్వు నా పేగు బంధానివి' అంటూ సీతమ్మ కార్చిన కన్నీటి చుక్కలు శంకర్రావు గుండెను తాకాయి.

ఎక్కడి నుంచో దూరంగా 'మాతృదేవోభవ' అన్న స్వరం శ్రావ్యంగా వినిపిస్తోంది.

# యుద్ధం.. ఇంట్లోనే మొదలైంది...!



ఇప్పుడు యుద్ధం బయట కాదు
ఇంట్లోనే నిశ్శబ్దంగా మొదలైంది
కారణంలేని రణాగ్నులు
దేశాలను దహిస్తుండగా
అందరి గృహాలలోను
భూతల స్వర్గం దూరమైంది..!

కలవారి కలలు కూలుతూ
కలవరం పెడుతున్నా
అత్తెసరు బతుకులలోన
అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయి
ఆకలి పోరాటానికి
సన్నద్ధ మవుతున్నాడు
సామాన్య మానవుడు...!

నిత్యం యుద్ధ మేఘాలు
ఆకాశంలో తిరుగుతుంటే
భయాందోళనల డ్రోనులు
ఇంటిని చుట్టి ముట్టడిస్తున్నా
కడగండ్ల కన్నీళ్ల నేత్రాలకు
మబ్బులలోని సూర్యచంద్రులు
మసకగా కనిపించసాగారు...!


నిత్యావసర వస్తువుల ధరలు
నిత్యం నింగినంటుతున్నాయి
ఇంధనాలు చాలక జీవన వాహనాలు
పొలిమేరలోనే ఆగిపోయాయి
బడుగుల బతుకుల చితుకులు
కన్నీటి ధారతో తడిసి నిప్పుల
కుంపటి అంటుకోవటంలేదు..!

మన పాలకుల పలుకులు
పూత రేకులులా ఉంటాయి
అవి నోటికి అందక ఊరిస్తాయి
ఆచరణలో ఆమడ దూరాన వుంటాయి..!

గుదిబండగా మారుతున్న
గ్యాస్ సిలిండరును స్వేచ్ఛగా
వినియోగదారులకందించాలి
నిలకడలేని ధరల పట్టీలను
అధికారులు కట్టడిచేయాలి
యుద్ధం ప్రభావం ప్రజలపై పడకుండా
అధికారుల అప్రమత్తత కావాలి...!


జి. సూర్యనారాయణ, 6281725659

## స్వీకారం




నాన్న చెక్కిన శిల్పం
జాలాది రత్నసుధీర్
పేజీలు:126, వెల: రూ.150/-
ప్రతులకు: జాలాది రత్నసుధీర్
8-3-229/16/డబ్ల్యు, 501,
సాయికృష్ణ టవర్స్
హైలెం కాలనీ, రోడ్‌నం.10బి
జూబ్లీహిల్స్, హైదరాబాద్-500045
సెల్: 98494 18009, అమెజాన్ మరియు
ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో

తపస్వి (నవల)
లంక నాగశశికళ
పేజీలు:88, వెల: రూ.150/-
ప్రతులకు:
లంక నాగ శశికళ
W/o. లంక జల దుర్గాప్రసాద్
అజ్జమూరు, ఆకివీడు మండలం
పశ్చిమగోదావరిజిల్లా,
ఆంధ్రప్రదేశ్-534235
ఫోన్: 95538 09850



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథ

# పరిణీత

గన్నవరపు నరసింహమూర్తి

కారు హైవే మీద దూసుకుపోతోంది. నేను పది గంటలకు అరకు చేరుకోవాలి. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం అక్కడ దేశంలోని యువ పారిశ్రామికవేత్తలతో నిర్వహించే పారిశ్రామిక సదస్సుకి నేను నా కంపెనీ తరపున హాజరు కాబోతున్నాను.

నేను నా తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకుని. నాలుగేళ్ల క్రితం నేను ఇంజినీరింగు చదువుకోసం అమెరికా వెళ్లి అక్కడ స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగులో డిగ్రీ సాధించి ఆ తరువాత ఎంబియ్యే కూడా పూర్తి చేసి సంవత్సరం క్రితం ఇండియాకి వచ్చాను.

అప్పుడు నాకు మంచి కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. నాన్న గారు అందులో చేరమని చెప్పారు కానీ నాకు ఉద్యోగం చెయ్యటం ఇష్టం లేదు. నాకు చిన్నప్పటి నుంచి స్వంత పరిశ్రమను పెట్టాలని ఉండేది. అదే విషయాన్ని నాన్నగారితో చెబితే అందుకు ఆయన ఒప్పుకున్నారు.

కాకపోతే పరిశ్రమను పెట్టేముందు దేశం గురించి, సమాజంలోని ప్రజల సాదక బాధలు, పేద వారి సమస్యలు తెలుసుకుంటే మంచిదనీ, అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాలు పర్యటించమని చెప్పారు.

నేను అప్పుడు మా పక్కనే ఉన్న బొబ్బిలి పట్నంలో ఒక గార్మెంట్స్ పరిశ్రమకు శ్రీకారం చుట్టాను. దానికి ఈ మధ్యనే ప్రభుత్వ అనుమతులు లభించడంతో నిర్మాణాలు మొదలుపెట్టాను. అవి పూర్తి కావడానికి ఆరు నెలలు పడుతుంది. ఆ తరువాత ఉత్పత్తి ప్రారంభమవుతుంది. అందులో పిల్లలకు, యువతీ యువకులకు కావలసిన జీన్ పేంట్లు, చొక్కాలు, వివిధ రకాల డ్రెస్సులు అన్నీ తయారవుతాయి.

వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నుంచి పారిశ్రామిక సదస్సుకి హాజరుకమ్మని మా కంపెనీకి ఆహ్వానం అందడంతో ఈ రోజు ఆ సదస్సుకి హాజరు కావడానికి ఉదయాన్నే మా ఊరి నుంచి కారులో బయలుదేరాను. ఆ సదస్సుకి వెళితే నాకు రాష్ట్రంలోని చాల మంది కొత్త యువ పారిశ్రామికవేత్తలతో పరిచయం ఏర్పడి వ్యాపార వ్యవహారాల్లో అవగాహన కలుగుతుందని నా నమ్మకం.

రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సుకి ఏ విశాఖపట్నంలోనో కాకుండా కాకుండా కొండల్లో వుండే ఏజెన్సీ ప్రాంతమైన అరకుని ఎందుకు ఎన్నుకున్నారో నాకు అర్థం కాలేదు. కాకపోతే అరకు ప్రముఖ పర్యాటక పర్యాటక ప్రదేశం కావడం వాళ్ళ అక్కడ పెట్టివుంటారని నాకు అనిపించింది.

తొమ్మిది గంటల ప్రాంతంలో నా కారు ఘాట్ రోడ్డులోకి ప్రవేశించింది. కొద్ది దూరం వెళ్లిన తరువాత డ్రైవర్ కారుని రోడ్డు పక్కనే వున్న పెద్ద చెట్టు కింద ఆపాడు. అతను ఎందుకు కారుని అక్కడ ఆపాడో అర్థం కాక అతని వైపు ఆశ్చర్యంగా చూడసాగాను.

అతను వెంటనే కారు దిగి బోనెట్ ఎత్తి కొద్దిసేపు పరీక్షించి ఆ తరువాత దాన్ని దించి నా దగ్గరకు వచ్చాడు.

"సార్, ఇంజిన్‌కి పెట్రోల్ తీసికెళ్ళే పైప్ పగిలిపోయింది. అందుకే ఇంజిన్‌కి పెట్రోల్ అందటం లేదు. ఆ పైప్ మార్చాలి" అన్నాడు.

"మార్చడానికి ఎంతసేపు పడుతుంది?" అనీ అతన్ని అడిగాను.

"అది నా వల్ల అవదు; ఎస్ కోట షెడ్డుకి తీసికెళ్ళాలి. సమయం పడుతుంది" అని చెప్పాడు.

"నేను పదకొండు గంటలకు అరకులో మీటింగుకి హాజరవ్వాలి. ఇప్పుడెలా?" అంటూ కారు దిగాను.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది.

"సార్, అరకు వెళ్లే పల్లె వెలుగు బస్సు వస్తోంది. త్వరగా వెళ్లాలంటే అందులో వెళ్లిపోవడమే మంచిది. నేను కారు బాగు చేయించుకొని అక్కడికి వస్తాను" అని చెప్పాడు డ్రైవర్.

అతని మాటలు నాకు ఆశ్చర్యం కలిగించాయి.

"పల్లె వెలుగు బస్సులోనా? అందులో వెళ్లడం చాలా కష్టం. అంతా పల్లెటూరి వాళ్ళే అందులో ఉంటారు. వాళ్ళతో ప్రయాణించడం నా వల్ల కాదు" అన్నాను విసుగ్గా అతనితో.

"సార్, సమయం తొమ్మిది కావస్తోంది. ఇంకా ఆలస్యం చేస్తే ఆ మీటింగుకి అందలేరు. నా మాట విని ఆ వస్తున్న బస్సులో వెళ్లిపోండి" అని అతను నాకు చెబుతున్న సమయంలోనే బస్సు హారన్ కొట్టుకుంటూ వస్తూ కనిపించింది.

ఇంక నాకు ఆలోచించడానికి సమయం లేదు. అందుకే వెంటనే నా బ్యాగ్ తీసుకొని "నువ్వు కారు బాగు చేయించుకొని అరకు వచ్చేయ్" అని చెప్పి పరుగున వెళ్లి ఆ బస్సు ఎక్కేసాను. నేను ఆ బస్సు ఎక్కగానే అది వెంటనే మళ్ళీ హారన్ కొట్టుకుంటూ బయలుదేరింది. బస్సంతా జనాలతో కిక్కిరిసిపోయి వుంది. ఎక్కడా కూర్చుండానికి కాదు కదా.. కనీసం నిలబడటానికి కూడా జాగా లేదు.

మెల్లగా ప్రయాణీకులను

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

తప్పించుకుంటూ లోపలి వెళ్ళసాగాను.

ఇంతలో నా పక్కనే నిలబడ్డ వ్యక్తి చుట్ట కాలుస్తూ పొగ వదిలేడు. చూడటానికి అతను సన్నగా ముడతలు పడ్డ ముఖంతో గిరిజనుడిలా కనిపిస్తున్నాడు. ఆ పొగను పీల్చడం వల్ల నాకు ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అయ్యాను. దగ్గు ముంచుకొచ్చింది. అదే సమయంలో మరో వ్యక్తి నా పక్కనే వున్న కిటికీలోంచి కాలుస్తున్న చుట్టను తీసి గట్టిగా ఉమ్మేడు. అది బస్సు వేగానికి నా ముఖం మీద పడింది. ఆ వాసనకు ఒక్కసారిగా నాకు వాంతి వచినట్లనిపించింది. నేను ఆ గిరిజనుణ్ణి గట్టిగా అరుస్తూ– "నీకు బుద్ధి ఉందా? పక్కవాళ్ళను చూడొద్దా?" అని కోప్పడ్డాను. కొద్దిసేపటికి బస్సు ఏదో అడ్డరోడ్డు దగ్గర ఆగింది. అక్కడ చాలా మంది గిరిజనులు దిగిపోయారు.

వాళ్లలో చాలా మంది తాగేసి ఉండడం వల్ల ఊగుతూ తూలుతూ కనిపించారు. వాళ్ళను చూడగానే నా కడుపు దేవుతున్నట్లు అనిపించింది. ఆ సమయంలో ఈ బస్సు ఎందుకు ఎక్కానా? అనిపించింది. ఇంతలో వెనక సీట్లో కూర్చున్న ఒక అమ్మాయి "ఇక్కడ సీటు ఖాళీ" అని తన పక్కనే ఖాళీగా ఉన్న సీటుని చూపించడంతో నేను వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళాను.

ఆమె తెల్లగా, అందమైన ముఖంతో, సౌందర్యం ఉట్టిపడుతూ కనిపించింది. ఈ కొండల్లో, పల్లె వెలుగు బస్సులో ఇంత అందమైన అమ్మాయి ఎక్కిందేమిటా? అనీ ఆలోచిస్తూ ఆమె పక్కన కూర్చున్నాను.

ఆ తరువాత బస్సు కదిలింది.

ఆమె ఆకుపచ్చటి పంజాబీ డ్రెస్సులో అందంగా మెరిసిపోతోంది. నేను ఆమెకు తగలకుండా కూర్చున్నాను.

"బస్సులో ప్రయాణం కొత్తా?" అని ఆమె నవ్వుతూ అడిగింది.

ఆమె మాటలు కోకిల కాలకూజితంలా వినిపించాయి.

"అవును.. ఎప్పుడో చిన్నప్పుడు ఎక్కాను. ఆ తరువాత మళ్ళీ ఇప్పుడే? ప్రయాణం ఘోరంగా ఉంది. చాలా మందికి పక్క ప్రయాణికులతో ఎలా మెలగాలో తెలిసినట్లు లేదు. అదీ కాకుండా చాలా అనాగరికంగా, అపరిశుభ్రంగా వున్నారు. ఈ బస్సుని చూస్తుంటే జీవితంలో మళ్ళీ ఎక్కకూడదనీ అనిపిస్తోంది" అన్నాను ఆమెతో.

నా మాటలకు ఆమె నా వైపు కోపంగా చూస్తూ "వాళ్ళు మన సమాజానికి దూరంగా కొండల్లో, అడవుల్లో స్వచ్ఛంగా పెరిగిన అమాయకులైన గిరిజనులు. వాళ్ళను మనం అర్థం చేసుకోవాలిగానీ కోప్పడటం మంచిది కాదు" అని చెప్పింది.

"సారీ, నా ఉద్దేశం వాళ్లను కించపరచాలని కాదు. మీరు చెప్పింది నిజమే. నేనే తప్పుగా అర్థం చేసుకున్నాను. బై ది బై నా పేరు హర్ష, శ్రీహర్ష, కార్లో అరకు వెళుతుంటే కారు చెడిపోయింది. నేను పన్నెండు గంటలకు అక్కడికి వెళ్ళాలి. పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ మీటింగు ఉంది. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఈ బస్సు ఎక్కాను. మీరు ఎక్కడికి వెళుతున్నారు?" అని ఆమెను అడిగాను.

"నా పేరు పరిణీత. నేను ఒక ఎన్జీవోలో పని చేస్తున్నాను. మా సంస్థ ఈ కొండల్లో గిరిజనుల అభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటుంది" అని చెప్పింది ఆమె.

"సరైన రహదారి సౌకర్యాలు లేని ఈ కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న వీళ్ళ అభివృద్ధి సాధ్యమంటారా? ఈ ప్రాంతాలను చూస్తుంటే మరో వంద సంవత్సరాలైనా వీళ్ళు అభివృద్ధి చెందేటట్లు లేరు" అన్నాను.

"మీ లాంటి చదువుకున్న యువకులంతా పెద్ద చదువులు చదువుకొని అమెరికా వంటి దేశాలకు వెళ్లిపోతుంటే వీళ్ళ అభివృద్ధి ఎలా జరుగుతుంది చెప్పండి? ఈ ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు గానీ, డాక్టర్లు గానీ, నర్సులు గానీ ఎవ్వరూ సరిగ్గా పనిచెయ్యరు. వాళ్లంతా పట్నాల్లో ఉంటూ జీతాల కోసం అప్పుడప్పుడు వస్తూ వెళ్ళిపోతూ వుంటారు. అందుకే ఈ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకుండా వున్నాయి.

"నా పేరు పరిణీత. నేను ఒక ఎన్జీవోలో పని చేస్తున్నాను. మా సంస్థ ఈ కొండల్లో గిరిజనుల అభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటుంది" అని చెప్పింది ఆమె.

మన దేశంలో అభివృద్ధి అన్నది కేవలం ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, కలకత్తా లాంటి మహా నగరాల్లోనే తప్పా పల్లెల కోసం ఆలోచించే వారే లేరు. అందుకే మన దేశంలో నానాటికి పేదరికం పెరిగిపోతోంది.

స్వాతంత్ర్యం వచ్చి ఎనభై ఏళ్ళు అవుతున్నా ఇప్పటికీ దారిద్ర్య రేఖకు దిగువన ఇంకా నలభై శాతం ప్రజలు ఉన్నారు. అక్షరాస్యతా శాతం డెబ్బై శాతం మించటం లేదు. పేదలకు కేటాయించిన నిధులు అవినీతి పరుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి" అనీ ఆవేశంగా చెప్పింది ఆమె.

ఆమె ఆవేశం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇంతలో బస్సు ఒక కొండ పక్కన ఆగింది.

వెంటనే పరిణీత గబా గబా బస్సు దిగింది.

నేను కూడా ఆమె వెనకే దిగాను. అక్కడ పది మంది గిరిజనులు నిలబడి ఉన్నారు. ఆ పక్కనే ఒక మంచం మీద ఒక గర్భిణీ స్త్రీ నొప్పులు పడుతూ గట్టిగా అరుస్తూ కనిపించింది.

పరిణీత వాళ్ళతో "ఏ ఊరు మీది?" అని అడిగింది.

వాళ్లలో చదువుకున్న ఓ వ్యక్తి ముందుకొచ్చి "అమ్మా, మాది ఆ కొండ మీద ఉన్న చిమిడిపల్లి గ్రామం. ఈమె నా భార్య. వారం రోజుల క్రితం దానికి తొమ్మిది నెలలు నిండిపోయాయి. ఈ రోజు ఉదయం నుంచి నొప్పులు మొదలయ్యాయి. మా ఊరికి రహదారి సౌకర్యం లేదు. అందుకే ఆమెను మంచం మీద ఇక్కడకు తీసుకు వచ్చాము. బస్సులో తీసికెళదామంటే ఏ డ్రైవరూ ఆపటం లేదు. అన్నీ కిక్కిరిసి వున్నాయి. ఇప్పుడు ఈమెను పట్నం హాస్పిటల్‌కి తీసికెళ్ళాలి" అని చెప్పాడు. వెంటనే పరిణీత డ్రైవర్ దగ్గరకు వెళ్లి ఏదో మాట్లాడింది. వెంటనే డ్రైవర్, కండక్టర్ కిందకు దిగి ఆమెను బస్సులోకి ఎక్కించారు.

"మనం కొద్దిసేపు ఇక్కడే ఉండాలి. ఇక్కడికి దగ్గరలోని అనంతగిరిలో ప్రభుత్వ ఆసుపత్రి వుంది. ఈ బస్సు ఆమెను హాస్పిటల్లో దించి మళ్ళీ వస్తుంది. అప్పుడు మనం వెళ్ళాలి" అని చెప్పింది. ఆ తరువాత ఆ బస్సు అనంతగిరి వైపు వెళ్ళిపోయింది.

అక్కడ నేను, ఆమె, ఓ ఇరవై మంది ప్రయాణీకులం మిగిలాము. "మేడం, నేను పన్నెండు గంటలకు అరకు మీటింగుకి వెళ్ళాలి. నేను దానికోసమే విశాఖపట్నం నుంచి వస్తున్నాను. అప్పుడే పదకొండు గంటలైపోయింది. ఇప్పుడెలా?" అని ఆమెతో చెప్పాను.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

**"ఉండరమ్మా, ఆయన ఎస్ కోటలో ఉంటారు. వారానికి రెండు రోజులు వస్తారు. అప్పుడే మా పిల్లలకు పాఠశాలలో పాఠాలు చెబుతారు. నేను ఇక్కడ పిల్లలకు వంట ఒండుతుంటాను" అని చెప్పింది ఆమె.**

"ఆమె పరిస్థితి మీరు చూసారు కదా? ఆలస్యం చేస్తే ఆమె ప్రాణానికి ప్రమాదం. మీటింగు ఆలస్యం అయితే మనం ఏదో ఒకటి చెప్పుకోవచ్చు. కానీ ప్రాణం పోతే తిరిగి రాదు. ఆ బస్సు తిరిగి వచ్చేసరికి అరగంట పడుతుంది. ఆ కొండ వాలులో రెండు గ్రామాలు ఉన్నాయి. ఈలోగా వాటిని చూసొద్దాం పదండి" అంది ఆమె అటు వైపు నడుస్తూ.

నేను కాదనలేక ఆమె వెంట బయలుదేరాను. కొండ పక్కన సన్నగా, ఇరుగ్గా ఉన్న దారిలో మేము ఒక కిలోమీటరు నడిచిన తరువాత కొత్తపల్లి తండా వచ్చింది.

అది కొండ వాలులో ఉంది. ఊళ్లోని ఇళ్లన్నీ అక్కడక్కడా విసిరేసినట్లున్నాయి. అక్కడ చెట్టు కింద మంచం మీద పడుకున్న వ్యక్తిని కనుక్కొని ఆ ఆ ఊరి చివరలో ఉన్న పాఠశాలకు వెళ్ళాము. కానీ ఆ రోజు పాఠశాలలో ఎవ్వరూ లేరు. మమ్మల్ని చూసి ఒక నలభై ఏళ్ళ స్త్రీ వచ్చింది.

"ఈ రోజు పాఠశాల శెలవా?" అనీ పరిణీత అడిగింది.

"లేదమ్మా, ఈ రోజు మాస్టారు రాలేదు. అందుకే పిల్లలెవరూ రాలేదు" అని చెప్పింది. "మీ మాస్టారు గారు మీ ఊళ్ళో ఉండరా?" పరిణీత అడిగింది.

"ఉండరమ్మా, ఆయన ఎస్ కోటలో ఉంటారు. వారానికి రెండు రోజులు వస్తారు. అప్పుడే మా పిల్లలకు పాఠశాలలో పాఠాలు చెబుతారు. నేను ఇక్కడ పిల్లలకు వంట ఒండుతుంటాను" అని చెప్పింది ఆమె.

ఆ తరువాత ఆ పక్కనే ఉన్న హాస్పిటల్ దగ్గరకు వెళ్ళాము. అది కూడా మూసి ఉంది. అందులో ఉన్న వాచ్‌మెన్ మా దగ్గరకు వచ్చి "హాస్పిటల్లో ఆరు నెలల నుంచి డాక్టర్ రావటం లేదని, నర్సు నెలకోసారి వచ్చి మందులు ఇస్తూ ఉంటుంది" అనీ చెప్పాడు. ఆ తరువాత మేము తిరిగి రోడ్డు దగ్గరకు బయలుదేరాము.

అప్పుడు పరిణీత చెప్పటం మొదలుపెట్టింది.. "ఇదీ మన గిరిజన ప్రాంతాల ప్రజల పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళైనా ఈ గ్రామాలకు రహదారులు లేవు. వైద్య శాలలు లేవు. పాఠ శాలలు ఉన్నా అధ్యాపకులెవ్వరూ రారు. డాక్టర్లు జీతాలు తీసుకుంటూ పట్నాల్లో ప్రైవేటుగా వైద్యం చేసుకుంటున్నారు. ఇక్కడి గిరిజనులకు తాగునీటి సదుపాయాలు లేవు. కొండల్లో పారె గెడ్డ నీరే వీళ్లకు ఆధారం. వేసవిలో నీళ్లకోసం వీళ్ళు నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సి వుంటుంది. మన దేశంలో తొంభై శాతం ధనం కేవలం రెండు వందల మంది ధనవంతుల దగ్గర పోగుపడి ఉంది. వాళ్ళ ఆదాయం సంవత్సరానికి లక్షల కోట్లు ఉంటుంది. మిగతా పది శాతం డబ్బు తొంభై తొమ్మిది శాతం ప్రజల దగ్గర వుంది. దేశంలో ఏభై శాతం మంది ప్రజలకు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. ఈ గిరిజన గ్రామాల్లోని ప్రజలంతా పేదరికంతో మగ్గిపోతున్నారు. వీళ్ళ పిల్లలకు పోషకాహారం దొరక్క బక్క చిక్కి శల్యమైపోతున్నారు.. ఇప్పుడు చెప్పండి. ఈ దేశంలో పుట్టడం వాళ్ళ దౌర్భాగ్యం కాదంటారా? మీలాంటి చదువుకున్న యువకులకు వీళ్ళను చుస్తే చులకన భావం. దేశం అభివృద్ధి అంటే కేవలం కొందరు చదువుకున్న అతి తెలివైనవాళ్ళు బాగు పడటం కాదు. ప్రతీ పేదవాడు రోజూ పట్టెడన్నం తింటేనే అభివృద్ధి. లేకపోతే అది అభివృద్ధి చెందిన దేశం అవదు" అని చెప్పింది.

కొద్ది నిమిషాల తరువాత మేము రోడ్డు దగ్గరకు చేరుకున్నాము. అప్పుడే మా బస్సు కూడా అక్కడికి చేరుకుంది. కానీ ఆ సమయంలో మా డ్రైవర్ కూడా కారును బాగు చేయించుకుని అక్కడకు రావడంతో నేను ఆమెకు వీడుకోలు చెప్పి నా కారులో అరకు వెళ్ళిపోయాను.

నేను అరకు చేరుకునే సరికి ఒంటి గంట అయింది. అక్కడ సమగ్ర గిరిజనాభ్యుదయ సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ వారి కార్యాలయంలో మా సదస్సు జరగబోతోంది. నేను అక్కడికి చేరుకునేసరికి ఇంకా మీటింగు మొదలు కాలేదు. కలెక్టర్ గారు ఇంకా రాలేదని, వారు వస్తే మీటింగు ప్రారంభం అవుతుందని వాళ్ళు చెప్పడంతో నేను ఊపిరి పీల్చుకున్నాను.

నేను అక్కడికి చేరుకున్న గంట తరువాత మీటింగు హాల్లో కలెక్టర్ గారొచ్చారని హడావుడి మొదలైంది.

ప్రాజెక్టు ఆఫీసర్ గారు హాల్లోకి వచ్చి "మిత్రులారా, కలెక్టర్ గారు వస్తున్నారు.. దయ చేసి అందరూ నిశ్శబ్దంగా వుండండి" అని అతను చెబుతుండగానే ఒక యువతి హాల్లోకి వచ్చింది.

ఆమెను చూడగానే అందరూ లేచి నిలబడి అభివందనం చేసారు. నేను కూడా నిలబడి ఆమె వైపు చూసాను. అంతే..! నా ముఖంలో ఆశ్చర్యం తొంగి చూసింది. ఆమె ఎవరో కాదు.. ఇందాక నాతో బస్సులో ప్రయాణించిన పరిణీత గారు. ఆమె కలెక్టర్ అని తెలియగానే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

నేను ఆశ్చర్యంలోంచి తేరుకునేలోపే ఆమె స్టేజ్ మీదకు వచ్చి మాట్లాడటం మొదలుపెట్టింది. ఆమె తన ఉపన్యాసం ప్రారంభిస్తూ "తాను నిన్ననే పదోన్నతి మీద ఈ జిల్లా కలెక్టర్‌గా ఛార్జ్ తీసుకున్నానని, అంతకు మునుపు రాయలసీమలో జాయింట్ కలెక్టర్‌గా పని చేసానని, ఇక్కడకి తాను వస్తున్నప్పుడు ఒక బస్సులో సాధారణ ప్రయాణీకురాలిగా ప్రయాణించానని, గిరిజన ప్రాంతాలు బాగా వెనకబడి ఉన్నాయని, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు, వైద్యులు ఎవరూ గిరిజనులకు సరైన సేవలు అందించటం లేదనీ, అది ఈ రోజు తాను ఈ సమావేశానికి వస్తూ ప్రత్యక్షంగా చూసాననీ, అలక్ష్యం వహిస్తూ గైర్హాజరు అవుతున్న ఉద్యోగస్తులను, వైద్యులను, ఉపాధ్యాయులను సస్పెండు చేసానని చెప్పుకొచ్చారు.

ఆ తరువాత కొత్తగా పరిశ్రమలను నెలకొల్పే నా లాంటి యువ పారిశ్రామికులను ఉద్దేశించి చాలా మంచి విషయాలు చెబుతూ ప్రభుత్వ పరంగా మాకు ఏ సహాయం కావాలన్నా చేస్తానని భరోసా ఇచ్చారు.

ఈ రోజు ఇక్కడికి వచ్చేవరకు నాకు సమాజం గురించి గాని, పేద వారి గురించి గాని నాకు సరైన అవగాహన లేదు. కానీ ఈ రోజు అదృష్టవశాత్తు నా కారు చెడిపోవడంతో ఒక గొప్ప సేవాతత్పరత, మంచి అభ్యుదయ భావాలు గల ఒక స్త్రీ మూర్తి అయిన కలెక్టర్ పరిణీత గారితో ప్రయాణించడం వల్ల నాకు చాలా విషయాలు తెలిసాయి. సమాజం గురించి, కొండల్లో మగ్గి పోతున్న పేద గిరిజనుల జీవితాల గురించి నాకు అవగాహన కలిగింది. నా పరిశ్రమలో ఇక పేద, బడుగు బలహీనులకు అవకాశాలు ఇచ్చి వాళ్ళ అభివృద్ధికి పాటుపడాలని నిర్ణయించుకున్నాను. ఇక పట్నంలో కాకుండా మా పల్లెలోనే వుంటూ మా ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యాలని నిర్ణయం తీసుకున్నాను. ఇది అంకురం మాత్రమే. ఇది భవిష్యత్తులో పెద్ద వృక్షంగా మారుతుంది. అందుకు కారణమైన కలెక్టర్ పరిణీత గారికి మనస్సులోనే కృతజ్ఞతలు తెలిపాను.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# పెనవేసుకున్న బంధాలు

పేలూరి వెంకట మీనాక్షి
99126 01765

'కళ్ళు ఎంత మూసినా నిదుర పట్టదేం.. ఏమిటో ఆలోచనలు.. అలా పొద్దున్నే చేను కాడకెళ్ళి, శుభ్రంగా శుభ్రం చేసి, అడ పసంత నక్కులెట్టి కట్టిన ఎండి పుల్లల మోపు, పచ్చగడ్డి మోపులు సైకిలుకి కట్టి, ఇంటికి రాంగానే మోపులు అందుకొని, గడ్డిమోపు పశువుల కొట్టం కాడ పడేసి, పొయ్యి కాడ ఎండిమోపు దించి, కాగులో నీళ్లు తోడిచ్చేది. వేడి నీళ్ళు ఒంటి మీద పడగానే చిరాకంతా పోయేది. ఇంతలో సత్తుగిన్నెలో సద్దిబువ్వ, ఓ మాగాయ ముక్కో.. ఓ ఆవకాయ బద్దో వేసి, సేతికిచ్చేది లచ్చిమి. అది నంజుకుంటూ కాస్త కూడు తిని, పెరట్లోని యాపసెట్టు నీడలో అలా నడుం వాలితే చాలు జమ్మంటూ నిదుర పట్టేది. ఈ సిటీకొచ్చాక తర్వాత తిరిగిపోయింది. ఇప్పుడా చేను పోయె, కళ్ళల్లో పెట్టుకుని చూసే తోడుని పోయె. ఊడకొచ్చినాక అదేటోగాని ఈ కట్టె కూడా మొద్దుబోయి సెప్పిన మాట ఇనకుండా మొరాయిస్తంది. నిదురకో బిళ్ళ, కూడరగడానికో బిళ్ళ.. ఇలా ఎన్ని బిళ్ళలు మింగినా లాభమైతే లేదు. ఈ జీవుడు పుట్టి పెరిగాక ఎప్పుడూ నిదురకి మొహమాసింది లేదు. ఇప్పుడేటో కొత్తగా వచ్చింది శరీరానికి ఈ జబ్బు' అనుకుంటూ మంచంపై అటూ ఇటూ తిరుగుతూ నిదురపోటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు సత్తెన్న.

'అయ్యా నీ కోసం మనూరు నుండి పలకరించడానికి చిన్నయ్యోళ్ళొచ్చారు. హాల్లో కూకోబెట్టాను. ఓ పాలి ఇలా' అంటూ తన కొడుకు హనుమంతు పిలిచేసరికి ఆలోచనల్లోంచి బయటకొచ్చాడు సత్తెన్న. గబాల్న హాల్లోకొచ్చి అందర్నీ చూసేసరికి, ఎక్కడ లేని దుఃఖం మునుపులాగా మనసుకి ఆవహించిందేమో అది ఒక్కసారిగా భళ్ళుమంది.

'ఒరేయ్.. పోలయ్యా.. నన్ను చూట్టానికి ఎంత దూరం నుండి వచ్చార్రా.. నేను మీ కోసం ఏంచేసాననిరా.. నా మీద ఇంత అభిమానం.. మనోళ్ళంతా ఎట్టున్నార్రా చిన్నా' అంటూ పోలయ్యని కౌగిలించుకుని భోరున ఏడ్చాడు. సత్తెన్న అలా చిన్నపిల్లాడిలా బాధపడుతుంటే పక్కనే నిలబడి, చూస్తున్న మిగతావాళ్ళ గుండె కూడా కాస్త బరువెక్కిందో ఏమో.. వాళ్ళందరి కళ్ళు కూడా చెమర్చాయి.

'అదేటన్నా అట్టంటావ్.. ఒకే ఊరోళ్ళం. తెల్లారి లెగిత్తే కలిసి తిరిగేటోళ్ళం. ఎవరికైనా కష్టమంటే పరిగెత్తుకు వాలిపోయేవాడివి. అట్టాంటిది నీకు కష్టమొత్తె రాకుండా ఎట్టుంటాం?' అన్నాడు శివయ్య.

'ఊరు ఇడిసిపెట్టి గప్పుడే నాలుగేళ్లు అయిపోయినాది. ఏ పండక్కో, పబ్బానికో మీరంతా వత్తాన్లే అడకి యునికుంటే ఇలా జరిగిపోయినాది. గట్టి గుండ్రాయిలా గుండేది పదిలం ఇలా గుంయిపోనాది. ఎంతో విచిత్రంగా' అన్నాడు నర్సన్న.

ఇంతలో హనుమంతు భార్య వచ్చినోళ్ళందరికీ టిఫిన్లు, టీలు ఇచ్చింది. అవి తినేసి మరలా కబుర్లల్లో పడ్డారు.

'పొద్దుగూకులు పొలంకాడే పడి, ఎంత పని చేసేదో మా తల్లి. ఇద్దరి మనుసులు సేసే పనంతా ఒక్కమ్మే జేసినా గెప్పుడూ ఆ చిర్నవ్వే ముఖాన్న గానొచ్చేది గాని అలుపు సొలుపు గిసుమంతైనా ఉండేది గాదు. ఎవరైనా ఇంటికి వత్తే కడుపునిండా బువ్వ పెట్టి, పంపేదా తల్లి.. వట్టి చేత్తో నెప్పుడూ పంపదే. అలాంటి యమ్మని తీసుకుపోనాకి ఆ దేవుడికి మనసెట్టా ఒప్పిందో..' అంటూ నర్సన్న మాటలకి వత్తాసుపలికాడు పోలయ్య.

'మా యందరికీ పెద్దదిక్కులా ఉండేటోడివి. అన్నీ అమ్ముకొని, ఊడకి వచ్చేసి ఏదో పిల్లాడి దగ్గర సంతోసంగా ఉండారనుకుంటే ఇంతలోనే ఇలా అయిపోయినాది ఏం చేత్తాం' అంటూ మరొకతను బాధపడ్డాడు.

అందరూ ఒకే ఊర్లో చిన్నప్పట్నుంచి కలిసి పెరగటం, కలిసి వ్యవసాయం చేయడం ఒకరి కష్టసుఖాల్లో ఒకరు పాలుపంచుకోవడంతో వాళ్ళ మధ్య ఏదో తెలియని ఆత్మీయ అనుబంధం పెనవేసుకుపోయింది. అందుకే సత్తెన్నకి కష్టం వస్తే రాకుండా ఉండలేకపోయారు వాళ్ళంతా. సత్తెన్నది మారుమూల ఓ కుగ్రామం. రెండెకరాల మాగాణినే నమ్ముకుని జీవించే ఓ సన్నకారురైతు. అతని భార్య కూడా కష్టజీవి. ఇంట్లోని పాడి గేదెను చూసుకోవడంతో పాటు భర్తకి వ్యవసాయ పనుల్లో కూడా సాయమొచ్చేది. వారిద్దరూ కష్టాన్ని నమ్ముకుని బతికేటోళ్ళైనా వాళ్ళ కొడుకు హనుమంతుని మాత్రం బాగా చదివించాలనుకున్నారు. స్తోమత లేకపోయినా అప్పు చేసి, పట్నం పంపించి చదివించారు. హనుమంతుడు బుద్ధిమంతుడు, చదువు పూర్తికాగానే ఓ మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. వెంటనే పెళ్లి, బ్యాంకు లోన్ పెట్టి, ఓ పెద్ద ఇల్లు కొనుక్కోవడం అన్నీ చకచకా జరిగిపోయాయి.

• • •

అన్నీ సవ్యంగా జరిగిపోతున్నాయి. చేసిన అప్పు ఇవ్వాళ్ళో రేపో కొడుకు తీరుస్తాడనుకునే లోపే అగ్గికణంలాంటి ఓ వార్త సత్తెన్న చెవినపడింది. కొడుకు చేస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీ నష్టాల్లో కూరుకుపోయిందని, చాలామందిని ఉద్యోగాల్లోంచి తీసేస్తున్నారని, అందులో తన కొడుకు కూడా ఉన్నాడని. ఒక్కసారి కుదేలైపోయాడు. అంతలోనే తేరుకుని, ఇలాంటి కష్టసమయాల్లో కొడుకు బెంగపడతాడని వెంటనే సిటీకి వచ్చాడు. 'డబ్బు కంటే మనిషి ప్రాణాలు చాలా ఇలువైనవి. ఇయ్యాల గాపోతే రేపు సంపాదిత్తాం. నువ్వు బాగుంటే మా కంతే చాల్రా' అంటూ కొడుక్కి ధైర్యం చెప్పాడు. చదువు కోసం చేసిన అప్పు తీరకపోగా, కొడుకు ఇంటి కోసం చేసిన అప్పు కూడా మీద పడడంతో చేసేదిలేక పొలంతో పాటూ ఇల్లు, గొడ్డు గోదా అన్నీ అమ్మి అప్పులన్నీ తీర్చి కట్టుబట్టలతో కొడుకు దగ్గరకు చేరారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు వాళ్ళనెత్తి మీద మరో బాంబు పడింది. ఉన్నట్టుండి అకస్మాత్తుగా పడిపోయి, కాలు, చేయి లాగేసిన భార్యని చూసి హాస్పిటల్‌కి పరిగెత్తారు. 'అర్జెంటుగా ఆపరేషన్ చెయ్యాలి. లేకపోతే మనిషి దక్కదు. ఓ పది రోజుల్లో డబ్బు ఏర్పాటు చేసుకోండి' అన్నారు డాక్టర్లు. సమయం ఇచ్చి, డబ్బు ఏర్పాటు చేసేలోపే ఆ మహాఇల్లాలు ప్రాణాలు విడిచింది.

• • •

'అన్నా, కిందటేడు వరదలొచ్చి ... పాడుచేసింది

తరువాయి 19లో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

16 వ పేజీ నుంచి

## పెనవేసుకున్న బంధాలు

కదా! ఆ నష్టపరిహారం మన రైతులందరూ అకౌంట్లో డబ్బులు పడినాయి. నీ చేను కొనుక్కున్న రాజన్న ఆ డబ్బు నీకియ్యమని ఇచ్చాడు. ఆ భూతల్లికి ఎంతో సేవ చేసిన నీకే చెందాల అన్నాడు' అంటూ జేబులోంచి డబ్బు తీసి, సత్తెన్న చేతిలో పెట్టాడు పోలయ్య. రాజన్న మంచి మనసుకి సంతోషిస్తూ.. ''నేను తల్లికి ఎట్టా తెలిసినాదో ఈ బిడ్డ కష్టాల్లో ఉన్నాడని, ఆదుకోవాకి వచ్చిందిం'' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

'ఇంకో మాట కూడా చెప్పమన్నాడు. నాలుగేళ్ళ నుంచి ఆ చేను ఓ పంట కూడా ఇయ్యలే. నువ్వొస్తే నీ మాట ఇంటడని నిమ్మ మనూరొచ్చి కమతం చేస్కోమన్నాడు. పంట సగం నీకు తీస్కోని, సగం ఇత్తే చాలంట. ఓ పారి ఆలోచించన్నా.. మనూరికెళ్ళిపోదాం. అరేయ్ హనుమంతు! మన ఊరికిపోదాం రా..రా.. అయ్యని చూడు మనిసెట్టాగున్నాడో. ఆ గాలి.. ఆ ఊరు.. చూడగానే మళ్ళీ మామూలు మనిషి అయిపోతాడ్రా. అడ మేమంతా ఉంటాం. నువ్వు మాలో ఒకడివి. నిన్నెట్టా ఇడిసిపెడతాం. ఉద్యోగం వచ్చేవరకు మాతోనే ఉండువు గానీ' అంటూ సచ్చకెప్పి వాళ్లతో బాటే తీసుకుపోయారు వాళ్ళ కుటుంబాన్ని.

• • •

చేను దగ్గరికి పోగానే సత్తెన్న ప్రాణం లేచొచ్చింది. భోరున ఏడుస్తూ.. గబాల్న పరిగెత్తాడు చేలోకి తల్లి ఒడిన చేరిన బిడ్డలా. క్షణం కూడా ఆలోచించక ఏపుగా పెరిగిన కలుపు మొక్కల్ని పీకేసి, శుభ్రం చేయడం మొదలెట్టాడు. అప్పటివరకూ ఉన్న రోగం ఏమయ్యిందో ఒళ్ళు తెలీకుండా సాయంత్రం వరకూ పని చేసి, చేసి అలిసిపోయి ఆ గట్టు పక్కన చెట్టుకింద గోనె పరిచి ఆదమరిచి నిద్రపోయాడు. పొద్దున్ననగా ఎళ్ళినోడు ఇంకా రాలేదేంటోనని వెతుకుతూ వచ్చిన కొడుక్కి, చిత్రాలు ఇద్దామని వచ్చిన రాజన్నకి ఆ దృశ్యం కంటపడింది. పెనవేసుకున్న బంధాలకి ప్రేమించడం మాత్రమే తెలుసు. తల్లిఒడిని చేరిన బిడ్డలా సత్తెన్న, బిడ్డ తిరిగొచ్చాడన్న సంతోషంలో పచ్చ చేలు ప్రశాంతంగా ఉండటం కనిపించాయి.

## ఇక చాలు...!

మా నిశ్శబ్దాన్ని మీరు
సమ్మతమనే ముద్ర వేస్తారు...
మా సహనాన్ని
భయమని రాసేస్తారు...
మా వినయాన్ని
బానిసత్వంగా చెప్తుతారు...

కానీ...
మా గుండెల్లో మండుతున్న చరిత్రను
మీరెప్పుడూ వినలేరు.
శంభుకుని రక్తం
ఇంకా ఈ నేలలో తడిగానే ఉంది.
ఏకలవ్యుడి బొటనవేలు
ఇంకా న్యాయాన్ని వెతుకుతూనే
ఉంది.

మనుస్మృతి కాలిపోయింది అంటారు...
దాని బూడిదను మాత్రం
తరతరాలకు పూస్తూనే వుంటారు.

మా నీళ్ళు అపవిత్రం,
మా నీడ అనిష్టం...
మా చెమటతో పండిన అన్నం మాత్రం
పవిత్ర ప్రసాదం.
మా భుజాల మీదే
మీ నాగరికత ప్రయాణం...

ఇక చాలూ...
మా చేతులు
కేవలం మీ శ్రమ కోసమే కాదు—
చరిత్రను తిరగరాయడానికి.
మా గొంతులు
కేవలం విలాపం కొరకే కాదు—
మీ అన్యాయాన్ని నిలదీయడానికి.

మా అక్షరాలు
కేవలం పుస్తకాల్లో అచ్చేసుకునే
కాలక్షేప కవితలు కాదు—
అవి సంకెళ్లను కోసే చురకత్తులు.

మా ప్రశ్నలు
కేవలం నినాదాలు కాదు—
శతాబ్దాల నిశ్శబ్దాన్ని
పగులగొట్టే మన పిడుగులు.

మా గమ్యం...
కరుణ కాదు.
దానం కాదు.
సామరస్యతనే ముసుగు కాదు.

మాకు కావాల్సింది
మా హక్కులు.... ఆత్మగౌరవం,
మాకు కావాల్సింది...
మనిషిగా జీవించే సమానత్వం.

ఇక మా పిల్లలు
తలవంచి పుట్టరు.
మా కవిత్వం
వేదనతో మొదలైనా,
దాని చివరి పాదం మాత్రం—
ప్రతిఘటనే.

మా చివరి శ్వాస వరకు
అణచివేతను ప్రశ్నిస్తాం,
అవమానాన్ని తిరస్కరిస్తాం,
సమానత్వం కోసం పోరాడతాం.

ఇప్పటివరకూ ఒక లెక్క...
ఇకపై మరో లెక్క...
మా చరిత్రను మీరు రాశారు.
మా భవిష్యత్తును మాత్రం
మేమే రాస్తాం.

- రాజాబాబు కంచర్ల
9490099231

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఈ వారం కథ

# విషెస్ ఆఫ్ పుల్లారావు అను అబ్సెషన్ 2 (కథ)

పుల్లారావు కోరికలు ఎన్ని ఉన్నప్పటికీ అందులో మొదటిది,తీరనిది,బలమైనది ఒకటి ఉంది.అదే ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టడం.మూడు దశాబ్దాలుగా ఈ తీరని కోరిక దినదినాభివృద్ధి చెందుతుండగానే ఆ యువనేత కాస్తా సీనియర్ నేత అయిపోయాడు.మేధావితనానికి చిహ్నంగా బట్టతల వచ్చి చేరినా పట్టుమని పది ఓట్లు రాలడం లేదు.పార్టీలో జూనియర్ నేతలంతా ముఖ్యనేతలయ్యారు.మహారాజు లాంటి అధినేత వెనక్కి తగ్గుతూ, యువరాజు లాంటి చిన్నరాజా కు ఒడుపులు నేర్పుతున్నాడు.ఆ భావి నేత కు అనుగుణంగా పుల్లారావు కూడా అడుగులు మార్చి మ్యాచింగ్ చేస్తున్నా ఫలితం కనబడడం లేదు.తాతకు దగ్గులు నేర్పుతున్న చందాన ఒకప్పుడు పిల్లగాళ్లంటూ తీసిపారేసిన బచ్చాలు నేడు తనకే రాజకీయ పాఠాలు చెప్తున్నా వినాల్సివస్తోంది. రోజూ లేచిన వెంటనే రెడీ అయ్యి, గోడకు తగిలించిన చిరునవ్వు తీసి అతికించుకుని మరీ బయటకు వస్తాడు.ఇంట్లో చేరగానే దాన్ని తీసి అవతల పారేసి , బయట నుండి తెచ్చిన మానసిక చెత్తంతా ఇంట్లో వెదజల్లుతాడు.వెరసి సహజంగానే ఇంట్లో వాళ్లు కూడా పుల్లారావు కి మద్దతు రారు.వెనక నిలబడరు. జై కొట్టరు.వాస్తవం ఇలా ఉన్నా రానున్న 2029 ఎన్నికల్లో ఒంటిచేత్తో గెలిచేది ఖాయం అని పుల్లారావు కి భలే నమ్మకం కుదిరింది. కారణం లేకుండానే కాదు..దాని వెనక పెద్ద కథే ఉంది. అది చెప్తే కానీ మీకర్థం కాదు కదా! చెప్తా..చెప్తా.

2026 జూన్ లో ఒక రోజు:

"ఏమండీ! ఏదైనా సినిమాకు వెళ్దాం.హాల్లో చూసి ఇరవై ఏళ్ళయ్యింది " మిసెస్ ఆఫ్ పుల్లారావు ఆదేశంలాగా రిక్వెస్ట్ చేసింది.

" అలాగేనోయ్.కానీ వెళ్నామంటే అందరూ మనం పనీపాటా లేకుండా ఖాళీగా ఉన్నామని అనుకుంటారు.పరువు పోతుంది"

" ఇప్పుడు మాత్రం ఆ రెండూ ఎక్కడ ఏడ్చాయి.పనీ లేదు.. పరువూ లేదు కదా!

" భలే దానివే,బయటకు వచ్చి చూడు. నేనెంత వీ ఐ పీ నో తెలుస్తుంది.పార్టీలో నెక్ట్స్ టికెట్ నాదే.. గెలుపూ నాదే."

" ప్రతీ ఎలక్షన్ కి ఇదే చెప్తుంటారు.టికెట్ వస్తే డిపాజిట్లు రావు.ఓట్లు వస్తాయనుకున్నప్పుడు టికెట్ రాదు."

సరే..నీతో వాదన ఎందుకు గానీ ఇంగ్లీషు సినిమా అయితే చూద్దాం.ఎక్కువ జనాలుండరు.ఉన్నా పక్కకి తిరిగి చూడరు."

" చూసినా మిమ్మల్ని గుర్తు పట్టరు లెండి. సీనియర్ నేత కదా తమరు." సెటైర్ వేసిందావిడ.యథావిధిగా ముఖం గంభీరంగా పెట్టి సినిమాకు బయల్దేరారు ఇద్దరూ.

'అబ్సెషన్ 'సినిమా ఆడుతుంది. పుల్లారావు కి భలే నచ్చింది.ముఖ్యంగా సినిమా



లో నచ్చిన అంశం ఏమిటంటే ఒక బొమ్మ ఉంటుంది.దాన్ని విరిచి ఒక విష్ చెప్తే అది ఠంచనుగా నెరవేరుతుంది.హీరో తనని హీరోయిన్ ప్రేమించాలని కోరుకోగానే అదే జరుగుతుంది.ఆ ప్రేమ తను చచ్చినా చావనంతగా.

సినిమా నుండి బయటకు వచ్చి పుల్లారావు ఆ బొమ్మ ఎక్కడైనా దొరికే అవకాశం ఉందేమో ప్రయత్నాలు సాగించాడు.ప్రయత్నిస్తే దొరక్క తప్పదు అని గుడ్డిగా నమ్ముతూ చాట్ జీపీ ని, గూగుల్ నీ ప్రశ్నలతో హింసించాడు.అవి చెప్పలేం మొర్రో అని చేతులెత్తేశాక కాలినడకన బయల్దేరాడు.ఇదంతా మూడో కంటికి,ఇంకా చెప్పాలంటే భార్య కు కూడా తెలియకుండా జాగ్రత్త పడ్డాడు.

తిరుగుతూ ఉండగా ఒక బొమ్మల దుకాణం లో అలాంటిదే కనబడింది.హమ్మయ్యా అనుకుని ' ఇది ఆ విష్ ఆఫ్ విల్లో యే కదా! ఎంతేమిటి? ' అని షాప్ వాడిని అడిగాడు.

" అదే నండి.కానీ పనిచేస్తుందో లేదో గ్యారంటీ ఇవ్వలేం.చైనా వాడి సరకు.కావాలంటే ట్రై చేసుకోండి."

" ఏడ్చినట్టుంది.గ్యారంటీ లేకపోతే విష్ , తుస్ ఎందుకు? ఒరిజినల్ ఎక్కడ దొరుకుతుందో తెలిస్తే చెప్పు.నీకు అడిగినంత ఇస్తాను."

" అయితే రండి..ఆ వీధి చివరి షాపు లో ఉంటుంది. తీసుకెళ్తాను.నాకు కొంత అమౌంట్ ఇవ్వాలి."

" సర్లేనయ్యా.పద పద.బొమ్మలైపోతే కష్టం.స్టాక్ వచ్చేవరకూ చూడాలి."

ఇద్దరూ ఆ షాప్ కి వెళ్ళారు.అమ్మినవాడు బీదరికానికి కేర్ ఆఫ్ అడ్రస్ లా ఉన్నాడు.బొమ్మ కొనే ముందు అడిగాడు ' అవునూ,ఇన్ని బొమ్మలమ్ముతావు కదా.ఒకటి నువ్వే వాడుకుని విష్ తీర్చుకోవచ్చు కదా.డబ్బు అడగొచ్చు కదా.' వాడు ఎగాదిగా చూసి ' నాకు అలా అడుక్కోవడం నచ్చదు సార్.ఎంత దొరికితే అంత..' అంటూ బొమ్మ చేతిలో పెట్టి, ప్రొసీజర్ చెప్పాడు.

పుల్లారావు బొమ్మని విరిచి,ఈ జనమంతా నన్నే అభిమానించి ఓటు వేయాలి అని గట్టిగా విష్ చెప్పాడు.ఇక అక్కడ నుండి చూడాలి మార్పు.

2029 కి ముందు ఏడాదిలో ఒక రోజు:

అన్ని పత్రికల్లో అభిప్రాయ సేకరణలు ప్రచురించారు. పీ కే సర్వే, ఏ కే సర్వే, సీ కే సర్వే ..సవాలక్ష సర్వేలు .. అన్నింట్లో రాష్ట్రంలో నియోజకవర్గ వారీగా జనాదరణ లో టాప్ పుల్లారావు.

నూటికి 80 శాతం ఓటు పుల్లారావు కే.ఆ 20 శాతం మంది కూడా సర్వేలకు అందుబాటులో లేక.

ఎక్కడ చూసినా ఒకటే మాట. పుల్లారావు తోపు.ఆయన బూతులు మాట్లాడినా,పోలింగ్ బూత్ లో మాహీరో ఆయనే.

పిల్లికి బిచ్చం వెయ్యకపోయినా, బిచ్చగాడి ఓటు కూడా ఆయనకే.

అడిగినా,అడగక పోయినా,చివరకు కసురుకున్నా,పొమ్మన్నా ఆయనకి ఓటు వేయకుండా ఆగం.

ఇదే తీరు.ఈ జనాదరణ వెనక కారణం ఎవరికీ అంతుబట్టడం లేదు. పుల్లారావు కి తప్ప. మిసెస్ పుల్లారావు కి కూడా అయోమయం.ఈ మనిషి కి ఇంత ఫాలోయింగ్ ఎలా సాధ్యమని.

2029 లో ఒక రోజు :

విజయం ఖాయమన్న ధీమాతో పుల్లారావు ప్రచారం చెయ్యడమే తప్పించి వార్తలు కూడా ఫాలో అవ్వడం వదిలేశాడు.టైమ్ వేస్ట్ అని.కళ్లు మూసుకుని నామినేషన్ వేసి ఫలితాల కోసం పడిగాపులు గాశాడు.

దర్జాగా పడక కుర్చీలో కళ్లు మూసుకున్న పుల్లారావు కి చెవిలో పిడుగు లాంటి వార్త.' అయ్యా,తమరికి మీ ఇంటి ఓట్లు మినహా ఒక్కటి ఎక్కువ పడలేదు.' అసెంబ్లీ లో ఉన్నట్టు కల గంటున్న ఆయన ఉలిక్కి పడి లేచాడు."అదెలా?.నియోజక వర్గ ప్రజలంతా నాకే ఓటేస్తామన్నారు కదా. మారే ఛాన్స్ లేదే."

" అది నిజమేనయ్యా.ఇప్పటికీ అదే అంటున్నారు.కాకపోతే వాళ్లంతా పునర్విభజనలో పక్క నియోజక వర్గంలోకి వెళ్లిపోయారు.తమరి పేరు బ్యాలెట్ లో లేదని కుమిలి పోయి నోటా కి ఓటేశారు.

" మరి నేను పోటీ చేసిన దగ్గర సంగతి?"

" మీకన్నా ఇండిపెండెంట్ నయమనుకున్నారు."

' హతవిధీ! వీళ్ళంతా స్వేచ్ఛగా ఆలోచించినట్టున్నారు.ఇలా అయితే ఎలా ' గొణుక్కుంటూ ఇంకోసారి ఆ షాప్ ని వెదుక్కుంటూ బయల్దేరాడు పుల్లారావు.ఈ సారి అక్కడ ఆ షాప్ ఉన్నట్టు లేదు.

లి. లిలి. సమాప్తం లి". లిలి

( ఈ మధ్య హాలీవుడ్ సెన్సేషన్,సూపర్ హిట్ థ్రిల్లర్ సినిమా అబ్సెషన్ చూశాక రాసింది)


**డా.డి.వి.జి. శంకరరావు మాజీ ఎంపీ విజయనగరం 9440836931.**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# పసుపు-కుంకాలు

సింగిల్ పేజీ కథ

మా తాత తన చెమటతో చుట్టి పోగేసిన ఆస్తినంతా మా నాయన చేతిలో పెట్టి ఒట్టి చేతులతో పోయాడు. నాన్నకు వాళ్ళ నాయనే ఆదర్శం. కడవరకూ అలానే నిలబడి, ఎకరాల ఎకరాల పొలాన్ని అలానే నిలిపాడు నా కోసం. చెల్లికి పెళ్ళప్పుడు ఇచ్చిన నాలుగు ఎకరాల పసుపు-కుంకాల పొలం తప్ప, మిగతా అంతా నా ఆధీనంలోకి వారసత్వంగా వచ్చేసాయి. మనసొప్పక కలిసిరాని కాలమని నిందించుకుంటుంటాను గానీ, నాది ఆదాయానికి మించిన బతుకు పద్ధతని ఇప్పటికీ ఒప్పుకోను. ఏడాదికో ఎకరా చెప్పున్నా అమ్మేస్తున్నా, ఏ యేడుకా యేడు అప్పుల చిట్టా పెరిగిపోతునే ఉండేది. కౌలు కింద వచ్చిన డబ్బులు, వడ్డీల జమకు సరిపోనంతగా పేరుకుపోయింది అప్పు. కాలం గిర్రున తిరిగి, చివరికి ఇప్పుడు చెల్లికి పసుపు-కుంకాల కింద ఇచ్చిన నాలుగు ఎకరాలు తప్ప ఏమీ మిగల లేదు. నేను అప్పుడు ఒకొక్కటీ తక్కువలో అమ్మేసిన పొలాలు, ఇప్పుడు ఊళ్లో కోట్లలో పలుకుతున్నాయి. ఆస్తి పోగుట్టుకున్నానన్న బాధ కన్నా, అప్పులు ఎలా తీర్చాలన్న భయమే ఎక్కువ ఉంది ఇప్పుడు.



చాన్నాళ్ళ నుండి, చెల్లి పొలం కింద వచ్చిన కౌలు కూడా నేనే వాడుకుంటున్నాను. అన్న కష్టాల్లో ఉన్నాడనుకుందేమో..! ఏ రోజూ నన్ను ఒత్తిడి చెయ్యలేదు. తనకేం తెలుసు, వెనక్కి తిరిగి చూస్తే, నేనన్నీ కోరి తెచ్చుకున్న కష్టాలే అని. ఇప్పుడు నాకు కాలూ చేతులు ఆడడం లేదు. బయటకు అడుగెయ్యాలంటే అప్పు తీర్చాల్సిన పరిస్థితి. ఎటు చూసినా నాకు చెల్లి నాలుగు ఎకరాలే కనిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని ఒకసారి మా ఆవిడతో కదిపి చూసాను. పుస్తెలైనా అమ్మేస్తాను, పస్తులైనా ఉంటాను గానీ, మీ చెల్లి పసుపు-కుంకాల జోలికి పోతే మీ చెల్లి ఊరుకున్నా నేను ఊరుకోనని పెద్ద గొడవే చేసేసింది.

నాన్న నాలుగు ఎకరాలు ఎలా ఇస్తాడు? చెల్లికి పసుపు కుంకాల కింద, అందులో రెండు ఎకరాలైనా నాకే ఉండి ఉంటే, ఇప్పుడీ పరిస్థతి ఉండేది కాదు కదా! అనే నెగిటివ్ ఆలోచనలు మెదడులో ఉత్పన్నమయ్యేవి. తప్పుగా ఆలోచిస్తున్నానని మనసుకు సర్దిచెప్పుకునే వాడిని. ఒకానొక దశలో నా కొడుకు ఇంకా బడి చదువులే చదువుతున్నా, చెల్లి కూతురుతో పెళ్ళి ఫిక్స్ చేస్తే, ఆ నాలుగు ఎకరాలు తన కూతురు పసుపు కుంకాల కింద చెల్లిని రిటర్న్ అడిగితే సమస్య పరిష్కారమైపోతుందనే భావన కూడా మనసులో కలిగింది. అయినా ఈ పరిస్థితుల్లో వాడేమవుతాడో, ఎలాంటి వాడవుతాడో తెలియకుండా, చెల్లి అయినా ఎలా ఒప్పుకుంటుంది. అన్న మీద ప్రేమ ఉన్నా, కూతురు మీద మించి ఉండదుగా ఏ చెల్లికి అయినా అని అక్కడితో ఆ అలోచనకూ చుక్క పెట్టేసాను. అప్పట్లో డబ్బు ఉంది కదా అనే కట్న కానుకలు మంచి అమ్మాయి, అందంగా ఉంది కదా అని మా ఆవిడను చేసుకున్నాను. డబ్బు ఉన్నదాన్ని చేసుకొని ఉంటే, అవైనా ఈ సమయంలో ఆదుకొనేవనే అడ్డమైన తప్పుడు ఆలోచనలు మెదడును తట్టేవి. తప్పు అంతా నా చేతిలో పెట్టుకొని, పరిస్థితులు బాగా లేనప్పుడు, జరిగిపోయిన వాటిమీద, చుట్టూ ఉన్న మనుషుల మీద నెట్టేయడం మానవ సహజమే! దాని నుంచి తేరుకొని విచక్షణతో బయటకు రావడమే గొప్ప విషయం.. అని నాలో నేనే అనుకొని అలాంటి అలోచల నుండి వెనక్కి తగ్గేవాడిని.

ఏంచెయ్యాలో దిక్కు తోచని పరిస్థితి. ఇల్లు అమ్మి రోడ్డున పడ్డా, అప్పుల్లో , ఏ మూలకి రాని స్థితి. ఒక్కో రోజు వేకువ అయిపోతుంది నిదుర రాని రాత్రి. పగలు ఎన్ని కలలు కన్నా, ఏదీ పరిష్కారం కానిదే అనిపిస్తుంది. వేరే మార్గం లేక చివరికి చెల్లి ఊరు వైపే అడుగులు పడ్డాయి. కష్టాల్లో ఉన్న అన్నకి బాధపడుతూ ఆహ్వానం పలకాలో, ఇలాగైనా ఎప్పుడూ రాని అన్న మా ఇంటికి వచ్చాడని సంతోష పడాలో చెల్లికి పాలుపోదేమో అని మనుషులోనే ఆలోచనలు పూర్తి అయ్యేలోపే చెల్లి ఇంటి గడపకు చేరిపోయాను. ముందే వస్తున్నానని చెప్పా కదా, బావ గారు కూడా ఆఫీసుకు సెలవు పెట్టి నా కోసం ఎదురు చూస్తూ ఇంట్లోనే ఉన్నాడు.

అంత అర్థం చేసుకొనే చెల్లికి, పెద్దగా అర్థమయ్యేలా చెప్పాల్సిన పరిస్థతి రాదు అని నాకు తెలుసు.. కానీ ఎలా మొదలు పెట్టాలో తెలియలేదు. వాళ్ళ ఎదురుగా సోఫాలో కూర్చున్నా, తలపైకి ఎత్తి సీలింగ్ వైపే అటూ ఇటూ చూస్తూ గాల్లోనే మాట్లాడుతున్నాను. బహుశా కళ్ళల్లో కళ్లు పెట్టి మాట్లాడేంత ధైర్యం సరిపోవడం లేదేమో! చెల్లి, బావ చేతులు పట్టుకొని, ఒక అన్న సహాయం అడగడం చిన్న విషయమేమీ కాదు కదా అనుకునే లోపల "బావా!" అని చిన్నగా బావ గారి నోటి నుండి పిలుపు వినిపించింది. "ఒక చిన్న సహాయం చేస్తావా?" అన్నారు. "ఈ పరిస్థతుల్లో నేను వీరికి సహాయం చేయడం ఏంటని?" ఆశ్చర్యంతో చెల్లి వైపు చూసాను.

చెల్లి రెండు కళ్ళు తన కనురెప్పలతో మూసి, తల కిందకి పైకి చిన్నగా ఊపింది. అంతా మంచే జరుగుతుందని తెలిపేలా చిన్న సంజ్ఞ చేసింది. ఈలోగా బావ, "మీ చెల్లికి పసుపు-కుంకాలుగా మీరిచ్చిన నాలుగు ఎకరాలు మీ ఊర్లో మంచి రేటు వచ్చిందని చాలా మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనడానికి ముందుకు వస్తున్నారు. పొలంగా కొని, ప్లాట్లుగా అమ్మితే కనీసం ఐదింతలు లాభమైనా వస్తుందని వారికి తెలుసు. కనుక "మీరు మాకు ఒక పని చేసి పెట్టగలరా?" అన్నారు. నేను తేరుకునే లోపే, "ఆ పొలాన్ని ప్లాట్లుగా చేసి మనమే అమ్మితే అసలు ధర పోగా, వచ్చే ఆ లాభాన్ని, చెరో సగం పంచుకుందాం. శ్రమ అనుకోకుండా ఈ సాయం చేయగలరా?" అని అడుగుతుండగా, నీకు సహాయం చేస్తున్నాను.. అని చెబితే ఎక్కడ నేను చిన్న బుచ్చుకుంటాననో, బావ తిరిగి తనకి సహాయంలా భావించమని అంటున్నాడని అర్థమైంది. బావ సంస్కారానికి అక్కడే చేతులు ఎత్తి నమస్కరించాలనిపించింది. ఆడపిల్లకి మనం ఇచ్చి పంపించేది పసుపు-కుంకాలు కాదు, ఆడపిల్లే ప్రతి ఇంటికి ఒక 'పసుపు కుంకుమని' అని అనిపించింది. చిన్నది అయినా, చెల్లికి మనసులోనే నమస్కరించుకుంటూ, తప్పులు సరిదిద్దుకొని, ఇకనైనా ఉన్నంతలో కుటుంబం సక్రమంగా నిలబడేలా, నడిపించే బాధ్యతగల వ్యక్తిగా నేను నిలబడాలని అనుకుంటూ వారు చేసిన సాయానికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ వెనుదిరిగి బయలుదేరాను, ఆగిపోతుందని అనుకున్న ప్రయాణాన్ని మరలా జాగ్రత్తగా కొనసాగించడానికి.

– తిప్పాన హరిరెడ్డి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



● మల్లాది వెంకట కృష్ణమూర్తి

ప్రాచీన్ కారు కొన్నప్పటి నుంచి గమ్యం దృష్టిలో ఉంచుకొని అటు వైపు డ్రైవ్ చేస్తూంటాడు. ఆ మధ్యాహ్నం మాత్రం అతను కారుని గమ్యం లేకుండా డ్రైవ్ చేస్తున్నాడు. అతను కారెక్కి అరగంట దాటుతోంది. ట్రాఫిక్ పల్చగా ఉంది. ఎండ వల్ల హైద్రాబాద్ రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయని ప్రాచీన్ గుర్తించాడు. ఎన్నడూ లేనంతగా మండుటెండలు కాస్తున్న ఆ వేసవిలో ఆ రోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని బయలుదేరేముందు టీవీలో చదివిన స్క్రోల్ గుర్తొచ్చింది. కారులో ఏసీ ఆన్‌లో ఉన్నా, అది సౌకర్యంగా చల్లబరచలేకపోతోంది.

ప్రాచీన్ వయసు ముప్పై మూడు. అతనికి పెళ్ళై రెండేళ్ళైంది. అతని ఆ ప్రయాణానికి కారణం, అతని భార్య. పెళ్ళయ్యాక మొదటిసారి వారి మధ్య తీవ్రమైన పోట్లాట జరిగింది. అతనికి ఆ తర్వాత ఇంట్లో ఉండటం ఇష్టంలేక బయటికి వచ్చి, రోడ్ మీద పార్క్ చేసిన కారెక్కి డ్రైవ్‌కి బయలుదేరాడు.

తన తప్పు ఉందా అని అతను జరిగినది ఓసారి నెమరువేసుకున్నాడు.

వేసవి సెలవులకి అతని అక్కయ్య, ముగ్గురు పిల్లలు హైద్రాబాద్‌లోని అతని ఇంటికి వచ్చారు. అందరితో కలిసి ఉండాలని ప్రాచీన్ తల్లిదండ్రులు కూడా పల్లెటూరి నుంచి అతని ఇంటికి వచ్చారు. జనగామ దగ్గర ఉన్న వారి చిన్న ఊరు ఇప్పుడు పల్లెటూరు కాదు. జనాభా పెరిగినా దాన్ని వాళ్ళు పల్లెటూరు అనే పిలుస్తారు.

ఇంట్లో పెంపుడు కుక్కతో కలిపి తొమ్మిదిమందిని చూసుకునే బాధ్యత ప్రాచీన్ భార్య మీద పడింది. వాళ్ళు వచ్చి రెండు వారాలు దాటుతోంది. ప్రాచీన్ భార్య అందరికీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, సాయంత్రం టిఫిన్, రాత్రి భోజనం వండుతోంది.


ప్రాచీన్ అక్కకి కంటికి ఆపరేషన్ అవడంతో కొంతకాలం పొయ్యి దగ్గరికి వెళ్ళకూడదన్న కంటి డాక్టర్ సలహా వల్ల ఆవిడ అసలు వంటగదిలోకి వెళ్ళదు. ప్రాచీన్ తల్లికి అనారోగ్యం. ఆవిడ కూర్చున్న చోటు నుంచి కదలదు. మనవళ్ళతో కాలక్షేపం చేస్తుంది.

ప్రాచీన్ భార్యకి వంటతో పాటు అందరి విడిచిన బట్టలు వాషింగ్ మెషిన్‌లో వేసి ఉతకటం, ఆరేయడం, ఆరాక మడతలు పెట్టడం అదనపు బాధ్యత.

ప్రాచీన్ వయసు ముప్పై మూడు. అతనికి పెళ్ళై రెండేళ్ళైంది. అతని ఆ ప్రయాణానికి కారణం, అతని భార్య. పెళ్ళయ్యాక మొదటిసారి వారి మధ్య తీవ్రమైన పోట్లాట జరిగింది. అతనికి ఆ తర్వాత ఇంట్లో ఉండటం ఇష్టంలేక బయటికి వచ్చి, రోడ్ మీద పార్క్ చేసిన కారెక్కి డ్రైవ్‌కి బయలుదేరాడు.

తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన పనిమనిషి అదే సమయంలో సొంత ఊరికి వెళ్ళింది. సంతకం చేస్తే కాని ప్రభుత్వ ఉచితాలు రావు కాబట్టి తరచూ ఆమె తన ఊరు వెళ్ళి సంతకం చేసి వస్తూంటుంది. వెళ్ళినప్పుడల్లా రెండు, మూడు రోజుల్లో వచ్చేస్తుంది. కాని ఈసారి హైద్రాబాద్ ఎండలకి జడిసో, లేదా అంతమంది చుట్టాల వల్ల పని పెరగటం వల్లో వారమైనా తిరిగి రాలేదు. దాంతో ఇల్లు, పాత్రలు శుభ్రంచేసే పని కూడా ప్రాచీన్ భార్య చేయాల్సి వస్తోంది. పైగా కుక్కని వాకింగ్‌కి తీసుకెళ్లాలి.

# ఆవిరి



ప్రాచీన్ దంపతుల మధ్య ఆరోజు పోట్లాట చినుకుల్లా మొదలై తుఫానులా పరిణమించింది. అతిథులంతా సాలార్‌జంగ్ మ్యూజియం చూడటానికి వెళ్ళారు.

కూరలు కొని తెచ్చి అతను తన భార్యతో చెప్పాడు.

‘‘మా అక్కయ్యకి పాఠోళీ ఇష్టం. బీన్స్ తెచ్చాను. అది చెయ్యి.’’

‘‘బంగాళదుంపల కూర చేస్తాను.’’ అతని భార్య చిరాగ్గా చెప్పింది.

‘‘నేను చెప్పింది చేయొచ్చుగా?’’ భార్య చిరాకుని గమనించని ప్రాచీన్ చెప్పాడు.

‘‘బీన్స్‌ని వలవాలి. కిలో బీన్స్ వలవటానికి చాలా టైం పడుతుంది. బంగాళదుంపల కూర తేలిగ్గా వండొచ్చు.’’

ప్రాచీన్‌కి ఆడవారి కష్టం, ముఖ్యంగా ఇంటికి అతిథులు వచ్చాక భార్య పడే కష్టం తెలీదు. దాంతో అడిగాడు.

‘‘వాళ్ళు ఇంకో రెండు రోజుల్లో వెళ్ళిపోతున్నారు. నేను అడిగిన ఈ ఒక్కటి చేయొచ్చుగా?’’

వారి మధ్య మాటల యుద్ధం జరిగింది. తనవాళ్ళు రావడం తన భార్యకి ఇష్టం లేదని ప్రాచీన్‌కి అనిపించింది.

**‘ఫన్‌డే’లో ప్రచురితమయ్యే**
**ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.**
**kathakalisakshi@gmail.com**

‘‘అదేం కాదు. నేను అంతమందికి చాకిరీ చేసి డస్సిపోయాను.’’ ప్రాచీన్ భార్య చెప్పింది.

మాటా మాటా పెరిగింది. ప్రాచీన్ బయటకి వచ్చి కారెక్కి డ్రైవ్‌కి బయలుదేరాడు.

గరగర చప్పుడుకి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు. కారు ఆగిపోయింది. అతను మళ్ళీ స్టార్ట్ చేసే ప్రయత్నం చేశాడు. కాని అది స్టార్ట్ కాలేదు. కొంత మెకానిజం తెలుసు కాబట్టి అతను కారు దిగి వెళ్ళి బానెట్ తలుపు ఎత్తి చూశాడు. వెచ్చగా తెల్లటి ఆవిరి బయటికి వచ్చింది. ఇంజిన్ వేడెక్కిందని గ్రహించాడు.

కూలెంట్ ఉన్నా, బయటి అసాధారణ వేడికి, పైగా ఏసీ కూడా ఫుల్ కెపాసిటీలో ఆన్‌లో ఉండడంతో ఇంజిన్ వేడెక్కిందని అర్థమయ్యాక అతను ఇంజిన్ వంక కొద్దిసేపు చూశాడు. అతనిలో కొత్త అవగాహన కలిగింది.

ఎన్నడూ తనతో పోట్లాడని తన భార్య అంతగా ఎందుకు పోట్లాడిందో అతనికి ఇంజన్ నుంచి వెలువడే ఆవిరిని చూస్తూంటే అర్థమైంది.

గత రెండు వారాలుగా శక్తికి మించి చేస్తున్న పనివల్ల కలిగిన అలసటతో ఆమె నోట్లోంచి ఆ మాటలు వచ్చాయి తప్ప, తనవాళ్ళు రావటం ఇష్టంలేక కాదని అతనికి స్ఫురించింది. అతనిలో ఏదో ఆవిరై పోయిన భావన కలిగింది.

అతను జేబులోంచి మొబైల్ ఫోన్ తీసి తన భార్యకి ఫోన్ చేసి చెప్పసాగాడు.

‘‘సారీ... నిన్ను అపార్థం చేసుకున్నందుకు వెరీ సారీ... వస్తున్నాను.’’ ●

14వ పేజీలో..
5-7-2026 సంచిక
‘కథాకళి’కి పేరు సూచించిన
పాఠకుల పేర్లు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ధర్మానిదే తుది విజయం

కురుక్షేత్ర యుద్ధం సాగుతోంది. భీష్ముడు సైన్యాధ్యక్షుడిగా జరుగుతున్న యుద్ధంలో నాలుగవ రోజు కౌరవులు పాండవుల తాకిడికి తట్టుకోలేక వెనుకకు మరలారని సంజయుడు ధృతరాష్ట్రుడికి వివరించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు, 'సంజయా! మన వైపు భీష్ముడు, ద్రోణుడ, కృపాచార్యుడు, శల్యుడు వంటి ఇంతమంది యోధులుండగా, మనకు ఏ కారణంగా పరాజయం ఎదురవుతోంది?' అని ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా

**పాడియు సత్యముం గలరు పాండు తనూజులు నీదు పుత్రుల**
**ప్పాడికి నోడ రత్తెఱగు పాపము సేయగ జూచి తీవు న**
**క్కీడిటు సేయ కేలుడుగు గెల్పదె ధర్మువు వారి గెల్పు మీ**
**యోడుటయు ధ్రువంబు విదురోక్తులు వింటిమి గాదె యేర్పడన్.**

పాండవుల పక్షాన న్యాయం ఉంది. సత్యం ఉంది. అంతేకాక - కౌరవులు పాపం చేస్తూ ఉండగా నువ్వు చూస్తూ ఊరుకున్నావు. ఆ అధర్మం అప్పుడు మిమ్మల్ని కట్టి కుదపదా? ధర్మం జయించి తీరుతుంది. పాండవుల విజయం, మీ అపజయం నిశ్చయం. విదురుడు ఏనాడో చెప్పాడు కదా. అతడి మాటలు నువ్వు వినలేదా. అందరము విన్నాముగా. చేసిన పాపము అనుభవించక తప్పదు.. అని సంజయుడు ధృతరాష్ట్రుడికి సమాధానమిచ్చాడు.

పాండవులు ధర్మానికి కట్టుబడి ఉంటారు. సత్యాన్ని అతిక్రమించరు. కాని కౌరవులు పుట్టిన నాటి నుండి అధర్మంగానే జీవించారు. ఏనాడూ సత్యం పలుకలేదు. కౌరవులు పాండవులను మోసం



చేస్తూ ఉంటే ధృతరాష్ట్రుడు మౌనంగా ఉన్నాడు. తన కుమారులను ఏనాడూ దండించలేదు. వారి పట్ల అధర్మమే ఉంది. అధర్మం ఎప్పటికీ గెలవదు. ధర్మో రక్షతి రక్షితః అనే సూక్తి ఉండనే ఉంది. మనం ధర్మాన్ని రక్షిస్తే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది. ధర్మవర్తనులైన పాండవులకి వారి రాజ్యభాగాన్ని ఇవ్వక పోవడం అధర్మం. పాండవుల కష్టాలను తొలగించి, నీడలా కాపాడవలసిన పెద తండ్రి అయిన ధృతరాష్ట్రుడు వారి పట్ల అధర్మంగా ప్రవర్తించాడు. అందు వల్లే పాండవ పక్షాన ఎంత బలం ఉన్నా, ధర్మం అనే శక్తివంతమైన బలం లేకపోవడం వల్లే వారు ఓటమి పాలవుతారని విదురుడు చెప్పాడు.

**ఇక రామాయణంలోకి ప్రవేశిస్తే**

రావణుడు సీత పట్ల అధర్మంగా ప్రవర్తించాడు. మాయావిగా వెళ్లి, ఆమెను అపహరించి, లంకకు తీసుకువచ్చి అశోకవనంలో బంధించాడు. తన మాట వినకపోతే, ఆమెను చంపి ఫలహారం చేస్తానని బెదిరించాడు. సీతను రామునికి అప్పగించటం ధర్మం అని విభీషణుడు ఎంత చెప్పినా రావణుడు వినలేదు. వాస్తవానికి రావణుడు సకల శాస్త్ర పారంగతుడు. ఎంతటి వారినైనా ఎదిరించగల శక్తిమంతుడు. అయితేనేం, అన్నిటికంటె శక్తివంతమైన ధర్మాన్ని విడనాడాడు. తాను నాశనం కావడమే కాకుండా వంశ నాశనానికి కారకుడయ్యాడు.

శ్రీరాముడు ధర్మాన్నే నమ్ముకున్నాడు. తండ్రి మాట ప్రకారం అరణ్యవాసం చేశాడు. సుగ్రీవుని వైపు ధర్మం ఉన్న కారణంగా వాలిని సంహరించి సుగ్రీవుని కిష్కింధకు రాజును చేశాడు. సుగ్రీవునితో చేసిన ధర్మబద్ధమైన మైత్రి కారణంగా, వానరుల సాయంతో సముద్రం మీద వారధి నిర్మించి, లంకకు చేరి, రావణుడిని సంహరించగలిగాడు.

**భాగవత గాథలో**

ఉగ్రసేన మహారాజుగారి పిల్లలు దేవకీ దేవి, కంసుడు. దేవకిని వసుదేవునికిచ్చి వివాహం చేస్తాడు మహారాజు. వారిని అత్తవారింట దిగవిడిచి రావడానికి బయలుదేరతాడు కంసుడు. మార్గ మధ్యలో అశరీరవాణి, 'కంసా! నీ సోదరి గర్భాన జన్మించే ఎనిమిదవ శిశువు చేతిలో నువ్వు మరణిస్తావు' అని పలికింది. దానితో కంసుడు దేవకీవసుదేవులతో పాటు, తల్లిదండ్రులను కూడా చెరసాల పాలు చేశాడు. ఎన్ని చేసినా, కంసుడి అధర్మవర్తనం కారణంగా శ్రీకృష్ణుడి చేతిలో హతుడయ్యాడు. వంద తప్పులు చేసిన శిశుపాలుడు కూడా ధర్మం చేతిలో మరణించాడు.

**అవతార గాథలు, పురాణ ఇతిహాసాలు పరిశీలిస్తే...**

ధర్మం ఆచరించినవారు కొంతకాలం కష్టాలు అనుభవించినా, చివరకు వారిని వారి ధర్మమే రక్షించింది. అధర్మవర్తనులను శిక్షించింది.

- డా. పురాణపండ వైజయంతి

### లౌకికంగా పరిశీలిస్తే

**నేటికీ ఎంతోమంది రకరకాల వ్యాపారాల పేరుతో సామాన్యులను మోసగించడం చూస్తూనే ఉంటాం. వారి మోసం ఎంతో కాలం సాగదు. కొంతకాలానికి వారి అధర్మ ప్రవర్తన బయటపడి, వారికి శిక్ష పడుతూనే ఉంది. అందుకే ఎప్పటికైనా ధర్మానిదే విజయం అంటారు.**

వెలుగు దినపత్రిక

balajyothy
# బాలజ్యోతి

## నాన్నా క్షమించు...

జగన్నాథానికి ఒక్కడే కొడుకు. పేరు శంకరం. జులాయిగా తిరిగేవాడు. కొడుకు బాగుపడాలని నాలుగు మంచి మాటలు చెబితే వినేవాడు కాదు. శంకరానికి తండ్రి మాటలు నచ్చేవి కావు.

ఒకరోజు జగన్నాథం ఏదో మంచి విషయం చెబుతుంటే శంకరం విసుక్కున్నాడు. జగన్నాథం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇక అక్కడ ఉండలేక చేతి కర్రను తీసుకుని బయలుదేరాడు. అలసట రావడంతో ఊరు బయట ఉన్న ఓ చెట్టుకింద కూర్చున్నాడు. ఏమీ తోచక కర్రతో నేలను కొడుతుంటే కంచు పాత్ర శబ్ధం వచ్చింది.

జగన్నాథం ఆశ్చర్యపోయి ఒక రాయి తీసుకుని ఆ ప్రాంతాన్ని తవ్వాడు. ఒక కంచు చెంబు బయట పడింది. దానిమీద ఒక రేకు గట్టిగా బిగించి ఉంది. జగన్నాథం రాయితో దాని మూతను తీశాడు. ఆశ్చర్యం... అందులో నుంచి ఒక గంధర్వుడు ప్రత్యక్షమయాడు.



"కొన్ని వేల సంవత్సరాల క్రితం ఒక ముని శాపం వలన నేను ఈ పాత్రలో బంధించబడ్డాను. నీ వలన నాకు శాప విముక్తి కలిగింది. నీవేదైనా వరం కోరుకో" అన్నాడు గంధర్వుడు.

"నేను ముసలివాణ్ణి అయ్యాను. అయినా నలుగురికి ఉపయోగపడాలి. ఆ వరం ఇవ్వు స్వామీ" అని అడిగాడు జగన్నాథం.

"ఈ వయసులో కూడా నలుగురికి ఉపయోగపడాలనే ఆలోచన అభినందించదగ్గది. నీ వలన ఆకలితో ఉన్నవాళ్ళకి మేలు జరుగుతుంది" అని గంధర్వుడు ఒక పాత్రను సృష్టించి జగన్నాథానికి ఇచ్చాడు. "దీని నుంచి నీవు కోరుకున్న ఆహార పదార్థాలు వస్తాయి. నువ్వు తినవచ్చు. లేనివారికి దానం చేయ వచ్చు. కానీ దీనిని స్వార్థానికి ఉపయోగించ రాదు" అని చెప్పి అదృశ్యమయ్యాడు.

జగన్నాథం ఇంటికి వెళ్ళకుండా దగ్గరలో ఉన్న ఒక స్థలంలో చిన్న గుడిసె వేసుకుని పాత్ర సహాయంతో భోజనం చేస్తూ రోజులు వెళ్లదీశాడు. కొద్ది రోజుల తరువాత బీదవారికి మంచి భోజనం పెట్టాడు. తండ్రి బీదవారికి భోజనం పెట్టడం చూసిన శంకరం ఆశ్చర్యపోయాడు. తండ్రి దగ్గర ఏదో గుప్తధనం ఉందని, దాన్ని ఎలాగైనా సొంతం చేసుకోవాలని తండ్రి దగ్గరకు వెళ్లాడు.

"ఎంతైనా నీవు నా తండ్రివి... నా దగ్గరికి వచ్చి ఉండు. నిన్ను కంటికి రెప్పలా చూసుకుంటాను" అనడంతో కరిగిపోయాడు జగన్నాథం.

కాసేపయ్యాక "ఇంతమంది బీదవాళ్ళకి ఏవిధంగా భోజనం పెడుతున్నావు" అని మెల్లగా అడిగాడు.

కొడుకు మారిపోయాడని నమ్మి, గంధర్వుడు ఇచ్చిన పాత్ర గురించి చెప్పాడు. శంకరంలో ఆశ మొదలయ్యింది. ఆ పాత్రతో వ్యాపారం చేసి డబ్బు గడించాలనుకున్నాడు. ఆ పాత్రతో మిఠాయిలు సృష్టించి అంగడి ప్రారంభిస్తే డబ్బు సంపాదించొచ్చని అనుకున్నాడు.

ఆ రాత్రి తండ్రి భోజనం చేసి నిద్రపోయిన తరువాత అర్ధరాత్రి వేళ పాత్రను తస్కరించాడు. వేరే గదిలోకి తీసుకెళ్లి లడ్డూలు కావాలని కోరుకున్నాడు. వెంటనే పాత్రలో లడ్డూలు ప్రత్యక్షమయ్యాయి. ఒక లడ్డూ రుచి చూద్దామని నోట్లో పెట్టుకున్నాడు. ఆ లడ్డూ చేదుగా ఉంది. ఆ చేదు భరించలేక శంకరం ఒక్క అరుపు అరిచాడు. పక్క గదిలో నిద్రపోతున్న జగన్నాథం ఆ అరుపునకు లేచి వచ్చాడు. కొడుకు వద్ద పాత్ర, లడ్డు, కొడుకు చేయబోయే వ్యాపారం సంగతి తెలుసుకుని, "ఒరేయ్ నన్నే అడిగితే నీకు కావలసినవి తినడానికి ఇచ్చేవాడిని కదా! ఈ విధంగా నన్ను అడగకుండా పాత్ర తీసుకోవడం తప్పు. దానితో వ్యాపారం చేయాలనుకోవడం అసలు తప్పు. ఈ పాత్రతో కేవలం బీదవారికి సాయం చేయవచ్చు. అంతేగానీ స్వలాభం పనికి రాదు" అని వివరించాడు.

"నాన్నా నన్ను క్షమించు... నా కళ్ళు తెరిపించావు. ఇన్నాళ్ళూ నిన్ను బాధ పెట్టాను. నిజంగానే నిన్ను కంటికి రెప్పలా చూసుకొంటాను" అన్నాడు శంకరం. ఆ రోజు నుంచి తండ్రితో పాటు శంకరం అనేకమంది బీదవాళ్ళకి అన్నదానం చేస్తూ మంచివాడిగా పేరు తెచ్చుకున్నాడు.

- కంచనపల్లి వేంకట కృష్ణారావు,
హైదరాబాద్


## చుక్కలు కలపండి



## రంగులు వేయండి



## దారి చూపండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# సమీర్‌లో వచ్చిన కొత్త మార్పు

'అమ్మా.. సెలవులు ఇంకో నాలుగు రోజులు ఉంటే ఎంత బాగుండో!' మంచంపై అటు ఇటూ దొర్లుతూ నీరసంగా మూలిగాడు పదేళ్ల సమీర్. 'ఎందుకు నాన్నా?' అంది అమ్మ నవ్వుతూ. 'మళ్లీ అదే రొటీన్ అమ్మా.. పొద్దున్నే లేవడం, స్కూల్ బస్సు, హోం వర్కులు, పరీక్షలు.. చాలా బోర్!' అంటూ ముఖంపై దిండు పెట్టేసుకున్నాడు.

అమ్మ అల్మారాలోంచి సూపర్ హీరో బొమ్మ ఉన్న ఒక కొత్త స్కూల్ బ్యాగ్ తీసి సమీర్ పక్కన పెట్టింది. అది చూసి టక్కున బ్యాగ్‌ని అందుకున్నాడు. అందులోని కొత్త పుస్తకాల వాసన, రంగుల పెన్సిళ్లు చూసి.. క్షణంలో ముఖం వెలిగిపోయింది.

మరుసటి రోజు రానే వచ్చింది. కానీ ఆ కొత్త వస్తువుల మురిపెం కాస్తా కరిగిపోయింది. కొత్త యూనిఫాం వేసుకున్నా, మెరిసే షూస్ తొడుక్కున్నా సమీర్ ముఖంలో ఉత్సాహం లేదు. బయట స్కూల్ బస్ హారన్ కొట్టింది. అయిష్టంగానే వెళ్లి బస్ ఎక్కాడు.

స్కూల్ గేటు దగ్గరకు రాగానే బస్సు ఆగింది. గేటు అవతల, ఒక చెట్టు నీడన తన ఈడు పిల్లాడు నిలబడి ఉండడం చూశాడు. కానీ అతని ఒంటిపై యూనిఫాం లేదు, కాళ్లకు చెప్పులు లేవు. చిరిగిన పాత అంగీ వేసుకుని, చేతులు వెనకకు కట్టుకుని, స్కూల్ లోపలికి వెళ్తున్న పిల్లల వైపు ఆశగా, ఆరాటంగా చూస్తున్నాడు.

సమీర్, ఆ పిల్లాడి దగ్గరకెళ్లి... 'నువ్వు లోపలికి రావా? బెల్ కొట్టేస్తున్నారు' అని అడిగాడు.

ఆ పిల్లాడు సమీర్ చేతిలోని మెరుస్తున్న సూపర్ హీరో బ్యాగ్‌ని ఒకసారి చూసి, చిన్నగా నవ్వాడు.

'నువ్వు ఈ స్కూల్ కాదా?' అమాయకంగా అడిగాడు సమీర్.

'లేదు..నాన్న ఈసారి ఫీజులు కట్టలేకపోయాడు. పుస్తకాలు కూడా కొనలేదు. అందుకే ఈ ఏడాదికి చదువు ఆపేశారు. నాన్నకు తోడుగా నేను కూడా పనికి వెళ్తున్నా' అని చెప్పాడు.



కొద్దిసేపటి క్రితం వరకు 'స్కూల్‌కి వెళ్లడం ఒక భారం' అనుకున్న తన ఆలోచన ఎంత తప్పో సమీర్‌కి అప్పుడర్థమైంది.

మధ్యాహ్నం క్లాస్ టీచర్ క్లాసులోకి వచ్చి 'వెల్‌కమ్ బ్యాక్ చిల్డ్రన్! ఈ కొత్త విద్యా సంవత్సరంలో మీ లక్ష్యం ఏంటో ఒక్కొక్కరు చెప్పండి?' అంది.

'నేను డాక్టర్ అవుతాను మేడమ్!' అంది వర్ష.

'నేను స్పేస్ సైంటిస్ట్ అవుతాను!' అన్నాడు నిఖిల్.

కానీ సమీర్ మౌనంగా కూర్చున్నాడు. టీచర్ సమీర్ దగ్గరకు వచ్చి, 'ఏంటి సమీర్, కొత్త బ్యాగ్ చాలా బాగుంది..నీ గోల్ ఏంటి?' అని అడిగింది.

సమీర్ నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. 'మేడమ్.. నాకు ఈరోజు ఒక పెద్ద విషయం అర్థమైంది. స్కూల్‌కి రావడం, చదువుకోవడం అనేది అందరికీ దొరికే మామూలు విషయం కాదు, అది ఒక పెద్ద అదృష్టం. బయట చదవాలని ఆశ ఉండి కూడా చదవలేని పిల్లలు ఉన్నారు. నాకు అన్ని వసతులూ ఇచ్చినందుకు మా అమ్మానాన్నలకి నేను కృతజ్ఞతగా ఉండాలి. ఈ ఏడాది నేను కేవలం మార్కుల కోసం కాదు, నాకు దొరికిన ఈ గొప్ప అవకాశాన్ని గౌరవించడం కోసం చాలా బాగా చదువుతాను'.

క్లాస్ రూమ్ అంతా ఒక్కసారిగా పిన్ డ్రాప్ సైలెన్స్. పిల్లలందరూ సమీర్ వైపు ఆశ్చర్యంగా చూశారు.

టీచర్ కళ్లల్లో ఆనంద బాష్పాలు మెరిశాయి. ఆమె సమీర్ భుజం తట్టి, 'చాలా అద్భుతంగా చెప్పావు సమీర్. విద్య అనేది భారం కాదు. అది జీవితాన్ని మార్చే ఒక అపురూపమైన అవకాశం. ఆ విలువ తెలుసుకున్నప్పుడే నిజమైన చదువు మొదలవుతుంది' అన్నారు. క్లాస్ రూమ్ అంతా చప్పట్లతో మారుమోగిపోయింది.

సాయంత్రం ఇంటికి వచ్చిన సమీర్ తన కొత్త బ్యాగ్‌ను జాగ్రత్తగా స్టడీ టేబుల్ పై సర్ది, ఇవాళ జరిగిందంతా వాళ్లమ్మతో చెప్పాడు.

మర్నాడు లేవగానే 'ఈరోజు స్కూల్ బస్సు కంటే ముందే నేను గేట్ దగ్గర ఉండాలి. నేర్చుకోవడానికి చాలా ఉంది!' అని వాళ్లమ్మతో చెప్పాడు.

అమ్మ ముఖంలో గర్వం కనిపించింది. ఎందుకంటే సమీర్‌కు ఇప్పుడు పుస్తకాల్లోని పాఠాలే కాదు... జీవితపు విలువల పాఠం కూడా అర్థమైంది!

- యండి. ఉస్మాన్ ఖాన్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి






# ఐరావతం సాయం

• సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

సుందరవనంలో ఐరావతం అనే ఒక ఏనుగు ఉండేది. అది అన్నింటికీ సాయం చేసేది.

ఇలా ఉండగా, ఒకరోజు ఒక జింక పిల్ల ఆహారం కోసం బయలుదేరింది. దానికి ఎదురుగా ఆకస్మికంగా ఒక పెద్దపులి కనబడింది. వెంటనే అది ఆ పెద్దపులిని చూసి భయంతో ఆగిపోయింది. ఆ పులి భయానికి అది తప్పించుకోవడానికి దారి లేక అది తనకు చావు తప్పదని భావించి అక్కడ ఉన్న చోటనే కళ్ళు మూసుకొంది.

ఇంతలో అప్పుడే అక్కడికి వచ్చిన ఐరావతం అది చూసి, పరిగెత్తి వస్తున్న ఆ పులిని ఆగమని చెప్పింది. కానీ ఆ పెద్దపులి దాని మాటను పట్టించుకోకుండా ఆ జింక పైకి దూకాలని పరుగున వచ్చింది. వెంటనే ఆ ఐరావతం ఆ కళ్ళు మూసుకున్న ఆ జింకను తన తొండంతో ముందుకు ఒక్క తోపు తోసింది. ఆ జింక కొంత ముందుకు వెళ్ళి నేలపై పడిపోయింది. ఆ పులి తన పరుగును అదుపులో పెట్టుకోలేక అడ్డుగా అక్కడ జింక లేకపోవడంతో దాని వెనుక ఉన్న గోతిలో అమాంతంగా పడిపోయింది. ఆ జింక కళ్ళు తెరిచి చూసి తన ప్రాణాలు దక్కాయని సంతోషించి తనకు సాయం చేసిన ఏనుగుకు ధన్యవాదాలు తెలిపి సంతోషంతో వెళ్ళిపోయింది

ఆ గోతిలో పడిన పెద్దపులి ఏనుగుతో 'ఓ ఐరావతమా! నీవు అందరికీ సాయం చేస్తావే! మరి నన్ను కూడా కాపాడవా!' అని అరిచింది. వెంటనే ఏనుగు 'ఓ పులి రాజా! నేను ఆగమని చెబితే నీవు నా మాట వినలేదు. ఇక్కడ గొయ్యి ఉందని నాకు తెలిసే నేను నిన్ను ఆగమన్నాను. కానీ నీవు ఆగకుండా ఆ జింకపై దాడి చేయాలని చూశావు. అందుకే దాన్ని ముందుకు తోసి కాపాడాను. ఇప్పుడు నిన్ను కూడా కాపాడుతాను. నీవు భయపడకు' అని కొన్ని కలప దుంగలను, ఆకులు అలములు తెచ్చి ఆ గోతిలో వేసి దానిని కూడా కాపాడింది. ఆ పులి కూడా ఏనుగుకు ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయింది. తర్వాత ఆ ఏనుగు నడిచి పోతుండగా, దానికి 'కాపాడండీ! కాపాడండీ' అని అరుపులు వినిపించాయి. ఆ ఏనుగు పరుగున వెళ్ళి ఆ అరుపులు వచ్చిన వైపుకు వెళ్లింది. అక్కడ దానికి ఒక చిట్టి చిలుకను పట్టుకున్న ఒక నక్క కనిపించింది. ఆ చిట్టి చిలుక ఆ ఏనుగును చూసి, 'ఓ ఐరావతమా! నన్ను ఈ నక్క నుండి కాపాడవా!' అని దీనంగా అరచింది. ఆ ఏనుగు అది విని నక్కతో ఆ చిలుకను వదిలిపెట్టమని కోరింది. కానీ ఆ నక్క దాని మాటను వినలేదు. 'ఓ ఐరావతమా! నేను దొరికిన ఆహారాన్ని వదలిపెట్టేంత మూర్ఖురాలిని కాదు. నీవు ఇక్కడి నుండి వెళ్లు' అంది. అప్పుడు ఏనుగు ఒక కర్రను తన తొండంతో తీసి ఆ నక్క పైకి విసిరింది. ఆ నక్కకు ఆ కర్ర తాకి అది 'కుయ్యో! మొర్రో!' అని అరిచింది. వెంటనే దాని నోరు వదులై ఆ నోటిలోంచి ఊడిపడ్డ చిట్టి చిలుక రివ్వున ఎగురుకుంటూ ఏనుగుకు ధన్యవాదాలు చెప్పి అక్కడి నుంచి ఎగిరిపోయింది.

తనపై కర్రను విసరిన ఏనుగును చూడగానే నక్కకు చాలా కోపం వచ్చింది. అది ఏనుగుతో 'ఓ ఐరావతమా! నాకు ఆహారం లేకుండా చేస్తావా! నీ సంగతి మృగరాజు సింహానికి చెబుతాను' అని సింహం వద్దకు వెళ్లి ఐరావతం తనపై కర్రతో దాడి చేసిందని ఫిర్యాదు చేసింది.

సింహం నవ్వి 'నీవు చిట్టి చిలుకను పట్టుకొన్నావన్న సంగతి చెప్పడం లేదెందుకు? నాకు ఒక కాకి అంతా చెప్పిందిలే! ఆ చిట్టి చిలుకను నీవు పట్టుకొంటావా! చిన్న పిల్లల్ని పట్టుకోవద్దని, వారికి హాని చేయవద్దని నేను నీకు చెప్పలేదా! నీకు తగినశాస్తి జరిగింది' అని నక్కను మందలించింది. నక్క చేసేది లేక ఉస్సూరుమనుకొంటూ అక్కడి నుంచి కదిలింది. తర్వాత ఆ సింహం ఐరావతాన్ని పిలిపించి అది చేసిన సాయానికి మెచ్చి, దానిని జంతువుల ముందు ప్రశంసించి ఘనంగా సత్కరించింది.

## అలా గా!



బ్రిటిష్ కవి లార్డ్ బైరన్ కుక్కలు, పిల్లులు సహా రకరకాల జంతువులను పెంచుకునేవాడు. ఎక్కడకు వెళ్లినా తనతో పాటు ఏదో ఒక పెంపుడు జంతువును తన కూడా తీసుకువెళ్లేవాడు. కేంబ్రిడ్జిలోని ట్రినిటీ కాలేజీలో 'శునకాలకు ప్రవేశం లేదు' అనే నిబంధన ఉండేది. అదే కాలేజీలో చదువుకుంటున్న సమయంలో బైరన్ కాలేజీ నిబంధనలోని లొసుగు కనిపెట్టి, ఒకసారి తన పెంపుడు ఎలుగుబంటిని నేరుగా క్లాస్ రూమ్‌లోకి తీసుకొచ్చాడు.

## హితవచనం

**అవిరుద్ధం సుఖస్థం యో దుఃఖమార్గే నియోజయేత్**
**జన్మజన్మాన్తరే దుఃఖీ స నర స్యాదసంశయః**

తనతో ఏ వైరం లేకుండా సుఖంగా ఉన్నవాడికి దుఃఖం కలిగించినవాడు జన్మజన్మాంతరాలలో దుఃఖం పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

# అల్లరి

ALLARI



## చెప్పుకోండి

- పళ్లెంలో పక్షి. ముక్కుకు ముత్యం, తోకతో నీరు తాగుతుంది?
  **- దీపం**
- ప్రవహిస్తుంది కానీ నీరు కాదు. పట్టుకుంటే మాత్రం ప్రాణమే పోతుంది?
  **- కరెంట్**
- హద్దులేని పద్దు.. ఎన్నడూ ఆడొద్దు?
  **- అబద్ధం**

## టంగ్ ట్విస్టర్స్

Thunder sunders
thick sticks

## తేడాలు కనిపెట్టండి



**ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 10 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.**

## మీకు తెలుసా?


పుల్లగా, ఘాటుగా ఉండే సూప్.. నాలుకపైన రుచి గ్రంథులను యాక్టివ్ చేస్తుంది. జీర్ణరసాల ఉత్పత్తిని పెంచి, ఆకలిని రెట్టింపు చేస్తుంది. అందుకే, ప్రపంచవ్యాప్తంగా చాలామంది రెస్టారెంట్‌కి వెళ్లినప్పుడు భోజనానికి ముందు సూప్ తాగడానికి ఇష్టపడతారు. కానీ, చైనాలో మాత్రం భోజనం మొత్తం పూర్తయిన తర్వాతే సూప్ తాగుతారు. అది జీర్ణశక్తిని పెంచుతుందని అలా చేస్తారు.



# చింత గింజ

... ఆర్సీ కృష్ణస్వామి రాజు

కొడుకు కిరీటీ నెత్తిమీద పాలకుండ పెట్టి.. సంతకెళ్లి అమ్మి, డబ్బు తెమ్మని చెప్పింది సుగుణమ్మ. సంతలో ఓ నూనె వ్యాపారి.. 'ఇవి చిక్కటి పాలేనా?' అని అడిగాడు. 'మా అమ్మ.. పిండిన ఆవు పాలు పిండినట్లే ఇచ్చి పంపింది' అని చెప్పాడు కిరీటి. 'పాలల్లో చింత గింజ వేద్దాం! అది తేలితే చిక్కటి పాలు. లేకుంటే నీళ్ల పాలు' అన్నాడు వ్యాపారి. అలాగేనన్నాడు కిరీటి. పాలల్లో చింత గింజ వేశాడు వ్యాపారి. అది మునిగిపోయింది. తక్కువ డబ్బు ఇచ్చి, పాలు తీసుకెళ్లాడు వ్యాపారి. ఇంటికెళ్లి అమ్మకు విషయం చెప్పాడు కిరీటి. 'మంచి చింత గింజను పాలల్లో వేసినా, నూనెలో వేసినా మునుగుతుంది. వాడు నిన్ను మోసం చేశాడు. ఇలా ఉంటే వ్యాపారం చేయడం కష్టం. గట్టిగా ఉండు' అని చెప్పింది అమ్మ. కిరీటి మరుసటి వారం కూడా సంతకు వెళ్లాడు. వ్యాపారి మళ్లీ కనిపించాడు. పాలల్లో చింతగింజ వేయబోయాడు. 'పాలకన్నా నూనె చిక్కన కదా, మొదట నూనెలో వేయండి, తేలుతుందేమో చూద్దాం' అన్నాడు కిరీటి. ఇరుక్కుపోయానని తెలుసుకున్నాడు వ్యాపారి. చింతగింజను నూనెలో వేయక తప్పలేదు. అది డబుక్కున మునిగిపోయింది. తప్పు తెలుసుకున్న నూనె వ్యాపారి.. పూర్తిగా డబ్బులిచ్చి పాలు తీసుకెళ్లాడు. కొడుకు ప్రయోజకుడైనాడని సుగుణమ్మ కమ్మటి జున్ను తినిపించింది.



## పూరించండి




**బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.**




## పెద్దల మాట

జీవితంలో ఎన్ని హెచ్చు తగ్గులు వచ్చినా, మీ ఆలోచనలే మీ మూలధనంగా ముందుకు సాగాలి.

**- ఏపీజే అబ్దుల్ కలాం.**



## కనుక్కోండి



**పై బొమ్మ సరైన నీడ ఏదో కనుక్కోండి.**

## పద్యం - భావం

**మాటలాడ నేర్చి మనసు రంజిల జేసి**
**పరగ ప్రియము జెప్పి బడలకున్న**
**నొకరి చేతి సొమ్ము లూరక వచ్చునా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం:** మంచి మాటలు పలికి, మనసును రంజింపజేసి, ప్రియంగా హితవులు చెప్పి ఇతరులకు ఆనందం కలిగించినప్పుడే వారి నుంచి ధనాన్ని పొందగలుగుతాం. కాబట్టి, సుమధుర, సరస సంభాషణ అన్నివేళలా లాభదాయకం అని తెలుసుకోండి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నెమలీక

## ఏ దానం గొప్పది

- దుర్గమ్ భైతి, 9959007914



ఉదయగిరి గ్రామ పెద్ద ధర్మరాజుకు ఊరి ప్రజలంటే చాలా ఇష్టం. ప్రతి రోజు ఉదయం ప్రజల యోగ క్షేమాలు తెలుసుకున్న తర్వాతే, మిగతా పనులు ప్రారంభిస్తాడు. ప్రతి సంవత్సరం ప్రజలకు ఉపయోగపడే పనులు చేసిన వారిని గుర్తించి, స్వాతంత్ర దినోత్సవం రోజున సన్మానించడం అనవాయితీ గా చేస్తున్నాడు.

భూదానం, వస్త్ర దానం, విద్యా దానం, రక్త దానం, అన్న దానం లాంటి సామాజిక సేవా గుణం కల వారు ఊరిలో కొంత మంది ఉన్నారు.. అందులో వారెవరిని కాకుండా ధర్మరాజు ఈ సారి సన్మానానికి బీరప్పను ఎంపిక చేయడం గ్రామస్తులను ఆశ్చర్యానికి గురి చేసింది.


బీరప్ప రైతు కూలీ. వేసవి కాలంలో తన ఊరిలో చలివేంద్రము ఏర్పాటు చేసాడు.

"చాలా మందితో పోల్చుకుంటే, బీరప్ప చేసింది మామూలు సేవనే కదా" కొందరు గ్రామస్తులు ధర్మరాజును ప్రశ్నించారు.

"నిజమే. మిగతా వారు తమ కున్న దాంట్లో కొంత భాగం దానం చేసారు. అది గొప్ప విషయమే. కాదనను. వేసవి కాలం మండే ఎండలో దారి వెంబడి నడుస్తున్న బాటసారుల దాహార్తి తీర్చడానికి బీరప్ప చలివేంద్రము ఏర్పాటు చేయడమే కాకుండా, ప్రతి రోజు వాటికి నీరు అందించడం సామాన్యమైన విషయమా? బీరప్ప ఒక కూలీ. పొలంలో పని చేస్తేనే పూట గడుస్తుంది. అపరిచిత బాటసారుల కోసం అతడు నిత్యం నీటి దానం చేయడం నా దృష్టిలో అత్యుత్తమ సేవా కార్యం "అని ధర్మరాజు చెప్పగానే రచ్చబండ చప్పట్లతో మారు మ్రోగింది.

◆◆

---






### ఏవి ఎన్ని?

ఇక్కడున్న ఐదు రకాల ఆకారాల్లో ఏవి ఎన్ని వున్నాయో లెక్కపెట్టండి.



### అది ఏది

ఈ తేనెటీగలన్నీ చూడ్డానికి ఒకేలా వున్నాయి. కానీ ఒక్కటి మాత్రం మిగతావాటితో కలవదు. అది ఏది?

# చీమల సభ

బాల కథ

పద్మావతి
9490569477



అడవి మధ్యలో ఉన్న ఓ పెద్ద మర్రిచెట్టు వేర్ల దగ్గరికి చుట్టుపక్కల గ్రామాల్లో నివసిస్తున్న వేలాది చీమలు వరుసలుగా వచ్చాయి. ఒక విశాలమైన వలయంలో కూర్చున్నాయి. అందులో నల్ల చీమలు, ఎర్ర చీమలు, కుట్టే చీమలు, రెక్కల చీమలు.. ఇలా అన్ని జాతుల చీమలు ఒకేచోట చేరాయి. మధ్యలో ఒక పెద్ద రాతిపై రాణి చీమ నిలబడి ఉంది. ఆమె చుట్టూ నిశ్శబ్దం అలుముకుంది.

'మిత్రులారా..!' అని రాణి చీమ గంభీరంగా ప్రారంభించింది. 'మన నివాసాలను మనుషులు ఒక్కొక్కటిగా ఆక్రమిస్తున్నారు. ఇళ్లలో మనం కనిపిస్తే మందులు చల్లుతున్నారు. పొలాల్లో పంటలతో పాటూ మన ప్రాణాలూ పోతున్నాయి. ఆహారం దొరికే దారులన్నీ మూసుకుపోతున్నాయి. ఇలాగే కొనసాగితే మన భవిష్యత్తు ఏమవుతుంది? మన బాధలను ముఖ్యమంత్రికి చెప్పాలా? లేక ప్రకృతినే ఆశ్రయించాలా? మీ అభిప్రాయాలు చెప్పండి.. అందరం కలిసి మన సమస్యలను మనమే పరిష్కరించుకుందాం' అంది.

వెంటనే ఒక వృద్ధ చీమ లేచింది. 'రాణిగారూ! ఒకప్పుడు మనిషి ఇంట్లో పంచదార పాత్ర దగ్గరకు వెళ్తే పండగలా ఉండేది. ఇప్పుడు ఆరోగ్యం కోసం బెల్లం, ఇతర ప్రత్యామ్నాయాలు వాడుతున్నారు. ఆ బెల్లం ముక్కలను కొరకాలంటే చాలా కష్టపడుతున్నాము. ఇలాగైతే నాలాంటి వృద్ధులకు మాత్రం ఆహారం తెచ్చుకోవడం కష్టమవుతోంది.' తన బాధను చెప్పుకుంది. సమావేశానికి వచ్చిన చీమలన్నీ నవ్వినా... ఆ నవ్వులోనూ బాధ కనిపించింది.

మరో చీమ నిలబడి 'మనుషుల్లో మానవత్వం తగ్గుతుంది. ''చిన్న ప్రాణులు..' అనే జాలి కూడా లేదు. ఇంటి బయట కనిపించినా చంపేస్తున్నారు. మనం బతకడానికి స్థలం అడుగుతున్నామా?.. వాళ్ల పనులకు ఏమైనా అడ్డుపడుతున్నామా?, మనల్ని నివారించే పేరుతో ఎన్నో రకాల మందులు తెచ్చి, మన మీద చల్లేస్తున్నారు. మన నివాసాల్లో వారు వచ్చి ప్లాట్లు కట్టుకుంటున్నారు. మరి మనం ఎక్కడికి వెళ్లాలి యువరాణి!'. అని ఆవేశంగా మాట్లాడింది. ఆ మాటకు సభ మొత్తం నిశ్శబ్దమైంది. కొద్దిసేపటి తర్వాత మరో చీమ నిలబడి.. 'మనుషులు మన గూళ్లను కూల్చేస్తున్నారు. ఆహారం తగ్గిస్తున్నారు. అయినా మనం అంతరించిపోవడం లేదు. ఎందుకో తెలుసా?' అని అంది. అందరి చూపు ఆ చీమవైపు తిరిగింది.

'ఎందుకంటే.. మన బలం మన సమూహంలో ఉంది. మనలో ఒక చీమ ప్రాణంపోతే.. ఇంకో చీమ ముందుకు వెళుతుంది. ఒక దారి మూసుకుపోతే మరో దారి వెతుక్కుంటాము. ఒక గూడు పోతే ఇంకో గూడు కట్టుకుంటున్నాము. మనం మన వారసులకు ఓటమిని వారసత్వంగా ఇవ్వం.. ప్రయత్నాన్నే వారసత్వంగా ఇస్తున్నాము' అని చీమల గొప్పతనాన్ని చెప్పింది. ఆ మాటలకు రాణిచీమ చిరునవ్వు నవ్వింది.

అంతలో ఒక యువ చీమ చిరాకుగా లేచింది. 'మన శ్రమ, పట్టుదల గురించి ఆలోచించేవాళ్లే లేరు. సినిమా వాళ్లకు కూడా గౌరవం లేదు. ఏ పని చేయని ఈగ మీద సినిమా తీశారు. కానీ మన గురించి ఒక్క సినిమా కూడా తీయలేదు.' అంది. సభలో నవ్వులు వినిపించాయి. అప్పుడే వెనుక వరుసలో ఉన్న ఓ ముసలి చీమ నెమ్మదిగా ముందుకొచ్చింది.

'మన గురించి సినిమా తీయలేదని బాధపడొద్దు. పాఠశాలల్లో పిల్లలకు పట్టుదల అంటే చీమ కథే చెబుతున్నారు. స్కాట్లాండ్ రాజు ఒక చీమను చూసి పట్టుదలగా యుద్ధం చేశాడు. ఇప్పటికీ ఈ కథ చెప్పుకుంటారు.. కానీ విచిత్రం ఏమిటంటే.. కథ మాత్రం చదువుతున్నారు. అక్కడే వదిలేస్తున్నారు. మనం కనిపిస్తే మాత్రం చంపేస్తున్నారు.' అంది.

రాణిచీమ 'మిత్రులారా! మనం మనుషులను అడిగేది భూమి కాదు. భూమి మీద బతికే హక్కుని..' అని గంభీరంగా అన్నది. అందరూ ఆశ్చర్యంగా చూశారు. రాణి చీమ మాటలు పూర్తయ్యాక సభలో కాసేపు నిశ్శబ్దం అలుముకుంది. 'సరే మిత్రులారా! సమావేశానికి కొంత విరామం తీసుకుందాం. మళ్లీ మాట్లాడుకుందాం' అంది. వెంటనే అన్ని చీమలూ దగ్గర్లో ఉన్న పంచదార టీ తాగి, సభను కొనసాగించాలని.

• • •

అరగంట తర్వాత సభ మళ్లీ ప్రారంభమైంది. రాణిచీమ అందరినీ ఒకసారి చూసింది. వెంటనే వెనుక నుంచి ఒక చిన్న చీమ లేచింది. 'రాణిగారూ! మరి మనం నిజంగానే ముఖ్యమంత్రిని కలవాలా?' అని అడిగింది.

రాణి చీమ 'లేదు..' అంది.

'మరి ఎవరిని కలవాలి?'

రాణి చీమ కాసేపు మౌనంగా ఉంది. 'మిత్రుల మాటలు విన్నాక.. నాకు ఒక విషయం అర్థమైంది. మనం కలవాల్సింది ముఖ్యమంత్రిని కాదు..' అని రాణిచీమ ఏదో చెప్పబోయి ఆగింది. చీమలన్నీ - రాణిచీమ ఏమి చెబుతుందా? అని ఉత్కంఠగా చూడసాగాయి.

'మనుషుల మనసును..!' అంది. సభలో ఉన్న చీమలన్నీ ఆశ్చర్యంగా చూశాయి.

'ఎందుకంటే చట్టాలు అడవులను కాపాడగలవు. కానీ మనసు లేకపోతే ప్రకృతిని కాపాడలేవు. ధనవంతులు కావాలనే స్వార్థంతో కొంతమంది కొండలను తవ్వుతున్నారు, అడవులను నరుకుతున్నారు. పేదలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నారు.' ఆ మాటకు చీమలన్నీ చప్పట్లు కొట్టాయి.

రాణి చీమ చివరిసారిగా అందరినీ చూసింది. 'మన గురించి ఎవరూ సినిమా తీయకపోవచ్చు. మన కోసం ఎవరూ విగ్రహాలు కట్టకపోవచ్చు. మన పేరు మీద ఎవరూ అవార్డులు ఇవ్వకపోవచ్చు. కానీ ప్రపంచంలోని ప్రతి పాఠశాలలో... 'పట్టుదల, ఐక్యత' అనే పదం చెప్పినప్పుడల్లా.. మనమే మొదటి ఉదాహరణగా నిలుస్తాం.' సభలో ఒక చీమ పెద్దగా విజిల్ వేసింది.

'అందుకే మన పోరాటం ఆగకూడదు. వాళ్లు ఎంతగా మనల్ని భూమి మీద లేకుండా చేయాలని చూసినా పట్టుదలగా మనం బతికి చూపిద్దాం. మనుషుల మనసు మారే వరకూ వాళ్లతోనే వాళ్ల ఇళ్లలోనే మనం జీవిద్దాం' అని ముగించింది రాణిచీమ. చీమలు అన్నీ తృప్తిగా.. మరింత బలంగా ముందుకు కదిలాయి. అవి వచ్చిన వరుసలోనే మళ్లీ తమ నివాసాలకు వెళ్లాయి. ఆ దృశ్యాన్ని చూస్తూ మర్రిచెట్టు మీద కూర్చున్న గోరింక 'మనుషులు చీమలను అంతం చేయడానికి ఎన్నో మందులు కనిపెట్టారు. కానీ.. చీమల ఐక్యతను, క్రమశిక్షణను, పట్టుదలను చంపే మందు మాత్రం ఎప్పటికీ కనిపెట్టలేరు' అనుకుంది.

SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
8
19 ఆదివారం, జూలై 2026

యువత ఆలోచనలలో గాఢత ఉంటే...
పెద్దవారి ఆలోచనలలో
స్పష్టత, అనుభవం ఉంటాయి.
☛ నైట్ స్కీ






కథ



# అహంకారి కోడి

రామాపురం గ్రామంలో వెంకయ్య అనే మోతుబరి రైతు ఉండేవాడు. ఆయన తాతల కాలం నాటి పెద్ద మండువా ఇంట్లో అమ్మా నాన్న, అన్నా వదిన, తమ్ముడూ మరదలు, కొడుకులూ కోడళ్లతో కలిసి నివసించేవాడు. ఇంట్లోని ప్రతి ఒక్కరూ చాలా మంచివారు. మనుషులనే కాదు పశుపక్ష్యాదులను సయితం అమితంగా ప్రేమిస్తారు. కోడి, కుక్క, పిల్లి, కుందేలు, నక్షత్ర తాబేలుతోపాటు గేదెలను పోషించేవారు. ఆ జీవాలు కూడా ఇంట్లోని మనుషుల్లాగానే చాలా మంచివి. రోజూ అన్నీ కలుసుకుని కబుర్లాడుకుంటాయి. కష్ట సుఖాలను పంచుకుంటాయి. వీటిల్లో కోడికి కాస్త గర్వం ఎక్కువ. అందరికంటే తాను గొప్పనే భావన నాటుకుపోయింది.

'పొద్దున్నే అందరికంటే ముందు లేచి కొక్కొరోకో అని కూస్తేనే ఇంట్లోని వారంతా లేస్తా'రని మిత్ర జంతువుల వద్ద గొప్పలు పోయేది.

'నువ్వలా అనుకోవడం తప్పు మిత్రమా' అని పిల్లి, కుక్క నచ్చజెప్పేవి.

'అసలు నేనే లేకపోతే తెల్లవారిందన్న సంగతి కూడా ఎవరికీ తెలీదు' ఈసారి కోడి స్వరంలో అహంకారం కనిపించింది.

'నేను కూడా తెల్లవారుజామున నుంచీ అరుస్తూనే ఉంటా.. అది విని కూడా ఇంట్లో వాళ్లు నిద్ర లేవొచ్చుగా' నల్ల గేదె కల్పించుకుని అంది.

'నువ్వెన్నయినా చెప్పు.. నేను మాత్రం నీ మాటలు నమ్మనే నమ్మను' కోడినుద్దేశించి పలికింది తాబేలు.

'నమ్మకపోతే నాకేంటి..నీ ఖర్మ' రుసరుసలాడింది కోడి.

'దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది' వేదాంతం వల్లె వేసింది కుందేలు.

ఒకరోజు ఊళ్లోని కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకింది. మన అహంకారి కోడి మెడ వాల్చేసింది.




వెంకయ్య పాలేరుకు చెప్పి దాన్ని పొలంలో గుంత తీసి కప్పి పెట్టించాడు.

మరుసటి రోజు ఇంట్లోనివారంతా ఎప్పటిలాగానే మేల్కొన్నారు. పాపం అహంకారి కోడికి తెలియదనుకుంటా.. అందరూ ఎప్పట్నుంచో సెల్‌ఫోన్లో అలారం పెట్టుకుని నిద్ర లేస్తున్న విషయం. అదీ సంగతి!

**చెన్నాప్రగడ శర్మ, 9440587567**



# తీర్పు

వెంగళగిరి రాజ్యాన్ని ప్రతాప సింహుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు. తన రాజ్యంలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేవాడు. ప్రజలు సంతోషంగా ఉండేందుకు అనేక ప్రణాళికలతో ప్రతాపసింహుడు చక్కని రాజ్యపాలన చేసేవాడు.

ఒకసారి ప్రతాపసింహుడి దగ్గరకు ఒక సమస్య వచ్చింది. పండితాగ్రాం గ్రామం నుంచి ప్రజలు వచ్చి, తమ గ్రామంలో ప్రతిరోజు దొంగతనం జరుగుతుందని, విచిత్రం ఏమిటంటే ధనము దొంగతనం కాకుండా ధాన్యం మాత్రమే దొంగతనం జరుగుతుందన్నారు. ప్రజల మాటలు విన్న రాజాస్థానంలోని అధికారులంతా నవ్వారు. ప్రతాపసింహుడు మాత్రం ఎలాంటి నవ్వు లేకుండా సుదీర్ఘంగా ఆలోచించసాగాడు.

ప్రజలంతా మహారాజు సమాధానం కోసం వేచి చూస్తున్నారు. ప్రతాపసింహుడు మాట్లాడుతూ మీ గ్రామంలో జరుగుతున్నది దొంగతనం కాదని, ఆకలితనమని ప్రజలు సంతోషంగా ఉంటున్నారని అధికారులు చెబుతున్న మాట అవాస్తవమని, ధాన్యం దొంగతనం జరుగలేదని, ఆకలికై, ప్రాణాలు కాపాడుకోవడానికి ఆకలితనం జరుగుతుందన్నాడు. మహారాజు ప్రతాపసింహుడు గ్రామ ప్రజలందరికీ తలా పది బస్తాల ధాన్యం ఇచ్చి పంపాడు. ప్రజలకు తెలవకుండా వేగులను కూడా పంపాడు.

మరుసటి రోజు రాజమందిరానికి వచ్చిన వేగులు గతంలో దొంగతనం చేసిన ధాన్యం రాత్రి ఎవరో తీసుకువెళ్లి, యధా స్థానంలో వేశారన్నారు. ప్రతాపసింహుడు అధికారుల వైపు చూశాడు. తప్పుడు సమాచారమిచ్చి, నవ్వినందుకు అధికారులు తలదించుకున్నారు. మహారాజు తీర్పును గౌరవించారు. అప్పటి నుంచి మహారాజు ప్రతాపసింహుడు అధికారుల మాట పూర్తిగా నమ్మకుండా వేగుల ద్వారా సమాచారం తెచ్చుకొని ప్రజలకు సాయపడసాగాడు.

**ఉండ్రాళ్ళ రాజేశం, 9966946084**

## దారి కనుక్కోండి!

దిగువనున్న గున్న ఏనుగు మొసలికి చిక్కకుండా కనిపించే ఈ గజిబిజి దారిగుండా పైనున్న ఏనుగులను ఎలా చేరుకుంటుందో ఆ దారి కనుక్కోండి!





## తేడాలను గుర్తించండి!

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో కొన్ని తేడాలున్నాయి. అవేమిటో గుర్తించండి!

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# బుడత

బాలల కథ



## అంటరాని ముత్యం

అతని పేరు ముత్యాలు. వయస్సు పన్నెండేళ్ళు. చినిగిన అంగీ, జారిపోతున్న మాసిన నిక్కరు.. అతని అవతారం. తండ్రి సుతారు పని చేసేవాడు. రెండేళ్ల క్రితం ఒక బిల్డింగ్ నిర్మాణంలో ప్రమాదవశాత్తు మ-రణించాడు. అప్పటి నుంచి ముత్యాలుకు తన అమ్మను, నానమ్మను పోషించే బాధ్యత మీద పడింది. పేరుకే ముత్యాలు అయినా, అతని జీవితం ముత్యమంత గొప్పది కాదు.

రోడ్డు మీద చిత్తు కాగితాలు, పగిలిన గ్లాసు పెంకులు, విరిగిన ప్లాస్టిక్ గాలించీ, గాలించీ మరీ వెదుకు తుంటాడు. సాయంత్రం వాటిని అమ్మగా వచ్చిన కొద్దిపాటి రొక్కంతో కలో, గంజో త్రాగి రోజులు వెళ్లదీస్తున్నారు. నగర శివార్లలో ఒక స్లం ఏరియాలో మురికి కాలువ ప్రక్కన ఓ చిన్న గుడిసె వారి నివాసం. తండ్రి మిగిల్చిన డొక్కు సైకిలే అతనికి వారసత్వంగా వచ్చిన ఆస్తి. మరీ దూరం వెళ్ళడు. ఐదారు కిలో మీటర్ల దూరంలోనే అతని అన్వేషణ కొనసాగుతుంది.

స్కూల్ బస్సులు చూసినా, తన ఈడు పిల్లలు కబుర్లు చెప్పుకుంటూ నడిచినా, ముత్యాలుకు ప్రాణం ఉసూరు మనిపిస్తుంది.

బాలలతో పనులు చేయించడం నేరమని చట్టం ఉన్నా కూడా, అది ముత్యాలు వంటి వారికి వర్తించదు. రెక్కాడితే గానీ డొక్కాడని జీవితాలు వారివి మరి. తన మీదనే గంపెడు ఆశలు పెట్టుకుని ఉన్నాయి రెండు ప్రాణాలు. అమ్మ దగ్గరలోని అంటే రెండు కిలో మీటర్ల దూరంలోని ఒక అపార్ట్ మెంట్ లో రెండిళ్లల్లో పనికి వెళ్తుంటుంది. అంతే..

ఏదన్నా ఓట్ల పండుగ వస్తే నాయకుల ప్రసంగాలకు ఆశ్చర్య పోతుంటాడు ఆ పసి వయస్సులోనే ముత్యాలు. తీపి పదార్థాలను తినడానికి నోచుకోక పోయినా, వారి కబుర్లు మాత్రం ఎంతో తియ్యగా ఉంటుంటాయి. సమానత్వం అంటుంటారు.. సోషలిజం అంటుంటారు...అందరికీ విద్య అంటుంటారు..ఇంకా ఏవేవో చెపుతుంటారు.

నవ్వొస్తుంటుంది ముత్యాలుకు. తనకు ఆ పేరు ఎందుకు పెట్టారో అర్థం కావడం లేదు. ఒకరోజు ట్రాయ్.. ట్రాయ్.. వాహనాల చప్పుడుతో నగరం ప్రతిధ్వనించింది. పోలీసుల బూట్ల చప్పుళ్ళతో ఆ శివారు ప్రాంతం కంపించింది.

బిరబిర మంటూ వచ్చిన పోలీసులు, రోడ్లపై తిరుగుతున్న ముత్యాలుతో పాటు పలువురు చింపిరి జుత్తు గాళ్లను లాఠీలతో బాదుతూ, వాళ్ళ పెడ రెక్కలు విరిచి వ్యాన్లలోకి తోస్తున్నారు. కుక్కల వ్యాన్ లో శునకాల కంటే హీనంగా కుక్కుతున్నారు.



ముత్యాలుకు ఏమీ అర్థం కావడం లేదు. బండ బూతులు తిడుతున్నారు పోలీసులు వారిని.అలా తీసుకు వెళ్లిన ఆ ' మంద ' ను సమీపంలోని పోలీసు స్టేషన్ వెనకాలకు విసిరి వేశారు. అక్కడికి కొద్ది దూరంలోనే ఓ బహిరంగ సభలో..

కేంద్ర మంత్రి హిందీ ప్రసంగానికి తెలుగు అనువాదం అనర్గళంగా కొనసాగుతోంది.

" నేటి బాలలే రేపటి పౌరులు. ఏ బాలుడు కూడా విద్య లేకుండా ఉండకూడదు. బాల్యం మసిబారి పోకూడదు. ప్రతి బాలుడు కూడా చక్కగా చదువుకోవాలి. ప్రగతి బాటన నడవాలి. వారి సంరక్షణ ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. వారిపై దురుసు ప్రవర్తన కూడదు. స్లం ఏరియాలో అవిద్యావంతులు అయిన బాలల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తాం. వారి కుటుంబ పోషణకు ప్రభుత్వం సహాయం చేస్తుంది.." ఇలా సాగుతోంది ఆ మంత్రి గారి ప్రసంగం.

ముత్యాలు వంటి పిల్లలకు అర్థం కానిది ఏమిటంటే, కేంద్ర మంత్రి గారి రాక సందర్భంగా నగరంలో బిచ్చగాళ్ల సందడి, చిత్తు కాగితాలు ఏరుకునే వారి ఉనికి ఉండకూడదని, నగరం ఏ సమస్యలూ లేకుండా పరిశుభ్రంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అనధికార ఆదేశాలు జారీ చేసింది.

ఇంకా ఆ చింపిరి పిల్లలకు తెలియని మరో ముఖ్య విషయం మిటంటే ఆరోజు నవంబర్ 20, అంతర్జాతీయ బాలల దినోత్సవం అని.

**పంతంగి శ్రీనివాస రావు**
**: 9182203351.**



| | | | | | |
|---|---|---|---|---|---|
| 5 | | | | 4 | |
| | | 3 | 5 | | |
| | | 4 | | | 5 |
| 6 | | | 4 | | |
| | | 5 | 3 | | |
| | 1 | | | | |



### వేమన పద్యాలు

ఎలుకతోలు దెచ్చి యేడాది యుతికిన
నలుపు నలుపే కాని తెలుపు గాదు
కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన బలుకునా
విశ్వదాభిరామ వినుర వేమ

తా. ఎలుకతోలు అదేపనిగా సంవత్సరం పాటు ఉతికినా తెల్లబడదు.అదేవిధంగా కొయ్యబొమ్మను కొట్టినా మాట్లాడదు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథ

# కాలమే కలిపింది..

గురవయ్య, సుమతిలది చిన్న కుటుంబం. వారికి ఇద్దరు పిల్లలు. లిఖిత పదో తరగతి, రిషికేష్ ఆరవ తరగతి చదువుతున్నారు. వారిద్దరు పుట్టింది ఒక అమ్మ కడుపులో అయినా, వారి మధ్య ప్రేమ కంటే పోట్లాటలే ఎక్కువ. చిన్న బొమ్మ కోసమో, చాక్లెట్ కోసమో, టీవీ రిమోట్ కోసమో, కొత్త బట్టల కోసమో నిత్యం జగడాలడేవారు. ప్రతి చిన్న విషయానికి గొడవ పడి ఇల్లుపీకి పందిరేసినంత పని చేసేవారు. వాళ్ల అరుపులతో ఇల్లు ఎప్పుడూ చిన్న యుద్ధభూమిలానే ఉండేది.

సుమతి అయితే రోజూ విసిగిపోయేది.

“ఇలా రోజూ కొట్టుకుంటూ ఉంటే ఎలా? పిల్లల్ని కూడా అదుపులో పెట్టలేవా?” అంటూ భర్త గురవయ్య మీద కోప్పడేది.

అందుకు గురవయ్య నవ్వుతూ, “పిల్లలు అన్నాక అలాగే ఉంటారులే సుమతి! నిమిషం కొట్టుకుంటారు, ఐదు నిమిషాల్లో మళ్లీ కలిసిపోతారు. కాలమే వాళ్లలో మార్పు తెస్తుంది. అన్నా చెల్లెళ్ల బంధం అంటే ఏమిటో నేర్పుతుంది” అని నెమ్మదిగా చెప్పేవాడు.



సుమతి “నీతులు చెప్పడం చాలా సులువు! వాళ్లతో ఏగితే కదా మీకు తెలిసేది” అని విసుక్కుంటూ వెళ్లిపోయేది. ఒకరోజు అక్కా తమ్ముడు మధ్య గొడవ చాలా పెద్దదైంది. కోపంతో లిఖిత “ఇక నుంచి నీతో నేను మాట్లాడను, ఆడుకోను!” అంది.

రిషికేష్ కూడా మొండిగా, “నేనూ కూడా నీతో మాట్లాడను!” అన్నాడు.

అలా ఇద్దరూ విడిపోయారు. ఆ తర్వాత లిఖిత పక్క వీధిలోని పిల్లలతో ఆడుకోవడం మొదలుపెట్టింది. రిషికేష్ పక్క వీధిలోనే ఎదురింటి పిల్లలతో కలిసిపోయాడు. కానీ ఆ రెండు ఇళ్ల మధ్య చాలా ఏళ్ల నుంచీ పగ ఉండేది. మాటల్లో తేడా వస్తే కొట్టుకోవడమే. ఈ పిల్లలకు ఆ విషయం పూర్తిగా తెలియదు. వాళ్లకు ఆటలే ప్రపంచం. ఒక సాయంత్రం ఆటల మధ్యలో మాటా మాటా పెరిగి పెద్దోళ్ళు వచ్చారు, రచ్చ మొదలైంది. అరుపులు, తోపులాటలు, పరుగులతో గొడవ పెద్దదయింది.

లిఖిత ఒకవైపు, రిషికేష్ మరోవైపు చిక్కుకుపోయారు. ఇద్దరి కళ్లలో భయం. ఎలాగో మెల్లగా అక్కడ నుండి బయట పడి ఇంటి దగ్గరకు వచ్చేసారు.

లిఖిత “రిషికేష్! ఇక నుండి మనిద్దరం కలిసి మెలిసి మన ఇంటి దగ్గరే ఆడుకోవాలి” అని చెప్పింది. అందుకు రిషికేష్ “అవునక్కా! మనమిద్దరం మన ఇంట్లోనే అమ్మకు సహాయంగా ఉంటూ ఆడుకుందాం ఇలా ఇరుగుపొరుగు వాళ్ల ఇండ్లకు వెళ్లకూడదు” అన్నాడు.

లిఖిత తమ్ముడితో “రిషికేష్! ఇంక మనం ఎప్పుడూ ఇలా కొట్టుకుని విడిపోకూడదు సరేనా!” అంది.

“అలాగే!” అన్నాడు తమ్ముడు. “ఈ విషయం అమ్మా నాన్నలకు చెప్పకూడదు” అనుకున్నారు ఇద్దరు. కానీ ఆ మాటలన్నీ గుమ్మం చాటున నిలబడి గురవయ్య విన్నాడు.

“కాలమే అక్కా తమ్ముడిని కలిపింది ఇక వీరిని ఎవరూ విడదీయలేరు” అని మనసులో అనుకుని తనకు కూడా తెలియనట్లు ఉండాలని అక్కడ నుండి మెల్లిగా జారుకున్నాడు. ఇంత కాలానికి పిల్లల్లో వచ్చిన మార్పును భర్త గురవయ్యతో చెప్పి సంతోషపడింది సుమతి.

– పేరూరు బాలసుబ్రమణ్యం